మంగళవారం 4-7-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 103



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

గురి తప్పలేదు!



చిన్నప్పుడు విల్లు ఎక్కుపెట్టింది... లక్ష్యాన్ని ఛేదించింది. ఇప్పుడు పిస్టల్ గురిపెట్టింది... వరుసగా పతకాలు సాధిస్తోంది. ఆ మధ్యలో రైఫిల్‌తో కూడా సాధన చేసింది... మేఘన సాదుల. 'నాన్న దగ్గర వెపన్ చూస్తూ పెరిగాను మరి'... అంటూ... షూటింగ్ ప్రాక్టీస్... సాధించిన పతకాల గురించి చెప్పింది.

హైదరాబాద్‌లో బీటెక్ చేస్తున్న మేఘన సాదుల... అంతర్జాతీయ క్రీడాకారిణి. లక్ష్యానికి గురి పెట్టిందంటే పతకం తోనే వెనుదిరుగుతుంది. గడచిన జూన్‌లో సూల్ (జర్మనీ)లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్ షూటింగ్ పోటీల్లో 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో స్వర్ణం సాధించింది. అంతకంటే ముందు ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ షూటింగ్ చాంపియన్‌షిప్, భోపాల్‌లో జరిగిన నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్ కాంపిటీషన్స్‌లోనూ పతకాలు సాధించింది. ఖేలో ఇండియా స్కీమ్‌కి కూడా ఎంపికైంది. ఈ నెలలో సౌత్‌కొరియాలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. షూటింగ్‌లో బుల్లెట్‌లా దూసుకుపోతున్న మేఘన షూటింగ్ విషయాలతోపాటు తన ఇష్టాలు, అభిరుచులను సాక్షితో పంచుకుంది.

నాన్నే నాకు ఆదర్శం

మా నాన్న సారంగపాణి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నతస్థాయి అధికారి. నాన్నే నా రోల్‌మోడల్. నాకు నాన్న వెపన్ మీద క్రేజ్ ఉండేది. కానీ యూనిఫామ్ సర్వీస్‌లోకి రావాలనే ఆసక్తి పెద్దగా కలగలేదు. బుల్లెట్ ఎలా లోడ్ చేస్తారు, ఎలా ఎయిమ్ చేస్తారనే ఆసక్తి పిల్లలకు సహజంగానే ఉంటుంది. అయితే నాకు సిక్స్‌త్ క్లాస్‌లో ఆర్చరీ (విలువిద్య) ప్రాక్టీస్ చేసే అవకాశం వచ్చింది. ఖమ్మం ఆర్చరీ అసోసియేషన్‌లో పుట్టా శంకరయ్య నా మెంటార్. టెన్త్‌క్లాస్ వరకు కంటిన్యూ చేశాను. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ట్వెల్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు స్కూల్‌లో ఉన్న షూటింగ్ రేంజ్‌లో రైఫిల్ ప్రాక్టీస్ చేశాను. కానీ అదంత సీరియస్ ప్రాక్టీస్ కాదు. రోజూ పది నిమిషాలకంటే అవకాశం ఉండేది కాదు. సీరియస్‌గా ప్రాక్టీస్ మీద దృష్టి పెట్టింది మాత్రం కరోనా టైమ్‌లోనే.



● మేఘన సాదుల

సంగీతంతో స్నేహం

ఇంట్లోనే షూటింగ్ రేంజ్ ఉంది. రోజూ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రాక్టీస్ చేస్తాను. మధ్యాహ్న భోజనం తర్వాత రెండు-మూడు గంటల విరామం. సాయంత్రం ఫిట్‌నెస్ ప్రాక్టీస్ ఉంటుంది. ఏకాగ్రత సాధన కోసం మెడిటేషన్ చేస్తాను. ఉదయం షూటింగ్ తగ్గినప్పుడు సాయంత్రం ఓ గంట- రెండు గంటలు ప్రాక్టీస్ చేస్తాను. ప్రాక్టీస్‌లో బాగా రాణించినప్పటికీ ఒక్కోసారి పోటీల్లో రాణించలేకపోవచ్చు. నాకూ కొన్ని అనుభవాలున్నాయి. అందుకు నాకు నేనుగా ఆలోచించుకుని ఒక రొటీన్‌ని డిజైన్ చేసుకున్నాను. ఇంట్లో ఎలాగైతే షూటింగ్ తర్వాత మ్యూజిక్ వింటూ రిలాక్స్ అవుతానో, కాంపిటీషన్‌లకు వెళ్లినప్పుడు కూడా అదే రొటీన్‌ని కొనసాగించాలనుకున్నాను. ఈ గేమ్‌లో లక్ష్యాన్ని ఛేదించడానికి మెదడును చాలా కండిషన్ చేసుకుంటాం. మైండ్ అదే కండిషన్‌లో కొనసాగకూడదు. తప్పనిసరిగా రిలాక్స్ కావాలి. అలా నాకు మ్యూజిక్ ఒత్తిడిని తగ్గించే బెస్ట్ ఫ్రెండ్. సినిమాలు బాగా చూస్తాను.

కలా... నిజమా!

కరోనా టైమ్‌లో క్లాసులు ఆన్‌లైన్‌లో జరిగేవి. ఖాళీ సమయం ఎక్కువగా ఉండేది. అప్పుడు మా కోచ్ ప్రసన్న కుమార్ సూచనతో 25 మీటర్ల పిస్టల్ షూటింగ్ ప్రాక్టీస్ మొదలు పెట్టాను. నేను పూర్తిస్థాయిలో పిస్టల్ షూటింగ్ ప్రారంభించిన నాటికి మూడు వారాల్లో రాష్ట్రస్థాయి పోటీలున్నాయి. ఆ పోటీల్లో పాల్గొనడం, గోల్డ్ మెడల్ తెచ్చుకోవడం అంతా కలలా జరిగిపోయింది. అదే ఏడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో నాలుగు పతకాలు రావడంతో నా మీద నాకు నమ్మకం కలిగింది, ఆత్మవిశ్వాసం పెరిగింది. జాతీయస్థాయిలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించాను. ఉస్మానియా తరఫున ఆల్ ఇండియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. మన దేశం తరఫున ఆడటం గర్వంగా ఉంది.

సాంత్వన అమ్మ ఫోన్‌తోనే!

ఖేలో ఇండియా క్యాంప్‌లో మాకు సౌకర్యాలు చాలా బాగుంటాయి. నిపుణులు సూచించిన ఆహారం, ప్రాక్టీస్‌కు అనువైన వాతావరణం ఉంటుంది. నేను ఏమాత్రం షూటింగ్‌లో సరిగ్గా రాణించనట్లు అనిపించినా, మొదట చేసే పని అమ్మకు ఫోన్ చేయడమే. అమ్మ ఇచ్చే కౌన్సెలింగ్ నన్ను తిరిగి నా లక్ష్యం మీద దృష్టి పెట్టేలా ప్రోత్సహిస్తుంది. నా ప్రతి మూమెంట్‌లో మా అమ్మానాన్న, అన్నయ్య ఉంటారు. అన్నయ్య స్పెయిన్‌లో చదువుకుంటున్నాడు. పోటీల్లో పాల్గొనడం ఒక వైపు... ఇంజనీరింగ్‌లో క్లాసులు మరోవైపు... ఈ రెండింటినీ బాలెన్స్ చేయడం కష్టమవుతోంది. అందుకే బీటెక్‌లో ఓ ఏడాది విరామం తీసుకుని ప్రాక్టీస్ మీదనే దృష్టి పెట్టాను. షూటింగ్ లో అత్యున్నత స్థాయికి చేరాలనేది నా ఆకాంక్ష. ఆ తర్వాత బీటెక్ మైనింగ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసి, సివిల్ లేదా మైనింగ్ ఫీల్డ్‌లో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలనేది నా ఆశయం. ఇప్పటికైతే ఇదే, ఆ తర్వాత అభిప్రాయం మారవచ్చేమో'' అని నవ్వేసింది మేఘన.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : **మోహనాచారి**

ఇంటిప్స్



● మార్కెట్లో దొరికే డిష్ వాష్ బార్‌లు, లిక్విడ్‌లు మన చేతులకు హాని చేస్తాయి. రసాయనాలతో తయారయ్యే ఈ వాష్ బార్లు మన చర్మంలోని తేమని హరించి వేసి వివిధ రకాల చర్మ సమస్యలకు దారి తీస్తాయి. అందువల్ల వీటికి ప్రత్యామ్నాయం చూద్దాం...

● వెనిగర్‌లో కలిపిన నీటిలో పదినిమిషాలు గిన్నెలను నానబెట్టి తరువాత కొబ్బరి పీచు లేదా స్క్రబ్బర్‌కి బేకింగ్ సోడాని అద్దుకుని తోమితే గిన్నెలు తళతళలాడతాయి.



● గంజినీళ్లలో బేకింగ్ సోడా వేసి పదినిమిషాలు ఉంచాలి. తరువాత ఈ నీటితో గిన్నెలను తోమితే మురికితోపాటు, జిడ్డు కూడా పూర్తిగా పోతుంది.

● బేకింగ్ సోడాలో నిమ్మరసం కలిపి గిన్నెలు తోమితే జిడ్డు, వాసన వదిలి చక్కగా శుభ్రపడతాయి.

న్యూస్‌మేకర్

మాది దిగువ వీధి కాదు

'కీజ తెరు' అనంటే తమిళంలో 'దిగువ వీధి' అని అర్థం. ప్రతి ఊరిలో దిగువ వీధి ఉంటుంది. దిగువ వీధిలో ఎవరుంటారో ఊరి వారికి తెలుసు. దళితులు. వారు నివసించే ప్రాంతాన్ని ఆ విధంగా గుర్తిస్తారు. 'ఇలా పేరులో వివక్షను తొలగించండి' అని తమ వాడ పేరును మార్చడానికి సంవత్సరం పాటు పోరాడింది అనసూయ అనే అమ్మాయి. దిగువ వీధికి బదులుగా వారి వీధి మొన్నటి జూలై 1న 'ఇందిరా నగర్' అయ్యింది. వివక్ష గుర్తులను చెరిపే పోరాటం కొనసాగిస్తానని అంటోంది అనసూయ.



● ఇందిరా నగర్ బోర్డు దగ్గర తన పేట వాసులతో అనసూయ

తమిళనాడు ముఖ్యమంత్రిగా స్టాలిన్ పదవి స్వీకరించాక 2022 అక్టోబర్‌లో గ్రేటర్ చెన్నై అంతటా కులాలను సూచించే వీధుల పేర్లను, భవంతుల పేర్లను తొలగించవలసిందిగా ఆదేశించాడు. దేశంలో అన్నిచోట్ల ఉన్నట్టే తమిళనాడులో కూడా ఊళ్లలోని కొన్ని వీధులను కులాల పేర్లతో పిలవడం వాడుకలో ఉంది. సామాజిక స్పృహ పెరిగాక ఈ ధోరణి తగ్గినా చైతన్యం ఎంతో అవసరం ఉంది. ముఖ్యంగా దళితుల విషయంలో. వీరికి ఆలయాల ప్రవేశంలోగాని, ఊరి కట్టుబాట్లలో ప్రాధాన్యం ఇవ్వడంలోగాని వివక్ష పాటిస్తున్నారనే ఎన్నో వార్తలు తమిళనాడు నుంచి వింటూ ఉన్నాం. ఈ నేపథ్యంలో అనసూయ శరవణ ముత్తు అనే 28 ఏళ్ల సివిల్ ఇంజనీర్ తన ఊరిలోని తన వాడకు మర్యాదకరమైన పేరు సాధించడంలో విజయం పొందింది.

ఆది ద్రావిడార్ తెరు

తమిళనాడులోని అరియలూర్ జిల్లాలో ఆనందవాడి అనే చిన్న పల్లె ఉంది. ఆ పల్లెలో 1994లో దళితులకు పట్టాలిచ్చారు. 2000 సంవత్సరానికి 100 కుటుంబాలు అక్కడ ఇళ్లు కట్టుకుని తమ పేటకు 'ఇందిరా నగర్' అని పేరు పెట్టుకున్నారు. అయితే వారు పెట్టుకునే పేరు వారు పెట్టుకోగా ఊరు వారిని తాను 'ఎలా గుర్తించాలనుకుంటున్నదో' అలా గుర్తించి ఆ పేటను 'ఆది ద్రావిడార్ తెరు', 'పార తెరు', 'ఆది ద్రావిడార్ తెరు', 'కీజ తెరు', 'దళిత కాలనీ'... ఇలా పిలవడం మొదలెట్టింది. ఇవన్నీ కూడా దళితులు నివసించే ప్రాంతాన్ని సూచించేవే. 'నా చిన్నప్పుడు స్కూల్లో మా పేట పేరు చెప్పిన వెంటనే నేనెవరో పోల్చుకునేవారు. అప్పుడు నేను ఏమీ చేయలేకపోయాను' అని ఇదే ప్రాంతం, సామాజిక వర్గం నుంచి చదువుకుని సివిల్ ఇంజనీర్ అయిన అనసూయ శరవణముత్తు అంది. 'నేను కాలేజీ పూర్తి చేసి ఉద్యోగం కోసం వెళ్లిపోయాను. 2022లో తిరిగి వస్తే ఇంకా కులాన్ని సూచించే పేరుతోటే నా పేటను పిలుస్తున్నారు. ఇది ఎంతమాత్రం కుదరదు అని నిశ్చయించుకున్నాను' అంది అనసూయ.

అందరితో పోరాడి...

ఇందిరా నగర్ అనే పేరును రెవిన్యూ వారు ఏ మాత్రం పట్టించుకోకుండా 'దిగువ వీధి' అనే పేరుతోనే వీరి పేటను రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. అలాగే రేషన్ కార్డుల్లో, ఆధార్ కార్డుల్లో, ఓటర్ కార్డుల్లో, చివరకు పాస్‌పోర్టుల్లో కూడా ఇందిరా నగర్ అని తప్ప రకరకాల వివక్ష పేర్లతో ఇక్కడ నివసిస్తున్న దళితుల గుర్తింపు కార్డులు నమోదై ఉన్నాయి. దాంతో అనసూయ 2022 ఆగస్టు నుంచి పోరాటం మొదలెట్టింది. 'మొదట కలెక్టర్ చుట్టూ తిరిగాను. తిప్పించుకుని తిప్పించుకుని అక్టోబర్ నాటికి అఫీషియల్‌గా రికార్డుల్లో మార్చారు. కాని అసలు సమస్య పంచాయతీతో వచ్చింది. ఆనందవాడి పంచాయతీ మా పేటను దిగువ వీధి అని పిలవకూడదనే తీర్మానం చేయడానికి ఏమాత్రం ముందుకు రాలేదు. నేను పోరాడితే ఫిబ్రవరిలో తీర్మానం చేశారు. ఆ తర్వాత పంచాయితీ పెద్దలొచ్చి మా పేట ముందు బోర్డు పెట్టే కార్యక్రమంలో పాల్గొనమని ఎన్నిసార్లు తిరిగినా రాలేదు. దాని కోసం మళ్లీ పోరాడాల్సి వచ్చింది. చివరకు మొన్న జూలై 1న పంచాయతీ పెద్దలంతా వచ్చి బోర్డును నిలబెట్టి వెళ్లారు' అని తెలిపింది అనసూయ.

వివక్షాపూరితం

వెనుకబడ్డ, దళిత వర్గాలను సులువుగా గుర్తించేందుకు ఎప్పటి నుంచో వారు నివసించే ప్రాంతాలకు వివక్షాపూరితమైన పేర్లు పెట్టే ఆనవాయితీ ఉందని ఈ ఉదంతం విన్నాక అనసూయను అభినందిస్తూ విల్లుపురం ఎంపీ రవికుమార్ అన్నారు. 'నువ్వు ఎక్కడుంటావు అనే ప్రశ్నతో ఎదుటివారి కులం ఏమిటో ప్రాంతాన్ని బట్టి అర్థమవుతుంది. దీంతో వివక్ష మొదలవుతుంది. ఇలాంటి వివక్షాపూరితమైన పేర్లను రాష్ట్రమంతా తొలగించాలి' అని రవికుమార్ అన్నారు.

అనసూయలాంటి అమ్మాయిలు పూనుకుంటే అదెంత సేపు?

సాగుబడి

ఆరుద్ర కార్తె : జూలై 5 వరకు
పునర్వసు కార్తె : జూలై 6 నుంచి

బోరున్న చోటే నీటి సంరక్షణ!



● బోరు చుట్టూ ఇంకుడు గుంత నిర్మించిన దృశ్యం



● ఇంకుడు గుంత నిర్మించే ముందు ట్యాంకర్ నీరు పోసి బోరు సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న దృశ్యం

బోర్ల నుంచి ఎప్పుడంటే అప్పుడు నీటిని తోడుకోవాలంటే వానాకాలంలో వాటికి నీటిని తాపాలన్న అవసరాన్ని ఇప్పుడు చాలా మంది బోర్ల యజమానులు గుర్తిస్తున్నారు. సాధారణంగా వాన నీరు 10-15% మాత్రమే భూమిలోకి ఇంకుతుంది. బోరు చుట్టూ గుంత నిర్మిస్తే అక్కడ కురిసిన వర్షంలో 50%ని ఇంకింపజేసుకొని భూగర్భ జలాలను పెంచుకోవచ్చు. అయితే, ఎండిపోయిన, ఎండిపోతోతున్న బోర్లన్నిటికీ నీటిని ఇంకింపజేసుకునే సామర్థ్యాన్ని నిర్ధారించడం కోసం నీరు తాపే పరీక్ష చెయ్యాలని నిపుణులు చెబుతున్నారు. వాటర్ ట్యాంకర్ ద్వారా 5 వేల లీటర్ల నీటిని తీసుకువచ్చి బోరులో పోసి, నీరు లోపలికి ఎంతమేరకు వెళ్తున్నదీ పరీక్షిస్తారు. 200 మీటర్ల పరిధిలో పరిసరాల్లో ఏ బోరు నుంచీ నీటిని తోడకుండా ఉన్నప్పుడు ఈ నీటి పరీక్ష చేయాలి.

నీటి పరీక్షకు సాఫ్ట్‌వేర్ సాధనం

బోరు లోపలికి నీరు పోస్తున్నప్పుడు నీరు ఎక్కువగా బయటికి వచ్చేస్తే.. ఆ బోరుకు నీటిని ఇంకించుకునే సామర్థ్యం లేదని.. అది రీఛార్జ్ గుంత నిర్మాణానికి తగినది కాదని నిర్ధారించవచ్చు. ఒకవేళ నీరు చాలా వరకు లోపలికి ఇంకిపోతే ఆ బోరు చుట్టూ రీఛార్జ్ గుంత నిర్మాణానికి అనువుగా ఉందనుకోవచ్చు. ఈ నీటి పరీక్ష చేసేటప్పుడు ఉపయోగించే ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాధనాన్ని సికింద్రాబాద్‌కు చెందిన 'వాటర్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్' వ్యవస్థాపకులు రామ్‌మోహన్ రూపొందించారు. పేటెంట్‌కు దరఖాస్తు చేశారు. ఈ సాధనం ద్వారా బోరు వద్ద ఇంకుడుగుంత నిర్మించుకోవాలో వద్దో ఖచ్చితంగా నిర్ధారించుకోవచ్చని రామ్‌మోహన్(94401 94866) తెలిపారు.

అన్ని బోర్లూ పనికిరావు

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతంలోని ఐనోల్, రామాజిపల్లి గ్రామాల్లో ప్రాంతంలో వాటర్ అండ్ లైవ్లిహుడ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 బోరు బావుల చుట్టూ వాన నీటి రీచార్జి గుంతల నిర్మాణం కోసం ట్యాంకర్లతో నీటి పరీక్ష చేశారు. 5 బోర్లు అనుకూలమని తేలింది. 2 బోర్లు అనుకూలం కాదని తేలింది. మరో 3 బోర్లకు రీచార్జి సామర్థ్యం తక్కువగా ఉంది. కాబట్టి, రీఛార్జ్ గుంతకు బదులు ఫారం పాండ్‌ను ఏర్పాటు చేసుకోవటం మేలని నిపుణులు తేల్చారు.

ఏ బోర్లు అనుకూలం?

● బోరు బావి చుట్టూ భూమి లోపల విడి మట్టి పొరలు ఉంటే.. ఆ బోరు బావికి వాన నీటిని లోపలి పీల్చుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ● బోరు బావి చుట్టూ గట్టి మట్టి పొరలు భూమికి నీటిని పీల్చుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ● భూమి లోపల మొరం లేదా బంక మట్టి పొరలు ఉంటే నీరు ఇంకదు. ● గుట్టలు, ఎత్తయిన ప్రదేశాల్లోని బోర్లు, భూమిలో దట్టమైన సున్నపు రాయి ఉన్న బోర్లు రీచార్జ్ గుంత నిర్మాణానికి అనువు కాదు.

7న నూజివీడులో మామిడి రైతుల సదస్సు

ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా ఈ నెల 7(శుక్రవారం)న నూజివీడులో మామిడి రైతుల సదస్సు జరుగుతుంది. నూజివీడులోని ప్రభుత్వాసుపత్రి రోడ్డులో బ్రహ్మకుమారి మఠం పక్కన ఛత్రపతి సదనంలో ఉ. 9 గం. నుంచి భారతీయ కిసాన్ సంఘ్, నోఫాల ఆధ్వర్యంలో సదస్సు జరగనుంది. పలువురు శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, మామిడి ఎగుమతిదారులు పాల్గొని అనేక అంశాలపై చర్చిస్తారని నోఫా కార్యదర్శి బి. రాజేశ్ తెలిపారు. అందరూ ఆహ్వానితులే.

స్మార్ట్ సేద్యం!

● పండ్ల తోటల్లో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేసుకుంటున్న రైతులు
● సెన్సార్ల ద్వారా గాలి వేగం, తేమ, ఉష్ణోగ్రతల సమాచారం ఇస్తాయి. ఏ సమయంలో ఎంత నీరు పెట్టాలో చెబుతాయి.
● చీడపీడల ముప్పును ముందే హెచ్చరిస్తూ యాజమాన్య పద్ధతులను రైతు మొబైల్‌కు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తాయి.
● 20% ఖర్చు తగ్గి, 20% ఆదాయం పెరిగిందంటున్న అనంతపురం రైతులు

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ బహుళ ప్రయోజనాలు పొందుతున్నారు అనంతపురం జిల్లా పండ్ల తోటల రైతులు. 'ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల'ను ఏర్పాటు చేసుకుని చీడపీడలను ముందే పసిగట్టి తగిన జాగ్రత్తలు పాటిస్తూ పంట నష్టాన్ని నివారించుకుంటున్నారు. పనిలో పనిగా సస్యరక్షణ ఖర్చు సగానికి తగ్గినట్టే. నాణ్యత పెరగడమే కాదు.. ఆశించిన దిగుబడులు సాధిస్తున్నారు. ఈ సూత్రాలను 'స్మార్ట్'గా పాటిస్తూ పండ్ల తోటల్లో 'ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల' ద్వారా చక్కటి ఫలితాలను సాధిస్తున్నారు అనంతపురం రైతులు. దానిమ్మ, ద్రాక్ష, బొప్పాయి, బత్తాయి వంటి పండ్ల తోటలు సాగు చేసే పెద్ద రైతులకు వెదర్ స్టేషన్లు ఉపయుక్తంగా ఉన్నాయి. తోటల యాజమాన్యాన్ని 'స్మార్ట్' సాధనాలతో సులభతరం చేసుకోవడమే కాక ఖర్చును తగ్గించుకుంటూ అధికాదాయాన్ని ఆర్జిస్తున్నారు.

ఆటోమేటిక్ స్మార్ట్ వెదర్ స్టేషన్ సోలార్ సిస్టమ్‌తో నడుస్తుంది. భూమి రకాన్ని బట్టి 3 ఎకరాలకు ఒకటి సిఫారసు చేస్తున్నారు.. ఒకే పంటను సాగు చేసే రైతులు ఒక పరికరంతోనే సత్ఫలితాలను పొందుతున్నారు. రూ.50 వేల వ్యయంతో దీన్ని తోట మధ్యలో అమర్చుకోవాలి. భూమి లోపల కనీసం 2-3 మొక్కలను కలుపుతూ ఒక అడుగు లేదా 15 అంగుళాల లోతులో సెన్సార్‌ను పెడతారు. అలాగే, రాబోయే 14 రోజుల్లో ఉండే ఉష్ణోగ్రతలను అంచనా వేసేందుకు టవర్‌కు మధ్యలో మరో సెన్సార్‌ను ఏర్పాటు చేస్తారు.

గాలివేగం, తేమశాతం తెలుసుకునేందుకు టవర్‌కు రెండో వైపు 2.5-3 అడుగుల ఎత్తులో మరో సెన్సార్‌ను ఏర్పాటు చేస్తారు. భూమిలో ఉండే సెన్సార్ మొక్కల వేర్లకు ఏ స్థాయిలో నీరు అందుతోంది? వేర్ల దగ్గర తేమ శాతం, ఒత్తిడి ఎలా ఉందో చెబుతుంది. అలాగే రెండో సెన్సార్ ఉష్ణోగ్రతలను, మూడో సెన్సార్ ద్వారా గాలిలో తేమ శాతం, గాలి వేగం గురించి చెబుతుంది. రెయిన్ గేజ్ ద్వారా వర్షపాతాన్ని నమోదు చేస్తుంది. 3 సెన్సార్ల ద్వారా వచ్చే సమాచారాన్ని తనే విశ్లేషించుకొని రైతులకు తగిన సూచనలు, సలహాలతో మెస్సేజ్‌లు పంపుతుంది.







● బాగా పండిన బొప్పాయి, ద్రాక్ష, దానిమ్మ తోటలు



● ఆటోమేటిక్ వెదర్ స్టేషన్

ఉంటుందో కూడా రైతులకు తెలియజేస్తుంది. టవర్ లోపల సిమ్ కార్డు నిక్షిప్తం చేసి ఉంటుంది. ఇది ఎప్పటికప్పుడు టెక్స్ట్ మెసేజ్ రూపంలో రైతుకు సమాచారం వస్తుంది. రైతు తోటలో ఉండాల్సిన అవసరం లేదు. ఎక్కడున్నా సరే ప్రత్యేక యాప్ ద్వారా మెసేజ్ రూపంలో అన్ని విషయాలు ఎప్పటికప్పుడూ తెలిసిపోతాయి.

ఏమైనా తెగుళ్లు సోకినట్టు గుర్తిస్తే తప్ప అనవసరంగా మందులు కొట్టే అవసరం ఉండదు. సిఫారసు చేసిన పురుగుమందులను సిఫార్సు చేసిన మోతాదులో స్ప్రే చేయడం వలన అదనపు ఖర్చు తగ్గుతుంది. సరైన సమయంలో సరైన మందు స్ప్రే చేయడం వలన దిగుబడి కూడా పెరుగుతుంది. తెగుళ్లు, చీడపీడలు సోకకుండా ముందస్తుగా గుర్తించడం వలన పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గించుకోవచ్చు. పురుగుమందుల వినియోగం తగ్గడంతో ఆశించిన స్థాయిలో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు. పొలంలో వెదర్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకున్న తర్వాత పెట్టుబడి ఖర్చు 20% తగ్గడంతోపాటు, నాణ్యత 50%, దిగుబడి 25% వరకు పెరుగుతుంది. 20% పైగా అదనపు ఆదాయం వస్తున్నదని రైతులు చెబుతున్నారు.

చీడపీడలను ఇట్టే పసిగడుతుంది

గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంది.. ఫలానా చీడపీడలు వచ్చే అవకాశం ఉంది. ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉంది.. ఫలానా తెగులు సోకే ప్రమాదం ఉంది.. మరో గంటలో వర్షం పడే అవకాశం ఉంది వంటి హెచ్చరికలు పంపిస్తుంది. భూమిలో ఉండే సెన్సార్ ఆధారంగా ఏ సమయంలో ఎంత మేరకు నీరు పెట్టాలో చెబుతుంది. పోషక లోపాలు ఏమేరకు ఉన్నాయో గుర్తించి తగిన సిఫారసులు చేస్తుంది. చీడపీడలకు పిచికారీ చేసేందుకు వాతావరణం అనుకూలంగా ఉందో లేదో కూడా తెలియజేస్తుంది. ఎంత మోతాదులో ఎటు నుంచి పిచికారీ చేయాలో కూడా చెబుతుంది. టవర్‌కు ఉండే రెయిన్ గేజ్ ఆధారంగా పంటపొలం వద్ద ఎన్ని మిల్లీమీటర్ల వర్షపాతం పడింది? ఆ ప్రభావం పంటలపై ఏ మేరకు

– పంపాన వరప్రసాదరావు, సాక్షి, అమరావతి

మంచి ఫలితాలొస్తున్నాయి



నేను 25 ఎకరాల్లో దానిమ్మ, 10 ఎకరాల్లో ద్రాక్ష పండ్లు సాగు చేస్తున్నా. మహారాష్ట్రకు చెందిన డాక్టర్ బాబాసాహెబ్ ఘోరే శిక్షణా కార్యక్రమంలో వీటి ప్రయోజనాల కోసం తెలుసుకున్నా. రెండేళ్ల క్రితం వీటిని మా తోటల్లో ఏర్పాటు చేశాం. చాలా బాగా పనిచేస్తున్నాయి. వచ్చే సిఫార్సులకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తున్న. మంచి ఫలితాలు వస్తున్నాయి. ఏర్పాటు చేసిన ఫసల్ కంపెనీ ఏడాది పాటు ఉచితంగా సేవలందించింది. మా జిల్లాలో 10 మంది రైతులు ఈ పరికరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎకరాకు 5 టన్నులు దిగుబడి రాగా, పెట్టుబడులు పోను రూ.2-3 లక్షల వరకు నికరాదాయం వస్తోంది.

– గొని పాతిరెడ్డి, కల్యాణదుర్గం, అనంతపురం జిల్లా (9440752434)

ఇంట్లో నుంచే తోట యాజమాన్యం



నేను 64 ఎకరాల్లో దానిమ్మ, బత్తాయి, బొప్పాయి తోటలు సాగు చేస్తున్నా. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ ఏర్పాటు చేసుకున్నా. ఇంట్లో కూర్చొని వ్యవసాయం చేయొచ్చు. పంట ఏ తెగులు బారినపడుతుందో అన్న దిగులు లేదు. ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్‌కి మెస్సేజ్‌లొస్తాయి. సమాచారం చాలా పక్కాగా ఉంటుంది. అనుగుణంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటే చాలు. గతంతో పోలిస్తే నీరు 50% ఆదా అవుతుంది. 25% పెట్టుబడి ఖర్చులు తగ్గాయి. దిగుబడి పెరిగింది. పండ్ల నాణ్యత 50% పెరిగి మంచి రేటు కూడా వస్తోంది.

– సుగాలి చిన్న నాగరాజు, యలగలవంక తండా, బెలుగుప్ప మం., అనంతపురం జిల్లా (7702828062)


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 103

మంగళవారం 4-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వేట మొదలు

జొకోవిచ్ శుభారంభం. రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంప్ -10లో



సెన్సెక్స్.. 65000

19,300 పైకి నిఫ్టీ. ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను -11లో



మోదీ నివాసంపై డ్రోన్ కలకలం

దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ అధికారిక నివాసంపై డ్రోన్ ఎగురుతూ కనిపించిందన్న సమాచారం కలకలం సృష్టించింది.

వివరాలు 6లో ▸



13న చంద్రయాన్-3 ప్రయోగం

చంద్రుడిపై అన్వేషణకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్-3ని ఇస్రో ఈ నెల 13న ప్రయోగించనుంది.

వివరాలు 6లో ▸



ఇక బిహార్ వంతు...?

బిహార్‌లోనూ మహారాష్ట్ర తరహా రాజకీయానికి తెర లేవనుందా? కొరకరానికొయ్యగా మారిన రాష్ట్రాన్ని బీజేపీ గుప్పిట పట్టజూస్తోందా?

వివరాలు 6లో ▸



ఆర్థిక నివేదికల దాఖలుకు..

రాజకీయ పార్టీలు తమ ఆర్థిక నివేదికలను దాఖలు చేసేందుకు వీలుగా ప్రత్యేక పోర్టల్‌ను సీఈసీ అందుబాటులోకి తెచ్చింది.

వివరాలు 6లో ▸

అసమ్మతి శ్రుతి పెరుగుతున్న
కమల నాథస్వరం

బీజేపీలో గందరగోళ పరిస్థితులు • ముఖ్య నేతల్లో అసంతృప్తి..సమన్వయ లేమి

- జాతీయ, రాష్ట్ర నాయకత్వాల తీరుపై విమర్శలు
- మొన్న జితేందర్‌రెడ్డి ట్వీట్ కలకలం..
- తాజాగా రఘునందన్ అసంతృప్తి గళం
- అగ్రశ్రేణి నాయకులపై విమర్శలతో సంచలనం
- గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదంటున్న సీనియర్లు



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం రాష్ట్ర నేతలు చేస్తున్న రచ్చ, పార్టీలో ఇటీవలి పరిణామాలతో క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే బీజేపీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ ఏర్పడి 43 ఏళ్లు గడుస్తున్నా గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదనే అభిప్రాయం కొందరు సీనియర్లలో వ్యక్తమౌతోంది. నేతల మధ్య అభిప్రాయభేదాల వంటివి ఉన్నా ఇప్పటిలా ముఖ్యనేతలు గ్రూపులుగా, వర్గాలుగా ఏర్పడటం వంటివి చోటు చేసుకోలేదు. బహిరంగ విమర్శలు, ఆరోపణలకు దిగిన సందర్భాలు కూడా లేవు. కానీ ప్రస్తుతం జాతీయ కార్యవర్గ సభ్యులు మొదలుకుని ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు సైతం బహిరంగంగా, ట్విట్టర్ లేదా ఏదో ఒక పరోక్ష రూపాల్లో అసంతృప్తి గళం విన్పించడం, ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పార్టీకి ఇబ్బందికరంగా మారుతోందని అంటున్నారు.

చల్లార్చలేదు..చక్కదిద్దలేదు..: వాస్తవానికి పలువురు ముఖ్యనేతల్లో అసంతృప్తి, సఖ్యత కొరవడడం, పాత-కొత్త నాయకుల మధ్య సమన్వయం లేమి, గ్రూపులు లేదా వర్గాలను ప్రోత్సహించే విధంగా కొందరు వ్యవహరించడం, రాష్ట్ర రాజకీయాల్లో తామే మిగతా 2వ పేజీలో ▶

బండికి 100 కోట్లు ఎక్కడివి?



ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

2లో

- పార్టీ పదవుల భర్తీలో రాష్ట్ర అధ్యక్షుడు విఫలం
- సంజయ్‌ను మార్చేందుకు అధిష్టానం నిర్ణయం తీసుకుంది
- పార్టీ పదవులు ఖాళీగా ఉన్న విషయం నడ్డాకే తెలియదు
- మునుగోడులో గెలిపిస్తానన్న అమిత్‌షా విఫలమయ్యారు
- దుబ్బాకలో నన్ను చూసే గెలిపించారు.. పార్టీ గుర్తు చివరి అంశమే.. అధ్యక్ష పదవికి నేనూ అర్హుడినే..
- మూడు పదవుల్లో ఏదో ఒకటి ఇవ్వకుంటే నా దారి నాదే
- సేవలకు ప్రతిఫలం దక్కకుంటే నడ్డాపై మోదీకి ఫిర్యాదు చేస్తా

సరదాగా మాట్లాడిన మాటలను వక్రీకరించారు

- కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలను ధిక్కరించేలా, కించపరిచేలా నేను మాట్లాడలేదు
- పదవులు ఆశించడం తప్పేమీ కాదు
- మీడియా సమావేశంలో రఘునందన్‌రావు వివరణ

2లో

ప్రగతిభవన్‌లో అఖిలేశ్‌తో సీఎం కేసీఆర్



- కాంగ్రెస్, బీజేపీ మినహా భావ సారూప్య పార్టీలతో కలుస్తాం
- యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌తో భేటీలో కేసీఆర్
- లోక్‌సభ ఎన్నికల నాటికి జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి..
- ఖమ్మంలో రాహుల్‌వి పరిణతి లేని వ్యాఖ్యలని ధ్వజం
- యూపీలో సమాజ్‌వాదీ చీలికకు బీజేపీ కుట్ర పన్నిందన్న అఖిలేశ్ యాదవ్
- బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలన్నదే తమ ఉద్దేశమని వెల్లడి

సొంతంగా ఎదుగుతాం..
కలిసొస్తే ఆదరిస్తాం!

సాక్షి, హైదరాబాద్

బీఆర్‌ఎస్ ఏ ఇతర పార్టీకి ఏ టీమో, బీ టీమో కాదని.. భారత్‌లో గుణాత్మక మార్పు కోసం సొంతంగా జాతీయ స్థాయిలో ఎదిగేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. జాతీయ పార్టీలుగా చెప్పుకొంటున్న కాంగ్రెస్, బీజేపీ మినహా ఇతర భావసారూప్య పార్టీలను కలుపుకొని పోయేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సోమవారం రాష్ట్రానికి వచ్చిన యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఇద్దరూ కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు జాతీయ రాజకీయాల గురించి సుమారు మిగతా 2వ పేజీలో ▶

ప్రజల వద్దకు అభివృద్ధి పనులు

గత తొమ్మిదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ప్రధాని మోదీ చెప్పారు. వచ్చే తొమ్మిది నెలల కాలంలో ఈ పనుల గురించి ప్రజలకు వివరించాలని మంత్రివర్గ సహచరులను ఆయన కోరారు. సోమవారం రాత్రి ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో మోదీ అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. - 6లో

న్యూస్‌రీల్

రాష్ట్రానికి కొత్తగా 230 మెడికల్ పీజీ సీట్లు



2023–24 విద్యా సంవత్సరంలో పీజీ మెడికల్ సీట్లు భారీగా పెరగనున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో కొత్తగా 3,714 సీట్లకు అనుమతులు జారీ అయినట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు, వైద్య సంస్థల్లో 230 సీట్లు పెరగనున్నాయి.

- వివరాలు 12లో▶

డ్రైవింగ్‌లో 'భ్రాంతి' ముప్పు!



రోడ్డు ప్రమాదాల్లో 50% వరకు బ్రెయిన్ బ్యాలెన్స్ సిస్టంలో సమస్యల వల్లే జరుగుతున్నాయని అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. డ్రైవింగ్ చేయాలంటే మన కళ్ల నుంచి మెదడు వరకు కోఆర్డినేషన్ వ్యవస్థ ఉంటుందని, అది సక్రమంగా పని చేయకపోతే బ్యాలెన్స్ తప్పుతుందని వైద్యులు అంటున్నారు.

- వివరాలు 12లో▶

చేతగాక పారిపోయిన వ్యక్తా..

మా భవిష్యత్తు తేల్చేది!

రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



- పార్టీని నడపలేక అధ్యక్ష పదవికి రాజీనామా చేసి పారిపోయారు
- అలాంటి వారికి బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదు
- 4 నెలలు ఆగు.. తెలంగాణలో ఏ పార్టీ ఖతం అవుతుందో తెలిసిపోతుంది
- బీజేపీకి కాంగ్రెస్ ఎంత దూరమో బీఆర్‌ఎస్ అంతే దూరం
- బీఆర్‌ఎస్‌తో కలసి పనిచేసే చాన్స్ లేదని స్పష్టీకరణ

3లో

రిమోట్ గాంధీలా రాహుల్

- టీ కాంగ్రెస్ నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ఖమ్మం సభలో చదివారు
- కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో రూ. 4 వేల పెన్షన్ ఇస్తున్నారా?
- ఆ పార్టీకి దేశవ్యాప్తంగా రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పే దమ్ముందా?
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజం

3లో

'వంద' గెలుస్తాం..

- బీఆర్‌ఎస్‌ను బొందపెడతాం
- మీ దగ్గర ఉంటే అమెరికన్ డాలర్.. బయటకు వస్తే చెల్లని రూపాయా?
- అడ్డంకులు సృష్టించినా జనగర్జన సభ విజయవంతమైంది
- ఈ నెలాఖరులోగా బీఆర్‌ఎస్ నుంచి ప్రముఖులు కాంగ్రెస్‌లో చేరుతారు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి -3లో▶

తెలంగాణ ఇచ్చినట్టే రూ.4 వేలు ఇస్తాం

పింఛన్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- కేసీఆర్ అవినీతిని ఆపితే 55 లక్షల మందికి పింఛన్ ఇవ్వొచ్చు
- భూమికి 3 అడుగులున్నోడు కూడా రాహుల్ గురించి మాట్లాడుతున్నాడు
- గాంధీ కుటుంబం గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్ నేతలకు లేదు -3లో

రాహుల్ అబద్ధాలు వల్లెవేశారు: కేకే

ఖమ్మం సభలో రాహుల్‌గాంధీ అబద్ధాలతో కూడిన అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు విమర్శించారు. పార్లమెంటులో వ్యవసాయబిల్లును తాము వ్యతిరేకించడం వల్లనే కేంద్రం ఉపసంహరించుకొందని, కానీ సమర్థించినట్లు జాతీయ స్థాయి నేత చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

- వివరాలు 3లో▶



సమస్యలు చెబితే రాజకీయాలంటారా?

- ఉస్మానియా ఆసుపత్రిలో స్థలాభావం వల్ల రోగుల ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టదా?
- గవర్నర్ తమిళిసై మండిపాటు
- పేద రోగులకు వసతి కరువైనా పట్టదా?
- కోర్టు కేసు పేరుతో రోగుల బాధ్యత నుంచి తప్పించుకుంటారా?
- ఆసుపత్రి సందర్శన.. రోగులు, వైద్యులతో సంభాషణ -వివరాలు 2లో



రాజ్యాంగ పదవిలో ఉండి హాఫ్ నాలెడ్జ్ మాటలా?

- బాగా పనిచేస్తున్న ప్రభుత్వంపై అభాండాలు దురదృష్టకరం
- గవర్నర్‌పై మంత్రి హరీశ్‌రావు విమర్శలు
- పేదలకు వైద్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుంటే అత్యాధునిక పరికరాలు ఎందుకు సమకూరుస్తామని ప్రశ్న
- నిమ్స్‌లో రూ. 31.50 కోట్లతో రోబోటిక్ సర్జరీ సిస్టంను ప్రారంభించిన మంత్రి

-వివరాలు 2లో

ఇదండీ సంగతి



.. అదిరింది! సీఎం కాకుండా డిప్యూటీ సీఎం పదవితోనే విపక్షాలను బాగానే మ్యానేజ్ చేయొచ్చు!



ఎత్తులు పై ఎత్తులు

- రసకందాయంలో ఎన్సీపీ రగడ
- పార్టీపై పట్టుకోసం ఇరు వర్గాల యత్నాలు
- అజిత్ ఎమ్మెల్యేలపై వేటేయండి.. స్పీకర్‌కు పవార్ వర్గం ఫిర్యాదు.. కీలక నేతల బహిష్కరణ

6లో



క్లుప్తంగా...

నేడు నగరానికి రాష్ట్రపతి ముర్ము రాక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామారాజు 125వ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు. రాష్ట్రపతితోపాటు గవర్నర్ తమిళిసై, సీఎం కె. చంద్రశేఖర్‌రావు తదితరులు హాజరుకానున్నారు.

తొలిసారి నగరంలో అమెరికా వైద్యుల సేవలు

యూఎస్–హైదరాబాద్ సమగ్ర మెడికల్ క్లినిక్ ప్రారంభోత్సవం



సాక్షి, హైదరాబాద్: అట్టడుగు వర్గాలకు వైద్య సౌకర్యాలు చేరడం సమాజాభివృద్ధికి అవసరమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఏకే.ఖాన్ అన్నారు. సోమవారం బజార్‌ఘాట్లో ఏర్పాటు చేసిన యూఎస్–హైదరాబాద్ కాంప్రహెన్సివ్ మెడికల్ క్లినిక్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏకే ఖాన్ మాట్లాడారు. 'ఇది భారతదేశం– అమెరికాలో ఉన్న భారతీయులకు అమెరికన్ వైద్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన క్లినిక్. ఇక్కడ వైద్యులు ఉచిత వైద్యసేవలు అందిస్తారు. కన్సల్టేషన్, మందులు అన్నీ ఉచితమే. క్లిష్ట వ్యాధులకు వివిధ ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు. చికాగోకు చెందిన ప్రసిద్ధ కేన్సర్ నిపుణుడు, చికాగో ముస్లిం మెడికల్ అలయన్స్ వ్యవస్థాపకుడు తజమ్ముల్ హుస్సేన్ ప్రకారం ఇక్కడి రోగులు వివిధ నిపుణులతో సహా షికాగోలో ఉన్న 650 మంది వైద్య నిపుణులతో ప్రయోజనం పొందవచ్చు'అని వివరించారు.

ఏం మాట్లాడుకుని ఉంటారు?

జితేందర్‌రెడ్డి, ఈటల భేటీపై ఆసక్తి



సాక్షి, హైదరాబాద్/మొయినాబాద్ రూరల్: బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి, ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ సమీపంలోని జితేందర్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర పార్టీకి, బండి సంజయ్‌ను వ్యతిరేకించేవారికి ఈ ట్రీట్‌మెంట్ అవసరమంటూ ఓ దున్నపోతును తన్ని బలవంతంగా వ్యాన్ ఎక్కిస్తున్న వీడియోను పోస్ట్ చేస్తూ జితేందర్ చేసిన ట్వీట్ వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ ట్వీట్‌పై ఘాటుగా స్పందించిన ఈటల.. వయసు పెరిగిన కొద్దీ జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య జరిగిన ఈ భేటీలో ఏం మాట్లాడుకుని ఉంటారనేది ఆసక్తికరంగా మారింది. తన నివాసానికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ రావడంతో ఆయనను కలుసుకునేందుకు ఈటల, ఇతర నేతలు వచ్చారని జితేందర్ మీడియాకు తెలిపారు. తనకు ఈటలకు ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు. జాతీయ నాయకత్వం ఈటలకు అదనపు బాధ్యతలు ఇస్తే సంతోషిస్తామని.. ప్రస్తుత పరిస్థితుల్లో బండి సంజయ్ తప్ప మరెవ్వరూ తెలంగాణలో బీజేపీని లీడ్ చేయలేరని పేర్కొన్నారు. అధ్యక్ష పదవిపై తనకు ఆసక్తి లేదన్నారు.

బండికి రూ.100 కోట్లు ఎక్కడివి?

ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

- పార్టీ పదవుల భర్తీలో రాష్ట్ర అధ్యక్షుడు విఫలం
- సంజయ్‌ను మార్చేందుకు అధిష్టానం నిర్ణయం తీసుకుంది
- పార్టీ పదవులు ఖాళీగా ఉన్న విషయం నడ్డాకే తెలియదు
- మునుగోడులో గెలిపిస్తానన్న అమిత్ షా విఫలమయ్యారు
- దుబ్బాకలో నన్ను చూసే గెలిపించారు.. పార్టీ గుర్తు చివరి అంశమే



సాక్షి, న్యూఢిల్లీ: గత కొన్ని రోజులుగా బీజేపీ అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు..సోమవారం పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యంగా పదునైన వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ పత్రికల్లో రూ.100 కోట్ల విలువైన యాడ్‌లు ఇచ్చారని, అసలు భార్య పుస్తెలమ్మి ఎన్నికల్లో పోటీ చేసిన ఆయనకు అన్ని డబ్బులు ఎక్కడివని నిలదీశారు. రెండు, మూడేళ్లయినా పార్టీలో పదవులను భర్తీ చేయడంలో రాష్ట్ర అధ్యక్షుడు విఫలమయ్యారని విమర్శించారు. పార్టీ అధ్యక్షుడి మార్పు విషయమై వస్తున్న కథనాలు వాస్తవమేనని చెప్పారు. పార్టీ జాతీయ అధ్యక్షుడికి ఏయే పదవులు ఖాళీగా ఉన్నాయో కూడా తెలియదని విమర్శించారు. పార్టీకి ఎల్పీ నేత లేరన్న విషయమూ నడ్డాకు తెలియదన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీని గెలిపిస్తానన్న అమిత్ షా గెలిపించలేకపోయారని ధ్వజమెత్తారు. దుబ్బాకలో తనను చూసి ఓట్లేశారు తప్పితే.. పార్టీ గుర్తును చూసో, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్‌ను చూసో కాదని స్పష్టం చేశారు. తాను కోరిన పదవుల్లో ఏదో ఒకటి ఇవ్వకుంటే తన దారి తనదేనని అల్టిమేటమ్ ఇచ్చారు.

కిషన్‌రెడ్డిని కలిసిన కొద్ది సేపట్లోనే ..

రానున్న ఎన్నికల దృష్ట్యా పార్టీలో మార్పుచేర్పులపై బీజేపీ జాతీయ నాయకత్వం ఫోకస్ పెంచిన నేపథ్యంలో పార్టీ పెద్దలతో భేటీ అయ్యేందుకు రఘునందన్‌రావు ఆదివారం రాత్రి ఢిల్లీకి వచ్చారు. సోమవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. 3 గంటల సమయంలో కిషన్‌రెడ్డి నిర్వహించిన ప్రెస్‌మీట్‌లోనూ ఆయన పక్కనే కూర్చున్నారు. ఆ తర్వాత కొద్ది సేపటికి అక్కడే ఉన్న మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. అధ్యక్షుడి మార్పు విషయంలో వస్తున్న కథనాలన్నీ వాస్తవమేనని, సంజయ్‌ను మార్చేందుకే అధిష్టానం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ విషయంలో సంజయ్‌ది స్వయంకృతాపరాధం అన్నారు. 'పార్టీల ఇన్‌చార్జిలు తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్‌ల ఫొటోలు పెట్టి రూ.100 కోట్లతో పత్రికల్లో యాడ్‌లు వేశారు. పార్టీ కోసం పనిచేస్తున్న నా ఫోటోనో, ఈటల రాజేందర్ ఫొటోనో వేయలేదు. తరుణ్‌ఛుగ్‌నో, బన్సల్‌ను చూసి ప్రజలు ఓట్లేయరు కదా..'అని రఘునందన్ ప్రశ్నించారు.

జాతీయ అధ్యక్షుడికే తెలియదంటే ఎలా..?

పార్టీ శాసనభా పక్షనేత పదవి రెండేళ్లుగా ఖాళీగా ఉన్నా దానిపై బండి సంజయ్ నిర్ణయం తీసుకోలేకపోయారని, ఈ విషయమై నడ్డాను అడిగితే.. 'అవునా..నిజమా'అంటూ తననే ప్రశ్నించారని రఘునందన్ తెలిపారు. 'పదవుల నియామకంపై పార్టీ జాతీయ అధ్యక్షుడికే తెలియకుంటే ఎలా? అట్లుంది పార్టీ పరిస్థితి..'అంటూ వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్ విషయంలోనూ నాన్చుడు ధోరణినే అవలంబించారని, చివరకు ఫ్లోర్ లీడర్ పదవి అడిగిన కార్పొరేటర్ చనిపోయినా, ఇంతవరకు దానిపై నిర్ణయమే లేదని విమర్శించారు.

పదేళ్లుగా కష్టపడుతున్నా..

పార్టీ కోసం పదేళ్లుగా కష్టపడుతున్నానని రఘునందన్ అన్నారు. మధ్యలో వచ్చిన నేతలు పదవులకు పనికొస్తారు కానీ నేను పనికిరానా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి తాను సైతం అర్హుడనేనని అన్నారు. తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి, జాతీయ అధికార ప్రతినిధి పదవి, శాసనసభాపక్ష నేత పదవుల్లో ఏదో ఒకటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే తన దారి తనదేనంటూ వ్యాఖ్యానించారు. కీలక పదవులకు తనకు కులమే శాపంగా పరిణమించిందని ఆవేదన చెందారు. సేవలకు ప్రతిఫలం దక్కకుంటే నడ్డాపై ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తానని అన్నారు.

రూ.100 కోట్లు ఖర్చు చేసినా గెలవలేక పోయారు..

దుబ్బాక ఉప ఎన్నికల్లో తాను పూర్తిగా సొంత బలంతోనే గెలిచానని రఘునందన్ చెప్పారు. 'దుబ్బాకలో నేను స్వయంశక్తితో గెలిచా. నాకు ఎవరూ సహాయం చేయలేదు. ఇక్కడ పార్టీ గుర్తు చివరి అంశమే. మళ్లీ నా సొంత బలంతోనే దుబ్బాకలో గెలుస్తా'అని స్పష్టం చేశారు. తన గెలుపు తర్వాతే ఈటల పార్టీలోకి వచ్చారని గుర్తు చేశారు. మునుగోడు ఉప ఎన్నికల అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి భుజంపై చేయి వేసి మరీ నేను గెలిపిస్తానని అమిత్‌షా ప్రకటించారని, కానీ గెలిపించలేకపోయారని విమర్శించారు. రూ.100 కోట్లు ఖర్చు చేసినా గెలవలేకపోయారని అన్నారు.

సరదాగా మాట్లాడిన మాటలను వక్రీకరించారు

కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలను ధిక్కరించేలా, కించపరిచేలా నేను మాట్లాడలేదు: రఘునందన్

సాక్షి, న్యూఢిల్లీ: గత పదేళ్లుగా రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేస్తున్న తాను సరదాగా మాట్లాడిన మాటలను కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించి వార్తలు ప్రసారం చేశాయని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలను ధిక్కరించేలా, కించపరిచేలా తాను మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. సోమవారం మధ్యాహ్నం ఢిల్లీలో మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు వైరల్ కావడంతో, అధిష్టానం సూచన మేరకు సాయంత్రం తెలంగాణ భవన్‌లో రఘునందన్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ అధిష్టానాన్ని ధిక్కరించినట్లుగా, నడ్డా, అమిత్ షాల గురించి తాను మాట్లాడని మాటలను మాట్లాడినట్టుగా కొన్ని చానళ్లు ప్రసారం చేశాయన్నారు. దుబ్బాక నియోజకవర్గ పనుల కోసం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కార్యాలయానికి వచ్చినప్పుడు మీడియా ప్రతినిధులతో సరదాగా మాట్లాడిన మాటలను వక్రీకరించినట్లు చెప్పారు. అధిష్టానాన్ని ధిక్కరించి తాను తప్పుడు మాటలు మాట్లాడుతున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలను ఉపసంహరించుకోవాలని కోరారు.

గడ్కరీని కలిసేందుకే వచ్చా..

అధికారికంగా, అనధికారికంగా పార్టీ శ్రేయస్సు కోసమే తాను పనిచేస్తున్నాను తప్ప వ్యక్తిగత స్వార్థం కోసం పని చేయడం లేదని రఘునందన్ అన్నారు. పార్టీలో పదవులు ఆశించడం, పనిచేస్తున్న పరిణామ క్రమంలో పదవులు కావాలని కోరుకోవడం తప్పని అనుకోవట్లేదన్నారు. అధ్యక్ష మార్పు అంశమనేది జాతీయ నాయకత్వం పరిధిలోని అంశమని చెప్పారు. గత రెండు నెలలుగా దుబ్బాక నియోజకవర్గానికే పరిమితమై ఉన్నానని, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి తన నియోజకవర్గానికి సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద రూ.120 కోట్ల నిధులు విడుదల చేయాలని కోరేందుకే ఢిల్లీ వచ్చానని తెలిపారు.



సోమవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ అయిన సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

సొంతంగా ఎదుగుతాం.. కలిసొస్తే ఆదరిస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

రెండు గంటల పాటు చర్చించినట్టు సమాచారం.

పట్నా సమావేశం వివరాలపై..

అఖిలేశ్ యాదవ్ గత నెల 23న బీహార్ రాజధాని పట్నా వేదికగా జరిగిన ప్రతిపక్ష పార్టీల భేటీలో జరిగిన చర్చల సారాంశాన్ని కేసీఆర్‌కు వివరించారని తెలిసింది. బీఆర్‌ఎస్ సహా బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలని తాము బలంగా కోరుకుంటున్నామని చెప్పారని.. పట్నా భేటీలో పలువురు నేతలు ఈ విషయాన్ని నొక్కి చెప్పారని వివరించినట్టు సమాచారం. బీఆర్‌ఎస్‌ను ఆహ్వానిస్తే పట్నా సభకు తాము హాజరుకాబోమని తేల్చి చెప్పామంటూ ఖమ్మం సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. దీనితో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ విధానాల వల్లే బీజేపీ రాజ్యాంగ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని.. రాహుల్ గాంధీ పరిణతి లేని వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్ మరింత పలుచన అవుతోందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్టు సమాచారం.

యూపీలో సమాజ్‌వాదీ చీలికకు కుట్ర!

మహారాష్ట్రలో తాజాగా చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు, ఎన్సీపీని చీల్చేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు కేసీఆర్, అఖిలేశ్ భేటీలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. మహారాష్ట్ర తరహాలో యూపీలో సమాజ్‌వాదీ పార్టీని చీల్చి, విపక్షాన్ని బలహీనపర్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అఖిలేశ్ పేర్కొన్నట్టు సమాచారం. దీనితో గతంలో తెలంగాణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ ప్రయత్నించగా, తాము అడ్డుకున్నామని కేసీఆర్ వివరించినట్టు తెలిసింది.

జాతీయ స్థాయికి బీఆర్‌ఎస్..

ఇక ఈ నెల మూడో వారంలో కర్ణాటక రాజధాని బెంగళూరులో జరిగే విపక్షాల భేటీ అంశం ప్రస్తావనకు రాగా.. ''బీఆర్‌ఎస్ పార్టీకి ఇప్పటికే మహారాష్ట్రలో అన్ని వర్గాల నుంచి ఆదరణ లభిస్తోంది. వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు కూడా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. నాగ్‌పూర్ నుంచి షోలాపూర్ దాకా బీఆర్‌ఎస్ నిర్వహించిన సభలకు మంచి స్పందన వచ్చింది. మధ్యప్రదేశ్‌లోనూ మా పార్టీ కార్యాచరణ ప్రారంభమైంది. త్వరలోఅక్కడ పర్యటించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒడిశాలో మాజీ సీఎం కూడా బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్లమెంటు ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా ఎదుగుతుంది. ఆ దిశగా మేం సాగిస్తున్న ప్రస్థానంలో కలసి వచ్చే భావసారూప్య శక్తులను కలుపుకొనిపోతాం'' అని అఖిలేశ్‌కు కేసీఆర్ స్పష్టం చేసినట్టు తెలిసింది.

అఖిలేశ్‌కు ఘన స్వాగతం.. వీడ్కోలు

యూపీలోని లక్నో నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న అఖిలేశ్ యాదవ్‌కు మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా ప్రగతిభవన్‌కు చేరుకున్న అఖిలేశ్‌కు సీఎం కేసీఆర్ స్వాగతం పలికారు. తర్వాత జరిగిన లంచ్ భేటీలో కేసీఆర్, అఖిలేశ్‌లతో పాటు మంత్రులు వేముల, తలసాని, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎస్.వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు. భేటీ తర్వాత సాయంత్రం 5.15కు అఖిలేశ్ తిరిగి ప్రత్యేక విమానంలో బయలుదేరగా.. విమానాశ్రయంలో మంత్రులు, ఎమ్మెల్సీ వీడ్కోలు పలికారు.

అసమ్మతి శ్రుతి పెరుగుతున్న కమలనాథ స్వరం

▶ మొదటి పేజీ తరువాయి

ఫోకస్‌లో ఉండేలా, మీడియాలో తమకే ప్రచారం లభించేలా కార్యక్రమాల నిర్వహణ వంటివి రాష్ట్ర బీజేపీలో కొన్నినెలలుగా సాగుతున్నాయి. అయినా జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు అసంతృప్తిని చల్లార్చేందుకు, పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదనే విమర్శలున్నాయి. రాష్ట్ర పార్టీలో సమన్వయానికి తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్, శివప్రకాష్, అరవింద్ మీనన్‌లను ఇన్‌చార్జీలుగా నియమించినా, వారెప్పుడూ పార్టీలోని అంతర్గత సమస్యలు, నేతల మధ్య తలెత్తిన అభిప్రాయభేదాల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని కొందరు సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. పైగా ఒకరిద్దరు ముఖ్య నేతలకు ఢిల్లీ నుంచి వచ్చినప్పుడల్లా వత్తాసు పలకడం, మద్దతు తెలపడం వంటివి చేయడం వల్ల కూడా పార్టీలో పరిస్థితులు దిగజారాయని, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మరింత గందరగోళంగా తయారయ్యాయనే ఆందోళన వ్యక్తమౌతోంది. మరోవైపు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై జరుగుతున్న ప్రచారానికి తెరదించేలా జాతీయ నాయకత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం, సరైన విధంగా స్పష్టత ఇవ్వకపోవడం కూడా కేడర్‌తో పాటు ముఖ్యనేతలను సైతం అయోమయానికి గురి చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 'ఈ నెల 8న వరంగల్‌లో ప్రధాని మోదీ సభకు రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో వస్తానో..లేదో' అంటూ ఆదివారం బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర బీజేపీ ప్రస్తుత పరిస్థితిని స్పష్టం చేస్తున్నాయని పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

మాటల మంటలు..

ఇటీవల ఓ దున్నపోతును వెనకనుంచి తన్ని వ్యానెక్కించే వీడియోను ట్విటర్‌లో పోస్ట్ చేసిన పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి.. రాష్ట్ర పార్టీకి ఇదే ట్రీట్‌మెంట్ అవసరమంటూ వ్యాఖ్యానించడం కలకలం సృష్టించింది. అంతకు కొన్నిరోజుల ముందే.. సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తప్పించే అవకాశాలున్నాయనే వార్తల నేపథ్యంలో సంజయ్‌కు అనుకూలంగా ఉండే వారితో తన నివాసంలో జితేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డిలకు జాతీయపార్టీ అత్యంత ప్రాధాన్యతనివ్వడంతో పాటు తమకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వకపోవడంపై నేతల్లో అసంతృప్తి వ్యక్తం అయినట్టు వార్తలొచ్చాయి. అంతకు ముందు ఓ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి, ఓ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఇద్దరు మాజీ ఎంపీలు, ఓ ఎమ్మెల్యే విడివిడిగా మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీకి తీవ్ర నష్టాన్ని కలగజేశాయనే అభిప్రాయం వ్యక్తమైంది. రాష్ట్రంలో పార్టీ మూడో స్థానానికి పరిమితం కావడం, రాష్ట్ర అధ్యక్షుడి వైఫల్యాలు, పార్టీలో చేరికలు లేకపోవడం, ముఖ్య నాయకత్వం ఒంటెద్దు పోకడలు, ఇతర అంశాలపై చేసిన వ్యాఖ్యలు వారిలోని అసంతృప్తిని బహిర్గతం చేశాయని అంటున్నారు. ఇక ఢిల్లీలో అమిత్‌షా, జేపీ నడ్డాలతో ఈటల, రాజ్‌గోపాల్‌రెడ్డి ప్రత్యేక భేటీల సందర్భంగా, హైదరాబాద్ పర్యటనకు వచ్చిన నడ్డాతో పలువురు ముఖ్యనేతలు సమావేశమైనప్పుడు కూడా నేతలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. నడ్డాతో జాతీయ కార్యవర్గసభ్యులు వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు విడివిడిగా సమావేశమై తమ అసంతృప్తికి గల కారణాలను, పార్టీలోని తాజా పరిస్థితుల గురించి వివరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తాజాగా రఘునందన్‌రావు ఢిల్లీలో అసంతృప్తి స్వరం తీవ్రస్థాయిలో విన్పించడం బీజేపీలో మళ్లీ కలకలం రేపింది. తనకు తగిన గుర్తింపు లభించడం లేదని పేర్కొంటూ ప్రధాని మోదీ మినహా జాతీయ, రాష్ట్ర నాయకత్వాలపై విమర్శలు గుప్పించడం గమనార్హం. జాతీయ అధ్యక్షుడు నడ్డాతో పాటు అగ్రనేత అమిత్ షాల తీరుపైనా ఆయన వ్యాఖ్యలు చేయడం పార్టీ కేడర్‌ను విస్మయానికి గురిచేసింది.

అందుబాటులో ఉండండి

- బండి సంజయ్‌కు నడ్డా కార్యాలయం పిలుపు
- అర్ధరాత్రి ముంబయి నుంచి ఢిల్లీ చేరుకున్న రాష్ట్ర బీజేపీ చీఫ్
- అధ్యక్షుడి మార్పు వార్తల నేపథ్యంలో ప్రాధాన్యత
- కమిటీల నియామకం, ప్రధాని పర్యటనపై చర్చించే అవకాశం



సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు, కేంద్ర కేబినెట్‌లో మార్పులు చేర్పులపై దేశ రాజధానిలో జోరుగా ప్రచారం జరుగుతున్న సమయంలో బండి సంజయ్‌ను పార్టీ జాతీయ నాయకత్వం ఢిల్లీకి పిలిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముంబయిలో పూజా కార్యక్రమాల్లో ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌కు సోమవారం సాయంత్రం తర్వాత పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. మంగళవారం అందుబాటులో ఉండాలని కోరడంతో ఆయన అర్ధరాత్రి ముంబయి నుంచి నేరుగా ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం ఆయన నడ్డాతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యే అవకాశాలున్నాయి. ప్రధానంగా రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండిని తప్పించి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డికి పగ్గాలు అప్పగించే విషయంలో మరోసారి సంజయ్ అభిప్రాయం తెలుసుకోవడంతో పాటు ఇతర కమిటీల నియామకంపై చర్చించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎన్నికల కమిటీ, ప్రచార కమిటీ, మేనిఫెస్టో కమిటీలతో పాటు ఈ నెల 8న జరగనున్న ప్రధాని వరంగల్ పర్యటన, 9న హైదరాబాద్‌లో జరిగే దక్షిణాది రాష్ట్రాల బీజేపీ నేతల భేటీ అంశాలపైనా ఆయనతో చర్చించే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో పాటే బండిని కేంద్ర మంత్రివర్గంలో తీసుకునే విషయమై స్పష్టత ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

ఎన్నికలపై మోదీ దిశానిర్దేశం!

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సోమవారం రాత్రి వరకు జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై చర్చిస్తారనే ప్రచారం జరిగినా దానిపై స్పష్టత రాలేదు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ), కాశ్మీర్ అంశం, అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దీంతో పాటే తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తర్వాత జరిగే సార్వత్రిక ఎన్నికలకు పార్టీ సమాయత్తం కావాల్సిన తీరుపై ప్రధాని దిశానిర్దేశం చేసినట్లుగా చెబుతున్నారు.

సమస్యలు చెబితే రాజకీయాలంటారా?

ఉస్మానియా ఆసుపత్రిలో స్థలాభావం వల్ల రోగుల ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టదా?

- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మండిపాటు
- పేద రోగులకు వసతి కరువైనా పర్లేదా?
- కోర్టు కేసు పేరుతో రోగుల బాధ్యత నుంచి తప్పించుకుంటారా?
- ఆసుపత్రి సందర్శన.. రోగులు, వైద్యులతో సంభాషణ



ఉస్మానియాలో చిన్నారికి గవర్నర్ పరామర్శ

అఫ్జల్‌గంజ్, సాక్షి, హైదరాబాద్: ''రోగులు బాధపడుతున్నప్పుడు ఆ సమస్యల గురించి రాష్ట్ర ప్రథమ పౌరురాలిగా కాదు.. కనీసం సాధారణ పౌరురాలిగా అయినా చెప్పే హక్కు నాకు లేదా?''అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో స్థలాభావం వల్ల రోగులకు కలుగుతున్న ఇబ్బందులపై ఇటీవలే ట్విట్టర్ ద్వారా స్పందించిన గవర్నర్... సోమవారం నేరుగా ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించారు. జనరల్ వార్డ్, నెఫ్రాలజీ వార్డ్ తోపాటు పాత భవనంలో నాలుగో ఫ్లోర్‌లో నిర్మించిన తాత్కాలిక షెడ్‌ను కూడా ఆమె సందర్శించారు. రోగులను కలసి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యులతోనూ సంభాషించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన సేవలు అందాలన్న లక్ష్యంతో తాను చెప్పే విషయాలను ప్రభుత్వం సుహృద్భావంతో తీసుకోవాలని... గవర్నర్ రాజకీయ నేతలా మాట్లాడుతున్నారనడం సరికాదని పేర్కొన్నారు.

కోర్టులో ఉందని చేతులు దులిపేసుకుంటే ఎలా?

''రాజకీయ నేతలు, సంపన్నులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతారు. మరి పేదల పరిస్థితి ఏమిటి? వాళ్లకు రోగమొస్తే సరైన వసతి ఉండాలా వద్దా? ఈ ఆసుపత్రిలో రోజుకు 200 ఎమర్జెన్సీలు, 150 సర్జరీలు చేస్తున్నారు. 2,000 మందికిపైగా అవుట్ పేషెంట్స్‌ను వైద్యులు చూస్తున్నారు. ఇలాంటి ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన స్పేస్ లేకపోతే ఎలా? కొత్త భవంతి నిర్మాణానికి న్యాయపరమైన సమస్యలు ఉన్నాయంటూ ప్రభుత్వం చేతులు దులిపేసుకుంటే సరిపోతుందా? ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూడాల్సిన బాధ్యత లేదా? ఇప్పుడు చిన్నపాటి స్థలాల్లోనే పొడవాటి బహుళ అంతస్తుల భవనాలు కడుతున్నారు. ఇన్ని ఇబ్బందుల బదులు ఉన్న 7.5 ఎకరాల స్థలంలో అత్యాధునిక మల్టీస్టోరీడ్ బిల్డింగ్ కట్టవచ్చు కదా? మిమ్మల్ని ఎవరు ఆపుతారు? మెడికల్ కాలేజీల గురించి, కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల గురించి, మరెన్నో సౌకర్యాలు, అవార్డుల గురించి చెబుతున్నారు. కానీ అలాంటివి ఎన్ని ఉన్నా ఒక్క పేద రోగి కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్థలాభావం వల్ల బాధపడి మరణించకుండా చూడటం ఇంకా ముఖ్యం కదా?''అని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు.

3 భవనాల్లో ఉండాల్సిన వారిని ఒకే భవనంలో...

''ప్రభుత్వ సంస్థలపట్ల నాకు ప్రత్యేక శ్రద్ధ ఉంది. ఒక డాక్టర్‌ను కాబట్టి మరింత ఎక్కువగా రోగుల సంరక్షణపట్ల నా హృదయం స్పందిస్తుంది. గవర్నర్ అయ్యాక మొదటిసారిగా ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు వచ్చి కలసి ఆసుపత్రి సమస్యలపై లేఖ అందించారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన హెరిటేజ్ భవంతి భారీగా పెరిగిన రోగులతో కిక్కిరిసి ఇబ్బందికరంగా ఉంది. ఉస్మానియా అవసరాల దృష్ట్యా 3,000 నుంచి 4,000 బెడ్స్ ఉంటేగానీ సరిపోదు. మూడు భవంతుల్లో ఉండాల్సిన రోగులను ఒక్క భవనంలోనే ఉంచుతున్నారు. ఒక్కో మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగుల్ని ఉంచి సేవలు అందించాల్సిన పరిస్థితి. ఇప్పుడు కూడా ఒకే మంచంపై ముగ్గురు పిల్లలు ఉన్న పరిస్థితుల్ని నేను చూశాను. అటెండర్లకు కూడా ఉండేందుకు సరైన స్థలం లేదు. ఇక్కడ టాయిలెట్లకు సరైన తలుపులు కూడా లేకపోవడం బాధాకరం. ఇబ్బందికర పరిస్థితులున్నా వైద్యులు బాగా పనిచేస్తున్నారనీ, తమకు సరైన వైద్యం అందుతోందని రోగులు అంటున్నారు. ఈ పర్యటనలో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. రోగులకు మంచి జరగాలి అనేదే నా ఉద్దేశం. ఈ విషయంలో నన్ను ప్రశ్నించడానికి బదులుగా సమస్యకు తగిన పరిష్కారం త్వరగా చూపితే బావుంటుంది..'' అని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు.

హాఫ్ నాలెడ్జ్‌తో కామెంట్లా?

- రాజ్యాంగ పదవిలో ఉండి బాగా పనిచేస్తున్న ప్రభుత్వంపై అభాండాలు దురదృష్టకరం
- గవర్నర్‌పై హరీశ్ విమర్శలు
- పేదలకు వైద్యంపై చిత్తశుద్ధి లేకుంటే అత్యాధునిక పరికరాలు ఎందుకు సమకూరుస్తాం
- నిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ సిస్టంను ప్రారంభించిన మంత్రి



నిమ్స్‌లో రోబోటిక్ వైద్య పరికరం పనితీరును మంత్రి హరీశ్‌కు వివరిస్తున్న వైద్యులు

లక్డీకాపూల్ (హైదరాబాద్): ''రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు కొన్నిసార్లు హాఫ్ నాలెడ్జ్‌తో ప్రభుత్వం వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని కామెంట్ చేస్తున్నారు. అది వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నా'' అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నిమ్స్‌లో రూ. 31.50 కోట్లతో కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఫోర్త్ జనరేషన్ డావెన్సీ ఎక్స్‌ఐ రోబోటిక్ సర్జరీ సిస్టం సహా రూ. 16.5 కోట్లతో చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేకుంటే నిమ్స్‌లో రూ. కోట్లు ఖర్చుపెట్టి రోబోటిక్ సర్జరీ సిస్టం సహా అత్యాధునిక యంత్ర పరికరాలను ఎందుకు సమకూరుస్తుందని ప్రశ్నించారు. కొందరు బాగా పనిచేస్తున్న ప్రభుత్వం మీద అభాండాలు వేయడం, ఎక్కడేం దొరుకుందా అని చూడటం దురదృష్టకరమని పేర్కొన్నారు

దేశంలోనే పెద్దాసుపత్రిగా...

నిమ్స్‌ను కార్పొరేట్ ఆసుపత్రులకు తీసిపోని విధంగా తీర్చిదిద్దామని, అత్యాధునిక డీఎస్‌ఏ, 150 డయాలసిస్ మెషీన్లు సహా దేశంలోనే నంబర్ వన్ డయాలసిస్ సెంటర్‌ను, ఇతర అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసుకోబోతున్నామని హరీశ్ చెప్పారు. నిమ్స్ 4 వేల పడకలతో దేశంలోనే పెద్ద ఆసుపత్రిగా రికార్డు నెలకొల్పనుందని చెప్పారు.

5వ తేదీ నుంచి రోబోటిక్ సర్జరీలు..

నిమ్స్‌లో ఈ నెల 5 నుంచి రోబోటిక్ సర్జరీలు చేపట్టనున్నాం. ఈ విధానంతో ఎలాంటి కోత లేకుండానే చిన్న రంధ్రం ద్వారా ఎంత పెద్ద శస్త్రచికిత్సనైనా సులువుగా చేయవచ్చు. పొట్ట, ఛాతీ, రెక్టమ్ కెనాల్, కాలేయం తదితర అవయవాల్లో ఎంతటి క్లిష్టమైన సర్జరీలనైనా సులభంగా చేయవచ్చు. త్వరలో మరో రూ.32 కోట్ల విలువైన వైద్య పరికరాలను కూడా సమకూర్చుకోనున్నాం.
–డాక్టర్ బీరప్ప, నిమ్స్ డైరెక్టర్

ఉస్మానియాలో కొత్త భవనం నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధం

ఆసుపత్రి పరిధిలోని ప్రజాప్రతినిధులతో భేటీలో హరీశ్

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు తనను కలిసిన ఆసుపత్రి పరిధిలోని ప్రజాప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఉస్మానియా ఆసుపత్రి నూతన నిర్మాణానికి తాము అనుకూలమని ప్రజాప్రతినిధులు సచివాలయంలో జరిపిన భేటీలో ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు. పాత భవనాలు తొలగించి అయినా కొత్త నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన హరీశ్‌రావు... ఈ అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిశీలించి అఫిడవిట్ రూపంలో హైకోర్టుకు తెలియచేస్తుందన్నారు. హైకోర్టు నుంచి అనుమతి రాగానే నూతన భవన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు, వాణీదేవి, రహమత్ బేగ్, హసన్ ఎఫెండి, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, దానం నాగేందర్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి హరీశ్‌రావు హామీ నేపథ్యంలో తమ డిమాండ్ల సాధనపై తలపెట్టిన నిరసనలను వారంపాటు వాయిదా వేస్తున్నట్లు ఉస్మానియా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇక నిమ్స్ ఉద్యోగులు కోరుతున్నట్లుగా ఈపీఎఫ్ నుంచి నిమ్స్ పెన్షన్ విధానానికి మారుస్తామని హరీశ్ హామీ ఇచ్చారు.

క్లుప్తంగా...

5 నుంచి యూత్ కాంగ్రెస్ 'యువ పోరాటయాత్ర'

పోస్టర్ ఆవిష్కరించిన పీసీసీ చీఫ్ రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కోసం యూత్ కాంగ్రెస్ పోరుబాట పట్టింది. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 'యువ పోరాటయాత్ర' నిర్వహించనుంది. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్ర పోస్టర్‌ను సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువతను కేసీఆర్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని, దీన్ని ఎండగట్టడమే లక్ష్యంగా యాత్ర చేపట్టామని, ఈ మేరకు పబ్లిక్ చార్జిషీట్ వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్ణాటక మంత్రి బోసురాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి సురభి ద్వివేది పాల్గొన్నారు.

'రూ. 4 వేల పింఛన్' హామీలో తప్పేముంది

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పేద వర్గాలకు నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడంలో తప్పేముందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం కాంగ్రెస్ సభపై బీఆర్‌ఎస్ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాల్లో రూ.4 వేల పింఛన్‌ను కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఇవ్వలేదని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నించడంలో అర్థం లేదని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా రాష్ట్రాల్లో పథకాలు అమలవుతాయన్న అవగాహన కూడా వారికి లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అంటే బీజేపీ బంధువుల పార్టీ అనడంలో తప్పేమీ లేదని అన్నారు. ఖమ్మం సభతోనే కాంగ్రెస్ పార్టీ విజయానికి నాంది పలికామని, వచ్చే ఎన్నికల్లో 80 స్థానాలకుపైగా గెలిచి అధికారంలోకి వస్తామని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

కాళేశ్వరం అవినీతిపై బీఆర్‌ఎస్ వితండవాదం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై బీఆర్‌ఎస్ కొత్త పాట పాడటం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. 'రూ.80 వేల కోట్లతో కట్టిన ప్రాజెక్టులో లక్ష కోట్లు ఎలా తింటాం?'అని చేస్తున్న వితండవాదం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని సోమవారం ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. రాష్ట్రాన్ని దోచుకుతిన్న దొంగలు కాగ్ రిపోర్టునే తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కేసీఆర్ కమీషన్ల కోసం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ అడుగడుగునా అవినీతి, తప్పుడు లెక్కలేనని స్పష్టం చేశారు. ఇంత అవినీతి జరుగుతోందని తెలిసినా బీజేపీ ఎందుకు సీబీఐ విచారణకు ఆదేశించడం లేదని నిలదీశారు. కేసీఆర్ బీజేపీకి బీ టీం కాకపోతే విచారణకు ఎందుకు ఆదేశించడం లేదో కేంద్ర పెద్దలు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

ఒక్క గెలుపుతోనే ఎగిరెగిరి పడుతున్న కాంగ్రెస్

ధ్వజమెత్తిన డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచినందుకే ఆ పార్టీ నాయకులు ఎగిరెగిరి పడుతున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఖమ్మం జనగర్జన సభలో కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలపై అరుణ స్పందించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బీజేపీకి బీ టీం బీఆర్‌ఎస్ అని అనడం సిగ్గుచేటన్నారు. ఇటీవల పలు ప్రతిపక్షపార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ వద్దకు కాంగ్రెస్ దూత గా అఖిలేశ్‌ను ఆ పార్టీ పంపించిందని అరుణ ఆరోపించారు.

చేతగాక పారిపోయిన వ్యక్తా.. మా భవిష్యత్తు తేల్చేది!

రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

- పార్టీని నడపలేక అధ్యక్ష పదవికి రాజీనామా చేసి పారిపోయారు
- అలాంటి వారికి బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదు
- 4 నెలలు ఆగు.. తెలంగాణలో ఏ పార్టీ ఖతం అవుతుందో తెలిసిపోతుంది
- బీజేపీకి కాంగ్రెస్ ఎంత దూరమో బీఆర్‌ఎస్ అంతే దూరం
- బీఆర్‌ఎస్‌తో కలసి పనిచేసే చాన్స్ లేదని స్పష్టీకరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి. చిత్రంలో రఘునందన్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీజేపీ భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉండాలో తేల్చాల్సింది తెలంగాణ ప్రజలేగానీ.. అసమర్థుడైన రాహుల్‌గాంధీ కాదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణలో బీజేపీ ఖతమైపోయిందంటూ ఖమ్మం సభలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మిడిమిడి జ్ఞానంతో, ఏమాత్రం అవగాహన లేకుండా రాహుల్ చేసిన ఉపన్యాసం విని ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఏ పార్టీ ఖతం అవుతుందనేది నాలుగు నెలల్లో రాహుల్‌కు అర్థం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ డీఎన్‌ఏ ఒక్కటేనని.. రెండు పార్టీలు నాణేనికి బొమ్మాబొరుసు లాంటివని పేర్కొన్నారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

ఎమ్మెల్యేలనే కాపాడుకోలేక..

కాంగ్రెస్ పార్టీని నడపలేనంటూ, చేతగానితనంతో అధ్యక్ష పదవికి రాజీనామా చేసి పారిపోయిన రాహుల్ గాంధీకి బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. "2018లో తెలంగాణ ప్రజలు 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే.. 12 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. కొందరు అమ్ముడుపోతే, మరికొందరు పదవుల కోసం పార్టీ ఫిరాయించారు. అంతేగాక తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలందరూ కట్టగట్టుకొని బీఆర్‌ఎస్‌లో విలీనం చేసిన చరిత్ర రాహుల్‌గాంధీకి గుర్తుకులేదా?" అని ప్రశ్నించారు.

గతాన్ని కప్పిపుచ్చుకునేందుకే బీజేపీపై విమర్శలు

గత నెలలో పట్నాలో జరిగిన విపక్షాల సమావేశంలో కాంగ్రెస్‌తో కలసి పాల్గొన్న అఖిలేశ్ యాదవ్ ఇప్పుడు హైదరాబాద్ వచ్చి కేసీఆర్‌ను కలవడం వెనక వాళ్ల బంధమేంటో అర్థమవుతోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ కాంగ్రెస్‌లోనే నాయకుడిగా ఎదిగారని.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల డీఎన్‌ఏలు ఒక్కటేనని వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్‌ఎస్‌తో కలసి పని చేసిన విషయాన్ని కప్పిపుచ్చుకొనేందుకే.. బీజేపీపై రాహుల్‌గాంధీ అనవసర విమర్శలు చేస్తున్నారని చెప్పారు. బీజేపీకి కాంగ్రెస్ ఎంత దూరమో బీఆర్‌ఎస్ అంతే దూరమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌తో కలసి బీజేపీ ఎప్పుడూ పనిచేయలేదని, భవిష్యత్‌లోనూ కలసి పనిచేయబోమని చెప్పారు. తెలంగాణలో మజ్లిస్‌ను పెంచిపోషించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అయితే.. దానితో కలసి ఊరేగుతున్న చరిత్ర బీఆర్‌ఎస్‌దని విమర్శించారు.

ఎవరికి ఎవరు 'బీ టీం' అనేది ప్రజలకు తెలుసు

తెలంగాణలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందం చేసుకుని, పక్కా ప్రణాళికతో బీజేపీపై కుట్రకు పాల్పడుతున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లోనూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కలిసి పనిచేశాయని.. ఎవరికి ఎవరు బీ టీం అనేది ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ కుటుంబ రాజకీయాలపై మాట్లాడటం హాస్యాస్పదమని.. రాహుల్ కుటుంబాన్ని అడ్డం పెట్టుకొనే రాజకీయాల్లోకి వచ్చారు కదా అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే దేశ సంపదను దోచుకుంటుందని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల మధ్యలో చిచ్చుపెట్టి స్వార్థ రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం

మోదీ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 8న వరంగల్‌లో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొంటారని చెప్పారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం కోసం కలసి ముందుకు వెళ్తామన్నారు. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని.. వారి ఆకాంక్షలను నెరవేర్చేలా ముందుకు నడుస్తామని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

రిమోట్ గాంధీలా రాహుల్

- టీ కాంగ్రెస్ నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ఖమ్మం సభలో చదివారు
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. 4 వేల పెన్షన్ ఇస్తున్నారా?
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను కనీస అవగాహన లేకుండా ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చదివి వెళ్లిపోయారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. రిమోట్ గాంధీలా వ్యవహరించారే తప్ప ఆయనకు దేశ ప్రజల గురించి కనీస విషయ పరిజ్ఞానం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో సోమవారం ఆయన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ విప్ ఎం.ఎస్.ప్రభాకర్, ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, సురేందర్, సండ్ర వెంకట వీరయ్య, ఎంపీ వద్దిరాజు రవిచంద్రలతో కలసి మీడియాతో మాట్లాడారు.

రాహుల్ ఏ హోదాలో మాట్లాడారు?

ఖమ్మం సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపట్ల ప్రశాంత్‌రెడ్డి విరుచుకుపడ్డారు. రాహుల్ ఏ హోదాలో ఖమ్మం సభలో మాట్లాడారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ గురించి కొత్తగా తెలుసుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. వెయ్యికి మించి పెన్షన్ లేదు...

తాము గెలిస్తే రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించిన రాహుల్ గాంధీ... ఇటీవల గెలిచిన కర్ణాటకలో పెన్షన్ ఎంత ఇస్తున్నారని వేముల ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. వెయ్యికి మించి వృద్ధులకు పెన్షన్ లేదని, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో అమలు చేస్తున్న పెన్షన్ స్కీమ్, దాని వివరాలు ఏమిటో రాహుల్‌కు తెలుసా అని వేముల ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్‌లో రూ. 500 వృద్ధాప్య పెన్షన్, వితంతువులు, వికలాంగులకు రూ. 350 పెన్షన్ ఇస్తున్నారని, దానికి కూడా సవాలక్ష నిబంధనలు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలన్నింటా ఇదే పరిస్థితి ఉందని వివరించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయకుండా తెలంగాణలో రూ. 4 వేల పెన్షన్ హామీ ఇస్తే ప్రజలు నమ్ముతారా? అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా? అని ప్రశ్నించారు. కర్ణాటకతోపాటు మిగతా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మొదలు అమలు చేయాలని హితవు పలికారు.

అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్...

అవినీతి గురించి రాహుల్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, అవినీతికి పర్యాయపదమే కాంగ్రెస్ అని మంత్రి వేముల ఎద్దేవా చేశారు. రాహుల్ తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ బోఫోర్స్ కుంభకోణం వల్ల, ఎంపీగా రాహుల్ గాంధీ అవినీతి ఆరోపణలతోనే ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు.

మీదే రాచరిక కుటుంబం..

కేసీఆర్‌ది రాచరికం కాదని, 88 సీట్లు గెలిచి రెండోసారి సీఎం అయ్యారని వేముల అన్నారు. కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబానిది రాచరికం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణకు మొదట్నుంచీ ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, 1956లో తెలంగాణను బలవంతంగా ఆంధ్రాతో కలిపింది ఆ పార్టీ కాదా అని నిలదీశారు. వందలాది మంది తెలంగాణ ఉద్యమంలో అమరులు కావడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని, 2004లోనే తెలంగాణ ఇచ్చి ఉంటే ఇంత మంది చనిపోయేవారు కాదని వేముల స్పష్టం చేశారు. తామెవ్వరికి బీ టీం కాదని, బీఆర్‌ఎస్ ప్రజల టీం అన్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కలసి పనిచేశాయని ఆరోపించారు. కావాలంటే ఈటల, రేవంత్ హోటల్లో కలుసుకున్న ఫొటోలు రాహుల్‌కు పంపిస్తామన్నారు.

వంద సీట్లు గెలుస్తాం..

- బీఆర్‌ఎస్‌ను బొందపెడతాం
- మీ దగ్గర ఉంటే అమెరికన్ డాలర్.. బయటకు వస్తే చెల్లని రూపాయా?
- అడ్డంకులు సృష్టించినా జనగర్జన సభ విజయవంతమైంది
- ఈ నెలాఖరులోగా బీఆర్‌ఎస్ నుంచి ప్రముఖులు కాంగ్రెస్‌లో చేరుతారు
- విలేకరుల సమావేశంలో పొంగులేటి



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు గెలవడమే కాకుండా రాష్ట్రంలో 100 సీట్లు సాధించి బీఆర్‌ఎస్‌ను బొందపెడతామని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోస్యం చెప్పారు. ఆ తర్వాత ప్రజలు కోరుకున్న పాలనను అందిస్తామన్నారు. ఖమ్మంలో సోమవారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పినట్లుగా రాష్ట్రంలో, కేంద్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా బీఆర్‌ఎస్ నుంచి కొందరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని ఆయన తెలిపారు.

ఏం చేయాలో మాకు తెలుసు..

జనగర్జన సభలో రూ. 4 వేలు పింఛన్ పథకాన్ని ప్రకటించడాన్ని ఓ మంత్రి కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించినా... కాంగ్రెస్ పార్టీలో ఆయన కంటే తెలివైన వారు చాలామంది ఉన్నారని పొంగులేటి చెప్పారు. ఓ జాతీయ పార్టీగా ఏ రాష్ట్రంలో ఎలా ముందుకు పోవాలో కాంగ్రెస్‌కు తెలుసన్నారు. రాష్ట్ర పరిస్థితులు, అక్కడి ప్రజల అవసరాల ఆధారంగానే పథకాలు అమలవుతాయని చెప్పారు. ఇటీవల ఓ మంత్రి పార్టీ దరిద్రం పోయిందని వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావిస్తూ ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోనప్పుడు రెండేళ్ల ప్రవర్తన ఎలా ఉందో గుర్తుచేసుకోవాలన్నారు. ఆ తర్వాత కూడా కేబినెట్‌లోకి తీసుకోకుంటే ఏక్‌నాథ్ షిండే పాత్ర పోషించేవారని వ్యాఖ్యానించారు. తాను ఆ పార్టీలో ఉన్నప్పుడు అమెరికన్ డాలర్, డైమండ్ అని.. ఇప్పుడు పనికిరాని నాణెం అయిపోతానా అని పొంగులేటి ప్రశ్నించారు.

అడ్డంకులతో సభను ఆపలేకపోయారు..

జనగర్జన సభకు జనం రాలేదని చెబుతున్న బీఆర్‌ఎస్ నేతలు... కంటివెలుగు శిబిరంలో పరీక్ష చేయించుకోవాలని పొంగులేటి ఎద్దేవా చేశారు. బస్సులు ఇవ్వకుండా, చెక్‌పోస్టులతో అడ్డుకున్నా ప్రజలను ఆపలేకపోయారని తెలిపారు. పోలీసులు సభాప్రాంగణంలో డ్యూటీ చేయకుండా ఎక్కడ విధులు నిర్వహించారో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ కుమారుడు రాహుల్‌గాంధీ వస్తుంటే ముఖ్యమంత్రి, డీజీపీ, సీపీ ఇచ్చే మర్యాద ఇదేనా అని ప్రశ్నించారు. బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులకు పొంగులేటి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నేతలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, సూతగాని జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో పోడు పంపిణీ పూర్తి చేయాలి



సాక్షి, హైదరాబాద్: పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహలక్ష్మి పథకం, ఎరువులు, విత్తనాల పొజిషన్, తెలంగాణకు హరితహారం, బీసీ చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం, గొర్రెల పెంపకం పథకం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. వానకాలం సీజన్‌లో పోడు పట్టాలు పొందిన లబ్ధిదారులకు రైతుబంధు పథకం ఆర్థిక సహాయం అందించాల్సి ఉన్నందున పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, గరిష్టంగా వారం రోజుల్లో పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. పట్టాల పంపిణీ తర్వాత పోడు రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను రైతు బంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అటవీ భూముల్లో ఆక్రమణలు, చెట్ల నరికివేత జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాల పంపిణీపై సమీక్షిస్తూ జిల్లా కలెక్టర్లు ప్రతిరోజూ స్టాకు విషయాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. బీసీ చేతివృత్తిదారులకు ఆర్థిక సహాయం పథకం కింద అందిన దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా అర్హతలను ఖరారు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇటీవల మంజూరైన 4,852 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

వారిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తిస్తాం: ప్రవీణ్ కుమార్



పంజగుట్ట: అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్, బీఎస్పీ గ్రేటర్ శాఖల ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షుడు మిద్దె కృష్ణ అధ్యక్షతన 'జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికుల గోస–బీఎస్పీ భరోసా'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పేద కార్మికుల కష్టాలు ముఖ్యమంత్రికి పట్టవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ ద్వారా నిత్యం అబద్ధాలు చెప్పే మున్సిపల్ మంత్రి కేటీఆర్‌కు పారిశుధ్య కార్మికుల కష్టాలు కనిపించవా అని ప్రశ్నించారు.

అబద్ధాలు వల్లెవేసిన రాహుల్: కేకే



సాక్షి, హైదరాబాద్: ఖమ్మం సభలో రాహుల్‌గాంధీ అబద్ధాలతో కూడిన అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు విమర్శించారు. పార్లమెంటులో వ్యవసాయబిల్లును తాము వ్యతిరేకించడం వల్లనే కేంద్రం ఉపసంహరించుకుందని, కానీ సమర్థించినట్లు జాతీయ స్థాయి నేత చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు , కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రాములుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీపై జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్ తరహాలో ఏ పార్టీ పోరాడటం లేదని అన్నారు. బీజేపీ వ్యతిరేక కూటమిలోకి బీఆర్‌ఎస్ వస్తే కాంగ్రెస్ రాదని రాహుల్ చెప్పారని, ఈ మాట గతంలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. నామా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించే సీఎం కేసీఆర్ ఒక్కరేనని అన్నారు. బీఆర్‌ఎస్ బీజేపీకి రిష్తేదార్ కాదని, 30 సార్లు వాయిదా తీర్మానాలు, ప్రధాని మోదీ, మంత్రులపై సభా హక్కుల నోటీసులు ఇచ్చామని గుర్తు చేశారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడు తూ, అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే ప్రయత్నం చేస్తుందని అన్నారు.

రాహుల్ మాటలు అభ్యంతరకరం

రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్



సాక్షి, హైదరాబాద్: ఖమ్మంసభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడిన తీరు అభ్యంతరకరమని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పార్టీలో ప్రధాన నాయకుడిగా ఉండి అవగాహనరాహిత్యంగా విమర్శలు చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాధారమని, దీనిని మూడేళ్ల వ్యవధిలోనే పూర్తి చేసి సాగునీరు అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక వరి సాగవుతున్న ప్రాజెక్టు గురించి రాహుల్ అడ్డగోలుగా మాట్లాడారన్నారు. ఆసరా పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ నేతలు చెప్పడం హాస్యాస్పదమని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎంత పెన్షన్ ఇస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీని అరెస్ట్ చేయకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటని, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో ఎవరు ఎవరికి బి టీంగా ఉన్నారో ప్రజలకు తెలుసన్నారు.

'బీసీబంధు' ప్రవేశ పెట్టాలి: ఆర్.కృష్ణయ్య



మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం సమర్పించిన ఆర్.కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విధంగా బీసీ బంధు పథకాన్ని వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ బీసీల ఆగ్రహానికి గురవుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం సోమవారం ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి బీసీల డిమాండ్లపై చర్చలు జరిపింది. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీ కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష రూపాయల పథకాన్ని కేవలం 15 కులాలకే పరిమితం చేయకుండా బీసీ జాబితాలోని 130 కులాలకు వర్తింప చేయాలని అన్నారు. బీసీ గురుకుల పాఠశాలలకు పెద్దఎత్తున డిమాండ్ ఉన్నందున అదనంగా 119 బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని అన్నారు. గత 9 సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్కరికి కూడా బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని, ఇప్పుడు ఎన్నికలు రావడంతో రుణాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారని ఆయన విమర్శించారు. ఇప్పుడైనా దరఖాస్తుదారులందరికీ రుణాలు ఇవ్వకపోతే బీసీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

'బాలాసోర్'లా త్వరలో ఘోర రైలు ప్రమాదం!

- హైదరాబాద్–ఢిల్లీ మార్గంలో జరుగుతుందంటూ ఆగంతకుడి లేఖ
- అప్రమత్తమైన రైల్వే పోలీసులు.. ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థల తనిఖీ... లేఖ రాసిన వ్యక్తి జాడ కనుగొనే పనిలో పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఒడిశాలోని బాలాసోర్‌లో ఇటీవల జరిగిన ఘోర రైల్వే ప్రమాదం వంటిదే ఢిల్లీ–హైదరాబాద్ రైల్వే మార్గంలో జరగబోతోందంటూ ఓ ఆగంతకుడు రాసిన లేఖ కలకలం రేపుతోంది. బాలాసోర్‌లో ఒక గూడ్స్ రైలు, రెండు ప్రయాణికుల రైళ్లు ఢీకొని వందల మంది చనిపోవడం, ఆ ప్రమాదం వెనుక విద్రోహ చర్య కూడా ఉండే అవకాశంపై సీబీఐ దర్యాప్తు జరుగుతుండటం తెలిసిందే. ఈ క్రమంలో అదే తరహా మరో ప్రమాదం జరగబోతోందంటూ నాలుగైదు రోజుల కింద వచ్చిన లేఖతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ–హైదరాబాద్ మార్గంలో సిగ్నలింగ్ వ్యవస్థలను, ట్రాక్ పరిస్థితిని తనిఖీ చేస్తున్నారు. ప్రతి రైలును క్షుణ్నంగా తనిఖీ చేయాలని, సిబ్బంది అంతా జాగ్రత్తగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం ఆదేశించారు. ఇక రైల్వే పోలీసుల ఫిర్యాదు మేరకు సదరు లేఖ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు రాశారన్నది తేల్చేందుకు రాష్ట్ర పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

తెలంగాణ ఇచ్చినట్టే రూ.4 వేలు పింఛన్ ఇస్తాం

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

కేసీఆర్ అవినీతిని ఆపితే 55 లక్షల మందికి పింఛన్ ఇవ్వొచ్చు



విలేకరులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కడుపుకు అన్నం తినేవారెవరూ రాహుల్‌గాంధీ అర్హత గురించి ప్రశ్నించరని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్నా రాహుల్ ఏ పదవినీ తీసుకోలేదని గుర్తు చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీకి తప్ప తెలంగాణలో పర్యటించేందుకు ఇంకెవరికి హక్కు ఉంటుందని ప్రశ్నించారు. గాంధీ కుటుంబం గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్ నేతలకు లేదని అన్నారు. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా రాహుల్ ప్రకటించిన విధంగా వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని స్పష్టం చేశారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఖమ్మం సభ విజయవంతం కావడంతో..

బీఆర్‌ఎస్ నేతలు అంటకాగుతున్న ప్రధాని మోదీకి మాత్రమే తెలంగాణలో పర్యటించే హక్కు ఉందా అని రేవంత్ నిలదీశారు. 'రాహుల్‌గాంధీని విమర్శిస్తున్న బీఆర్‌ఎస్ నేతలకు అసలు ఏం అర్హత ఉంది? ట్విట్టర్ పిట్ట, సోడా కలిపేటోడు, భూమికి మూడు అడుగులున్నోడు కూడా రాహుల్ అర్హత గురించి మాట్లాడుతున్నారు..'అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఖమ్మంలో నిర్వహించిన సభ విజయవంతం కావడంతో అసలు నక్క తప్ప వేట కుక్కలన్నీ బయటకు వచ్చి మొరగడం ప్రారంభించాయని అన్నారు. జనగర్జన సభకు ప్రజలు రాకుండా ప్రభుత్వం అన్ని రకాల కుయుక్తులు పన్నిందని, అక్కడి సైకో మంత్రి అడ్డుకునే ప్రయత్నం చేసినా, కుట్రలను ఛేదించి ఖమ్మంలో సభను విజయవంతం చేశారని అన్నారు. ఇందుకు ఖమ్మం ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

అన్ని హామీలు నిలబెట్టుకున్న చరిత్ర మాది

దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నిలబెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని రేవంత్ అన్నారు. భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ సహా, శ్రీరాంసాగర్, జూరాల లాంటి ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు, లక్షకుపైగా గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, అనేక ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటు, ఆర్టీఐ, ఆహార భద్రతా చట్టాలు, యూనివర్సిటీల్లో బీసీలకు రిజర్వేషన్లు, ఔటర్ రింగురోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ, ఫార్మా కంపెనీలు, మెట్రో రైలు... ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో ఉన్నాయని చెప్పారు. తాము ప్రాజెక్టులు తెస్తే, బీఆర్‌ఎస్ నేతలు ఫామ్‌హౌస్‌లు తెచ్చారని విమర్శించారు.

కాళేశ్వరంపై చర్చకు సిద్ధం

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ ఇచ్చిన నివేదికపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని రేవంత్ చెప్పారు. ఈ విషయంలో చర్చ పెడితే తమ పార్టీ తరఫున ఇద్దరు ప్రతినిధులం హాజరవుతామని, మంత్రులు హరీశ్, కేటీఆర్‌లు సిద్ధమా అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలో తప్పేమీ లేదన్నారు. బెంగళూరులో జరిగే విపక్షాల సమావేశానికి బీఆర్‌ఎస్‌ను రానివ్వబోమని, ఒకవేళ వస్తే మెడలు పట్టి గెంటేస్తామని అన్నారు.

రూ.4 వేల పింఛన్ మా తొలి ప్రాధాన్యత

రూ.4 వేలు పింఛన్ ప్రకటనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రేవంత్ చెప్పారు. కేసీఆర్ అవినీతిని ఆపితే మొత్తం 55 లక్షల మంది పింఛన్‌దారులకు తాము హామీ ఇచ్చిన విధంగా పింఛన్ ఇవ్వొచ్చని చెప్పారు. తెలంగాణ ఇచ్చినట్టే రూ.4 వేల పింఛన్ ఇచ్చి తీరుతామని అన్నారు. రాష్ట్ర ఆదాయం భారీగా పెరిగిన నేపథ్యంలో ఇప్పుడున్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచడం పెద్ద కష్టమేమీ కాదని వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.4 వేల పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నించడాన్ని రేవంత్ తప్పుపట్టారు. ఆయా రాష్ట్రాల జనాభా, పార్టీలకుండే ప్రాధాన్యతల మేరకు పథకాలు అమలవుతాయని రేవంత్ చెప్పారు.

ఇనుముతో ఇనుమును సానబెట్టినట్టే,
ఒక మనిషి తన స్నేహితుడి బుద్ధికి పదునుపెట్టగలడు.
– జుడాయిజం

సాక్షి
మంగళవారం, 4 జూలై 2023

మరో 'మహా' నాటకం!

కొన్ని సన్నివేశాలు, సంఘటనలు మునుపెన్నడో చూసినట్టు, చిరపరిచితమైనట్టు అనిపిస్తుంటాయి. మహారాష్ట్రలో ఆదివారం నుంచి జరుగుతున్న పరిణామాలు, జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో సంక్షోభం, అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ వర్గం మహారాష్ట్ర బీజేపీ సర్కార్‌లో చేరడం చూస్తే... సరిగ్గా ఏడాది క్రితం సంఘటనలే పునరావృతమవుతున్నట్టు అనిపిస్తుంది. అప్పట్లో శివసేనను చీల్చిన ఏక్‌నాథ్ శిందే వ్యవహారం గుర్తొస్తుంది. ఇప్పుడు మనుషులు, పార్టీల పేర్లు మారాయి కానీ కథ మాత్రం మళ్ళీ అదే. అప్పుడు ఉద్ధవ్ ఠాక్రే సారథ్య శివసేన, ఇప్పుడు శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ. అక్కడ శిందే, ఇక్కడ అజిత్. కాకపోతే ఈసారి తెలివిగా 'చీలిక' అనకుండా, ఎన్సీపీగా తాము ప్రభుత్వాన్ని సమర్థిస్తూ, మంత్రివర్గంలో చేరుతున్నామంటూ సాంకేతిక చిక్కులు లేకుండా చూసుకుంటున్నారు అజిత్. అంతే తేడా. మొత్తానికి గతంలో కర్ణాటక, గోవా తదితర రాష్ట్రాల్లో లాగా మహారాష్ట్రలోనూ ప్రత్యర్థి పార్టీల్ని చీలికలు పేలికలు చేయడంలో బీజేపీ మరోసారి సఫలమైంది. జాతీయస్థాయిలో ప్రతిపక్షాల ఐక్యతా యత్నానికి గట్టి దెబ్బ కొట్టింది.

శరద్ – ఆయన కుమార్తె సుప్రియ ఒకవైపు, అజిత్ వర్గం మరోవైపు నిలవడంతో ఎన్సీపీపై పట్టు కోసం పోరు మరిన్ని మలుపులు తీసుకోనుంది. గత 24 ఏళ్ళలో విడతలు విడతలుగా 17 ఏళ్ళు ఎన్సీపీ మహారాష్ట్రలో అధికారంలో ఉంది. మధ్యలో కొన్నేళ్ళు, మళ్ళీ ఇప్పుడు ఏడాదిగా గద్దెపై లేదు. ఏళ్ళ తరబడి పవార్ కుటుంబాన్ని కలిపి ఉంచిన అధికార బంధం బలహీనమైంది. అధికారం రుచి మరిగిన అజిత్ దేనికైనా సిద్ధమయ్యారు. అన్న కొడుకులోని అధికార కాంక్షను గుర్తించిన శరద్ కొత్త వ్యూహాలతో చెక్ పెడుతూ వచ్చారు. నెల క్రితం కూడా పార్టీ పగ్గాలు వదిలేస్తున్నట్టు ప్రకటించి, తీరా కార్యకర్తల ఆకాంక్ష అంటూ మళ్ళీ మూడు రోజులకే వెనక్కి తగ్గి, కుమార్తెకు పెత్తనం కట్టబెట్టారు. అజిత్‌ను రాష్ట్రానికే పరిమితం చేస్తూ చాణక్య నీతి ప్రదర్శించారు. అజిత్‌కు అది మింగుడు పడలేదు. అదను చూసి, అనుచరులతో కలసి సొంత బాబాయ్‌ని వదిలేసి, కేంద్రంలో మోదీకి జై కొట్టారు.

ఎన్సీపీ ఎమ్మెల్యేల్లో మెజారిటీ తమ వైపే ఉన్నారని అజిత్ అంటున్నా, అందుకు లిఖితపూర్వక సాక్ష్యమేమీ ఇప్పటికైతే లేదు. 'మహారాష్ట్ర పురోభివృద్ధి కోసం, మోదీ సారథ్యంలో దేశ పురోగతి కోసం' ...ఇలా శరద్‌ను వదిలిపెట్టి, పార్టీని చీల్చలేదంటూనే చీల్చిన అజిత్ తదితరులు బోలెడు మాటలు చెబుతున్నారు. కానీ, నాలుగేళ్ళలో ముగ్గురు వేర్వేరు సీఎంల హయాంలో మూడోసారి డిప్యూటీ సీఎం అయిన అజిత్ ఆకాంక్షలు బహిరంగ రహస్యం. పైగా, స్వయంగా అనేక భారీ కుంభకోణాల ఆరోపణల్ని ఎదుర్కొంటున్న అజిత్, ఆయన వర్గపు ఎమ్మెల్యేలు బీజేపీలో ఎందుకు చేరారో ఊహించడం కష్టమేమీ కాదు. వారంతా ఇక బీజేపీ వాషింగ్ మెషిన్‌తో స్వచ్ఛమైపోయినట్టే!

రాజకీయ గూగ్లీలతో ప్రత్యర్థుల్ని బోల్తా కొట్టించే శరద్ ఈసారి తానే క్లీన్ బౌల్డయ్యారు. ప్రఫుల్ పటేల్ తదితరులు విశ్వాసపాత్రులన్న నమ్మకం నట్టేట ముంచింది. 2019లోనే బీజేపీ వైపు వెళ్ళేందుకు అజిత్ విఫలయత్నం చేసినప్పుడే ముకుతాడు వేయాల్సిన శరద్ ఆ పని చేయలేదు. ఇప్పుడు ఏకు మేకైంది. తాజా చీలిక కాని చీలికతో ఎవరిది అసలైన పార్టీ, ఎవరిది ఎన్నికల గుర్తన్నది సైతం వివాదాస్పదమే. మనుగడ కోసం 83వ ఏట ఈ మరాఠా యోధుడు ప్రజాక్షేత్రంలో మళ్ళీ పోరుకు దిగాలి. పదవుల్లోని ప్రత్యర్థులపై ఇరువర్గాల పోటాపోటీ వేటు పర్వం సాగుతోంది. ఎన్సీపీ వర్కింగ్ ఛీఫ్ ప్రఫుల్ పటేల్‌ను పదవి నుంచి, అజిత్ వర్గ ఎమ్మెల్యేలను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు శరద్ ప్రకటించారు. వచ్చే 3 నెలల్లో మహారాష్ట్రలో పెనుమార్పులు తప్పవంటున్నారు.

ఆ మాటేమో కానీ అజిత్ వర్గాన్ని చేర్చుకోవడం వెనుక బీజేపీకి దాని లెక్కలు దానికున్నాయి. గత నెల సుప్రీం కోర్ట్ ఇచ్చిన ఆదేశాలతో ఏక్‌నాథ్ శిందే సారథ్య శివసేన చీలిక ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం తీసుకోక తప్పకపోవచ్చు. రేపు సాక్షాత్తూ సీఎం శిందే సహా పలువురు చీలిక వర్గపు శివసేన సభ్యులు అనర్హత పాలైనా, కొత్తగా చేరిన అజిత్ వర్గంతో మహారాష్ట్రలో బీజేపీ సర్కార్ మనుగడకు ఢోకా ఉండదు. కానీ, బహిష్కరణల వేటుతో అజిత్ వర్గం ఎమ్మెల్యేలూ అనర్హత వేటు ఎదుర్కొనే ముప్పు లేకపోలేదు. పాలకపక్ష స్పీకర్ నాన్చకుండా, అంత నిర్ణయం తీసుకుంటారా అన్నది వేరే కథ. వెరసి, సంకీర్ణ రాజకీయాల రచ్చలో పూర్తిగా దెబ్బతిన్నది మహారాష్ట్రలో ప్రజాతీర్పు. అయితే, పార్టీ సంస్థాగత ప్రక్షాళన చేపట్టి, కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు దిగుతున్న కమలనాథుల గురి మొత్తం రాబోయే ఎన్నికలే. థాణేలో శిందే, మరాఠ్వాడాలో అజిత్‌లకు గట్టి పట్టుంది. బీజేపీకి పట్టు లేని ఆ ప్రాంతాల్లో ఈ ప్రాంతీయ నేతలిద్దరూ 'మిషన్ 2024'లో అక్కరకు వస్తారనేది లెక్క. అలాగే, శిందే రెక్కలు కత్తిరించడానికీ పక్కనే అజిత్‌ను కూర్చోబెట్టడం కమలనాథులకి పనికొస్తుంది.

2019 ఎన్నికల్లో తమతో కలసి పోటీ చేసి, తీరా గెలిచాక పక్కకు వెళ్ళి అధికారాన్ని దూరం చేసిన ఉద్ధవ్ ఠాక్రే శివసేన పైనా, అలాగే కీలకమైన ప్రతిసారీ ఖంగు తినిపించిన శరద్‌పవార్ ఎన్సీపీ పైనా బీజేపీ చివరకిలా ప్రతీకారం తీర్చుకుంది. ఎన్నికల కల్లా శిరోమణి అకాలీదళ్ లాంటి ఒకప్పటి మిత్ర పక్షాల్ని ఎన్డీఏలోకి తెచ్చుకోవాలని చూస్తున్న బీజేపీకి ఇది సంతోష సందర్భం. ఆపసోపాలు పడుతున్న ప్రతిపక్ష ఐక్యతాయత్నానికి మహా కష్టం. ఎన్సీపీలో చీలిక సఫలమైతే బీజేపీకి లాభం. సఫలం కాకున్నా అజిత్‌కే తప్ప, దానికొచ్చిన నష్టమేమీ లేదు. ఇక బిహార్‌లోనూ ఇలాంటి 'ఆపరేషన్' సిద్ధమవుతోందని వార్త. ఏమైనా, అధికారం కోసం దేనికైనా సిద్ధమై, ప్రజాస్వామ్యాన్ని వట్టి నంబర్ల గేమ్‌గా మార్చేస్తున్న మన పార్టీల, నేతల నిస్సిగ్గు నగ్నత్వానికి 'మహా' నాటకం మరో ప్రతీక.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.3.21 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.10.23 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** సా.5.56 నుండి 7.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.10 నుండి 9.02 వరకు, తదుపరి రా.10.55, నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** రా.2.55 నుండి 4.23 వరకు.

సూర్యోదయం: 5.33
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

నేలను విడిచే అభివృద్ధా?

విశ్లేషణ



దొంతి నరసింహా రెడ్డి

భూమి రేట్లు పెరగడం తాము చేసిన 'అభివృద్ధి'కి మచ్చుతునకగా రాజకీయ నాయకులు ప్రచారం చేసుకోవడం శోచనీయం. రాజకీయ అధికారం బడుగులకు ఉండాలనే నినాదంతో వచ్చిన తెలుగుదేశం, భారత రాష్ట్ర సమితి నాయకులు దీన్ని వల్లె వేయడం ఇంకా ఘోరం. భూమి వ్యాపార వస్తువు అయితే, దాని ధరలు కోట్లకు చేరితే, సామాజిక అన్యాయం పెరుగుతుందనే స్పృహ ఈ నాయకులకు లేకపోవడం గర్హనీయం. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ విధానాల వల్ల భూమి క్రమంగా కొందరి పాలు అవుతున్నది. ఈ కొందరు దానిని తమ పెట్టుబడులు పెంచే ఆర్థిక సాధనంగా పరిగణిస్తున్నారు. చుట్టూ కంచె వేసి పడావు పెడుతున్నారు. ఇది ఆహార భద్రతకు ముప్పు!

భూమిని చాలా సాధారణంగా చూడడం అలవాటు అయింది. అసలు భూమి ఒక సహజ వనరు అని గుర్తించేవారు, గుర్తు పెట్టుకునేవారు అరుదు. భూమి, నేల, మట్టి, మన్ను వంటివి పర్యాయ పదాలుగా వాడతారు. కానీ, భూమి మనకు అందించే సేవలు ఆ పదాలలో ఇమిడి ఉన్నాయి. సమస్త పచ్చదనం, నీళ్ళు, అనేక రకాల జీవరాశులకు ఈ భూమి ఆలవాలం. భూమి పైన, లోపట, అంతటా ఉండే సంపద అపారం. సహజ భూవినియోగాన్ని మానవులు టెక్నాలజీ దన్నుతో అసహజ రీతిలో మార్చుతున్నారు. దానికి 'అభివృద్ధి' అని పేరు పెడుతున్నారు. ప్రాణ వాయువు నిరంతరం అందాలంటే చెట్లు, చేమ ఉండాలి. నీళ్ళు ఉండాలి. అవన్నీ ఉండాలంటే నేల కావాలి. ఈ పరస్పర ఆధారిత ప్రకృతి రుతుచక్రాలను మరిచిపోతున్నాము.



తెలంగాణాలో భూమి ఆధారంగా అనేక వృత్తులు, జీవనోపాధులు ఉండేవి. గ్రామాలలో ఆహార ఉత్పత్తికి, స్వయంసమృద్ధికి భూమి అవసరం. పేదరికంలో, ఆకలితో ఉండడానికి భూమి లేకపోవడమే కారణమని గుర్తించి పేదలకు భూమి పంచడం ఒక రాజకీయ, ఆర్థిక, పాలనాంశంగా మారింది. అయితే, గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ విధానాల నేపథ్యంలో భూమి క్రమంగా కొందరి పాలు అవుతున్నది. ఈ కొందరు దానిని తమ పెట్టుబడులు పెంచే ఆర్థిక సాధనంగా పరిగణిస్తున్నారు. చుట్టూ కంచె వేసి పడావు పెడుతున్నారు. ఇది ఆహార భద్రతకు ముప్పు. పైగా లక్షలాది కుటుంబాల జీవన సాధనం హరిస్తున్నారు.

హైదరాబాద్‌లో ఎకరా ధర కోట్లలో ఉంటే పెట్టుబడి కొంత ఇక్కడకు మరలవచ్చుగాక, కానీ ధరలు శిఖరానికి చేరిన తరువాత ఆ భూమిలో ఏమీ చేయలేని పరిస్థితి వస్తుంది. రియల్ ఎస్టేట్ ధరలకు కూడా ఒక పరిమితి ఉంటుంది. అది దాటితే పెట్టుబడి మురిగిపోతుంది. ఆ ఆర్థిక పరిస్థితి ఇంకా ఘోరంగా ఉంటుంది. పేదలకు వ్యవసాయానికీ, ఆహారానికీ, ఇండ్లకూ భూమి దొరకదు. భూమి ఉన్నవాడు దాని నుంచి పెట్టుబడికి తగ్గ 'లాభం' వచ్చే వ్యాపారం లేక ఇబ్బంది పడతాడు. కోట్ల రూపాయల భూమిలో ఏ వ్యాపారం చేస్తే అన్ని కోట్లు తిరిగి వస్తాయి? అ వ్యాపారాలకు మార్కెట్లు ఉన్నాయా? అటువంటి భూమిలో అపార్ట్‌మెంట్లు, ఇండ్లు కడితే కొనగలిగే స్థోమత ఉన్నవాళ్ళు ఎంత మంది ఉంటారు? ఇండ్లు, వ్యాపార సముదాయాల మార్కెట్లు స్థానిక డిమాండ్ మేరకు ఉంటేనే ఉపయుక్తం. తెలంగాణా ప్రభుత్వం ఇటువంటి సమీక్ష చేయడం లేదు. చేసిన అప్పులు తీరాలంటే ప్రభుత్వ ఆదాయం పెరగాలి. అది రియల్ ఎస్టేట్ ద్వారా పెరుగుతుంది అని బలంగా నమ్మి భూ బదలాయింపు విధానాలు అమలు చేస్తున్నారు. తెలంగాణా అస్తిత్వ ఉద్యమాలకు అందరికీ భూమి అనేది బలమైన పునాది. కానీ అది తెలంగాణా ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలకు బలి అవుతున్నది.

ధరణి, పారిశ్రామిక విధానాలు, భూసేకరణ చట్టం 2017, మునిసిపల్ చట్టం, పంచాయతీ రాజ్ చట్టం, పట్టణాల అభివృద్ధికి అడుగులు, భవనాల నిర్మాణానికి అప్పులు, రైతు బంధు వగైరా తెలంగాణా ప్రభుత్వ చర్యలు భూమి యాజమాన్యం కొందరి దగ్గరే ఉండే విధంగా ఉంటున్నాయి. బడుగులకు ఉన్న భూమిని అమ్ముకునే పరిస్థితి కల్పిస్తున్నది. ఏ ధరకు అమ్ముకున్నా ఆ కుటుంబం భూమి లేని కుటుంబంగా మిగులుతుంది. స్వతంత్ర జీవనోపాధి కోల్పోతుంది. భూమి అమ్మిన ధనం విద్యకు, సంతతి వికాసానికి ఉపయోగపడినా, ఉద్యోగం లేనిదే సుస్థిరం కాదు. అయితే మంచిదే. కాకుంటే, సమస్య ఇంకొక రూపం తీసుకుంటుంది. అటు ఉద్యోగం రాక, ఉపాధి లేక, భూమి కోల్పోయి రోడ్డు మీదకు వచ్చిన కుటుంబాల సంఖ్య తెలంగాణా ఏర్పడక ముందు కంటే తెలంగాణా వచ్చినాక ఇంకా పెరిగింది.

పట్టణాలు, నివాసిత ప్రాంతాల విషయంలో ప్రణాళికబద్ధ అభివృద్ధి పోయి దళారుల రాజ్యం వచ్చింది. స్థానిక పంచాయతీ ప్రతినిధుల చేతి నుంచి నిర్ణయాధికారం అధికారుల వ్యవస్థకు మళ్ళింది. ఇది ఒక రకంగా పల్లెల మీద పట్టణం కొనసాగిస్తున్న సామ్రాజ్యవాదం. ఇదే మోడల్ తెలంగాణలో అన్ని పట్టణాల చుట్టూ అమలు చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్లు తయారు చేయటం, పల్లెలను విలీనం చేయటం, భూమి వినియోగం మార్చటం, ఫీజులు వసూలు చేయటం, తద్వారా అవినీతి సామ్రాజ్యానికి ఇంధనం అందించటం! ఈ క్రమంలో వ్యవసాయ భూమి తగ్గిపోయినా, చెరువులు మాయమయినా, గుట్టలు విధ్వంసం అయినా, చెట్లు నరికివేసినా ఏ చట్టానికీ పట్టదు. ఈ మోడల్ చేస్తున్న పర్యావరణ హననంలో అనేక జీవరాశులు, జీవనోపాధులు సమిధలు అయినాయి. గ్రామీణ ఉపాధి తగ్గిపోవడానికి కారణం వ్యవసాయ భూమి వ్యవసాయేతర పనులకు మరలడమే. ఒకవేళ గొర్రెల పథకానికి అవినీతి లేకుండా నిధులు ఇచ్చినా వాటిని మేపే భూములు లేకుంటే ఫలితం రాదు.

తెలంగాణా ప్రభుత్వం 'అభివృద్ధి' పనులకు... అంటే, కొత్త రోడ్లు, ఉన్న రోడ్ల విస్తరణ, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణాల విస్తరణ, చెత్త కుప్పలు, శ్మశానాలకు భూమిని సేకరిస్తున్నది. ఇది ఎక్కువ శాతం వ్యవసాయ భూమి అని గమనించాలి. ఆ భూమి మీదనే ఆధారపడి బతికే కుటుంబాలకు భూమికి బదులుగా భూమిని ఇవ్వవచ్చు, లేదా మెరుగైన జీవనోపాధి కల్పించవచ్చు. ఇవేమీ చేయకుండా చట్టాలను, సహజ న్యాయ సూత్రాలను కాదని భూమిని బదలాయిస్తున్నది. ఆహారం పండించే భూమి వినియోగం మార్చితే భవిష్యత్తులో ఆహార కొరతకు కారణం అవుతుంది. పెద్ద రోడ్లు ఎత్తుగా కట్టడానికి టన్నుల కొద్దీ మట్టి, రాళ్ళను వాడుతున్నారు. ఈ 'అవసరం' కొరకు గుట్టలను పిండి చేశారు. లక్షలాది చెట్లను నరికివేశారు. పెద్ద రోడ్లు కడుతున్నది కార్లు వేగంగా పోవటానికి. వీటి వల్ల వ్యవసాయ భూమి పోతున్నది, వర్షం నీటిని ఒడిసిపట్టే చెట్లు, గుట్టలు పోతున్నాయి. భూమి వినియోగం మార్చితే నీటి కొరత వస్తుంది అనే స్పృహ అధికారులకు, నాయకులకు, ప్రజలకు కొరవడింది.

నీళ్ళు వచ్చినా, విద్యుత్ ఉన్నా, చిన్న, సన్నకారు రైతులు భూములను ఎందుకు అమ్ముకోవాల్సి వస్తున్నది? వ్యవసాయం వారికి ఎందుకు లాభసాటిగా మారడం లేదు? ఈ ప్రశ్నలకు సమాధానంగా సుపరిపాలన పథకాల రచన చేయాల్సి ఉండగా, కేవలం భూమి ధరలు పెంచి ఇదే ఆర్థిక అభివృద్ధి అని తెలంగాణా నాయకులు గొప్పలకు పోతున్నారు. మట్టిలో తేమ కొన్ని వందల టీఎంసీల నీటికి సమానం. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభించేది. మట్టిని, నేలను, పచ్చదనాన్ని సంరక్షించే కార్యక్రమాల మీద పెట్టుబడి పెడితే రైతుల కమతాలలో నీరు దక్కేది. ఆహార పంటలకు అనువైన పర్యావరణంతో పాటు అప్పులు, వడ్డీల భారం ఉండేది కాదు. సుస్థిర ఫలితాలు వచ్చేవి. దీనికి వ్యతిరేక దిశలో అడుగులు వేసి తెలంగాణ ప్రభుత్వం పర్యావరణానికి విఘాతం కలిగించడంతో పాటు ఆర్థిక, సామాజిక వ్యవస్థలను కుదిపింది. 'ఎంత ఖర్చు అయినా వెనుకాడం' వంటి ప్రకటనల పర్యవసానంగా భూమితో కూడిన ఉత్పత్తి సంబంధాలు మారుతున్నాయి. భూమికి నీళ్ళు లక్ష్యంతో మొదలయ్యి, నీళ్ళ కొరకు భూమి అమ్మడం వ్యూహాత్మక తప్పిదం! పర్యావరణ హిత జీవనం మీద, సుస్థిర అభివృద్ధి మీద రాజకీయ, ఆర్థిక, సామాజిక వేత్తలు అత్యవసరంగా దృష్టి పెట్టకపోతే దుష్పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. వచ్చే ఉత్పాతాల నుంచి వెనుదిరిగే సమయం కూడా ఉండదు.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు । 90102 05742

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అంధ నాయకులు



భారత రాజకీయాల్లో చాలా పార్టీలను నాశనం చేస్తున్న ఒక సిండ్రోమ్ గురించి గతంలో రాశాను. దాన్ని ధృతరాష్ట్ర సిండ్రోమ్ అంటారు. తన పిల్లలను మించి ఇంకేదీ చూడని గుడ్డి రాజు ధోరణి అది.

– సాగరికా ఘోష్, జర్నలిస్ట్

టాప్ సీక్రెట్



మా అక్క తన స్నేహితుడితో ప్రేమలో పడింది. రెండేళ్ల తర్వాత వాళ్లు పెళ్లి చేసుకున్నారు. కానీ దాన్ని ఒక అరేంజ్డ్ మ్యారేజ్ అన్నట్టుగానే కథ నడిపించారు. ఆ విషయం మా అమ్మానాన్నలకూ, ఇంట్లోవాళ్లకూ ఎవరికీ తెలీదు. ఇప్పుడు వాళ్లకు నాలుగేళ్ల అబ్బాయి.

– అదితి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇదా మీ పని?



మణిపూర్ పూర్తిగా స్తంభించిపోయింది. మొత్తం భూభాగం రెండుగా విడిపోయింది, మధ్యలో బఫర్ జోన్ మిగిలింది! కేంద్రం చేష్టలుడిగి చూస్తోంది. అయినప్పటికీ బీజేపీ మాత్రం మహారాష్ట్రలో నీతిమాలిన ఎత్తుగడలతో బిజీగా ఉంది. 'ఈడీ' ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు సురక్షిత మార్గాన్ని వెతుక్కుంటున్నారు. కానీ క్యాబినెట్ స్థానాలు ప్రజా కోర్టుల్లో నిలబడలేవు.

– మహువా మొయిత్రా, తృణమూల్ ఎంపీ

వాళ్లంతే!



ఒకవైపు పాశ్చాత్య దేశాలకు వెళ్లాలని కలలు కంటూనే, మరోవైపు ఫ్రాన్స్ దహనమవుతుంటే సంతోషపడుతున్నారు అరబ్బులు. ఇక అక్రమ వలసలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు వామపక్షీయులేమో నన్ను కాల్చుకుతింటున్నారు.

– నెర్వానా మెహమూద్, రాజకీయ వ్యాఖ్యాత

గురువుకు వందనం



గురువుకీ, ఉపాధ్యాయుడికీ మధ్య భేదముంది. ఒకరు లోపలి దీపాన్ని వెలిగిస్తారు, మరొకరు బయటిది. గురు తత్వాన్ని ఆవాహన చేసుకోవడం ద్వారానే లోపలి కాంతిని వెలిగింపజేసుకుని మనలోని చీకటిని పారద్రోలగలుగుతాం అని గుర్తించాలి. ఇదే మన జీవిత లక్ష్యం కావాలి.

– జిగ్నా వోరా, రచయిత్రి

పని జరగదు



ప్రతి ఒక్కరూ దక్షిణ యూరప్, మధ్యధరా ప్రాంతాలకు రావాలని కలలు కంటారు. కానీ వచ్చాకే అర్థమవుతుంది. దేన్నయినా రిపేర్ చేయాలంటే ఒక మనిషి రావడానికి కనీసం మూడు రోజులు పడుతుందని; అప్పుడైనా వచ్చి చేస్తాడా? తల గోక్కుని, సమస్యేమిటో చెప్పకుండా, సిగరెట్ కాల్చి వెళ్లిపోతాడంతే!

– పర్గ్‌జాదే, అనువాదకుడు

ఆలూవాదం




ఎన్సీపీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు ఓ సారి నాతో అన్నారు: 'మేము ఆలుగడ్డ పార్టీ'. దానికి అర్థమేంటని అడిగితే, ఆయన ఇలా బదులిచ్చారు: 'క్యాబేజీ, బఠానీ, క్యారెట్, ఉల్లిగడ్డ... దేనితో వండినా ఆలూ బాగుంటుంది; చెప్పాలంటే దేనితోనైనా బాగుంటుంది; అలాగే మా పార్టీ భావజాలం కూడా ఏ పార్టీతోనైనా కలవగలిగే వీలు కల్పిస్తుంది.' ఎంత నిజం!

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

తెలంగాణ తొలి అమర తేజం!

1946 జూలై 4వ తేదీ దొడ్డి కొమురయ్య అమరత్వం పొందిన రోజు. ఆనాటి నల్లగొండ జిల్లా కడివెండి (ప్రస్తుతం వరంగల్ జిల్లాలో వుంది) గ్రామానికి చెందిన పేదరైతు యువకుడు అయిన కొమురయ్య స్థానిక 'వలంటీరు దళం'లో సభ్యుడుగా ఉండేవాడు. అప్పటి తెలంగాణలోని నిజాం సంస్థానంలో అత్యంత క్రూరులైన ఫ్యూడల్ భూస్వాములు అనేకమంది ప్రజలపై తీవ్రమైన దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడేవారు. అలాంటి ఒక భూస్వామి (జనగామ తాలూకా విసునూరు దేశ్‌ముఖ్) సాయుధ దౌర్జన్యాలను తిప్పికొట్టడానికి అప్పటి కమ్యూనిస్టు పార్టీ ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన వలంటీరు దళం చేసిన ఒక ప్రదర్శనలో పాల్గొంటున్న కొమురయ్యను కాల్చి చంపారు. విసునూరు దేశ్‌ముఖ్ తల్లి ఈ కడివెండి గ్రామంలో నివసిస్తూ ఉంది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ప్రదర్శనపై దాడిచేసి ఆ ఫ్యూడల్ భూస్వామి సాయుధ బలాలు చేసిన దుష్కృత్యం ఇది.



దొడ్డి కొమురయ్య

ఈ సందర్భంగా ఆనాడు తెలంగాణలో నెలకొన్న పరిస్థితులు చూద్దాం. తెలంగాణలో ప్రజాఉద్యమాన్ని 1940 నాటినుండే కమ్యూనిస్టు పార్టీ ప్రారంభించి నడుపుతుండేది. వెట్టిచాకిరీ రద్దు చేయాలనీ, కౌలుదారులను భూములనుండి తొలగించడాన్ని (బేదఖళ్ళు) వ్యతిరేకిస్తూ పోలీసు, రెవిన్యూ ప్రతినిధులైన పటేల్, పట్వారీలు ప్రజలనుండి అక్రమ వసూళ్ళను ఆపాలనీ, యుద్ధంపేరుతో రైతాంగంనుండి బలవంతపు ధాన్యపు వసూళ్ళను వ్యతిరేకిస్తూ కమ్యూనిస్టు పార్టీ, 'ఆంధ్ర మహాసభ' ప్రజల్లో పనిచేసి విప్లవోద్యమానికి అంకురార్పణ చేశాయి.

1946 ప్రారంభంలో ఆనాటి హైదరాబాదు సంస్థానంలో రెండు ముఖ్య సంఘటనలు జరిగాయి. నల్లగొండ జిల్లాలో ఆకునూరు గ్రామంలో, గుల్బర్గా జిల్లాలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రజలు ప్రభుత్వ నిర్బంధపు ధాన్యసేకరణను వ్యతిరేకిస్తూ ధాన్యం ఇవ్వడానికి తిరస్కరించారు. తర్వాత సాయుధ పోలీసులు ఈ రెండు గ్రామాలపై దాడిచేసి ప్రజలపై క్రూరమైన నిర్బంధాన్ని అమలుచేశారు. అరెస్టులు, చిత్రహింసలు, ప్రజల ఇండ్లను లూటీచేయటం, స్త్రీలపై పాశవిక అత్యాచారాలు చేసి ఆ రెండు గ్రామాలను శ్మశానాలుగా మార్చారు.

దీంతో కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ పరిధిలోని అన్ని గ్రామాల్లో భూస్వామ్య పోలీసు దౌర్జన్యాలను ఎదుర్కోవడానికి 'వలంటీరు దళాల'ను ఆర్గనైజు చేయాలనీ, రెగ్యులర్‌గా ప్రజాప్రదర్శనలను నిర్వహించాలనీ, దౌర్జన్యాలకు నిరసనగా రోజూ వలంటీరు దళాలు ఊరేగింపు జరపాలనీ పార్టీ కార్యక్రమం ఇచ్చింది. 1946 ప్రారంభంలో తెలంగాణలో వ్యవసాయ విప్లవం ప్రారంభమైంది. ఈ విప్లవంలో మొదటిసారిగా భూస్వాముల తుపాకి గుండ్లకు గురియైనది కడివెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య.

ఆయన అమరత్వం, స్మృతి కమ్యూనిస్టు విప్లవకారులను నిరంతరం వ్యవసాయ విప్లవోద్యమ కర్తవ్యోన్ముఖులను చేస్తూనే ఉంటుంది. ఒక నూతన ప్రజాతంత్ర వ్యవస్థ స్థాపన ప్రజల సాయుధ పోరాటంద్వారానే సాధ్యమవుతుందని కొమురయ్య లాంటి అమరవీరులు చాటి చెప్పారు.

– సి. భాస్కర్, యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్)
(నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి)

భక్తి మార్గం నుంచి దేశ విముక్తి మార్గానికి!

సందర్భం



పి. వేణుగోపాల్ రెడ్డి

దేశ దాస్య శృంఖలాలను తెంచడానికి ప్రాణాలు అర్పించిన అతికొద్దిమంది భారత విప్లవ వీరుల్లో అల్లూరి శ్రీరామ రాజు (సీతారామరాజు) ఒకరు. మైదాన ప్రాంతం నుంచి మన్యం వెళ్లి, గిరిజనులను ఏకం చేసి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు ఏనాటికీ మరచిపోలేని ఒక మహోద్యమాన్ని నిర్మించారు.

1897 జూలై 4న శ్రీరామరాజు విశాఖ జిల్లా పాండ్రంగిలో జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి కలరాతో మరణించారు. 1915లో ఇల్లు విడిచి దేశాటన చేశారు. 1917 జూలై 24న శ్రీరామరాజు దేశ పర్యటనలో భాగంగా 'కృష్ణదేవిపేట' చేరుకున్నారు. అది మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి కరువు రాజ్యమేలుతున్న కాలం. ప్రజలకు ఉపాధి కల్పించడానికి బ్రిటిష్ ప్రభుత్వం పనులు ప్రారంభించింది. అలా మన్యంలో రోడ్ల నిర్మాణం మొదలయింది. కానీ గూడెం డిప్యూటీ తహసీల్దార్ అల్ఫ్ బాస్టియన్ బినామీ పేర్లతో కాంట్రాక్టు తీసుకుని, మన్యం మునసబులు, ముఠాదారులను బెదిరించి గిరిజనులను పనికి రప్పించి కూలి ఇవ్వక వేధించేవాడు. ఇలాంటి సమయంలో పెద్దవలస మాజీ ముఠాదారు కంకిపాటి బాలయ్య పడాలు (ఎండు పడాలు), బట్టిపనుకుల మునసబు గాం గంటన్న దొర వంటివారు 1922 జనవరిలో రామరాజు దగ్గరకు వచ్చి గోడు వినిపించుకున్నారు. అప్పటివరకు పూర్తి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తూ, చిన్న చిన్న తగాదాలు తీరుస్తూ వచ్చిన రాజు... బాస్టియన్ మీద పై అధికారులకు ఫిర్యాదు రాశారు. ఫలితం రామరాజు మన్యంలో సహాయ నిరాకరణ ఆరంభించాడంటూ నర్సీపట్నంలో పదహారు రోజులు నిర్బంధించారు బ్రిటిష్‌వాళ్లు. తరువాత పోలవరం డిప్యూటీ తహసీల్దార్ ఫజులుల్లా ఖాన్ (రాజు పిన తండ్రి రామచంద్రరాజు స్నేహితుడు) రామరాజుకు పైడిపుట్ట వద్ద యాభయ్ ఎకరాల పొలం ఇచ్చి, దుచ్చెర్తి ముఠాదారు చెక్కా లింగన్న దొర అజమాయిషీలో ఉంచాడు. అక్కడే నేపాల్ యాత్ర చేయాలని బ్రిటిష్‌వాళ్ల దగ్గర అనుమతి తీసుకుని, నేపాల్‌కు వెళ్లకుండా మన్యంలో ఉద్యమ నిర్మాణం చేపట్టాడాయన.

రాజు గెరిల్లా యుద్ధ రీతిని ఎంచుకున్నారు. అందుకు అవసరమయ్యే ఆయుధాల కోసం పోలీస్ స్టేషన్లపై దాడులు చేశారు. ఎండు పడాలు, గంటన్న, రామరాజు నాయకత్వాలలో మూడు దళాలు ఏర్పాటయినాయి. 1922 ఆగస్టు 22న పట్టపగలు మొదట 'చింతపల్లి' పోలీస్ స్టేషన్ మీద దాదాపు 300 మందితో దాడి చేశారు. 11 తుపాకులు దొరికాయి. ఈ ఆయుధాలు తీసుకు వెళుతున్నానని ఒక లేఖ రాసి మరీ వెళ్లారు రామరాజు. ఆగస్టు 23న



'కృష్ణదేవిపేట' పోలీస్ స్టేషన్ మీద, ఆగస్టు 24న 'రాజవొమ్మంగి' స్టేషన్ (తూర్పు గోదావరి) మీదా దాడిచేసి తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. అదనపు పోలీస్ దళాలు దిగినా... జైపూర్ మహారాజు ఐదు ఏనుగుల మీద పోలీసుల కోసం పంపిన సామగ్రిని సెప్టెంబర్ 3న 'ఒంజేరి ఘాట్'లో రాజుదళం వశం చేసుకుంది.

1922 సెప్టెంబర్ 24న దామనపల్లికి రాజు దళం వస్తున్నదన్న సమాచారం తెలిసి స్కాట్ కవర్ట్, నెవెల్లి హైటర్ అనే ఒరిస్సా పోలీసు అధికారుల నాయకత్వంలో రెండు పటాలాలు వెళ్లాయి. ఆ ఇద్దరినీ కూడా కొండదళం మట్టుపెట్టింది. అక్టోబర్ 15న 'అడ్డతీగల' మీద రాజు దాడి చేశారు. అక్టోబర్ 19న 'చోడవరం' స్టేషన్‌పై దాడి చేశారు కానీ ఈ రెండు చోట్ల ఆయుధాలు దొరకలేదు. అప్పటికే స్టేషన్లలోని ఆయుధాలను ట్రెజరీలకి తరలించడం మొదలయిపోయింది.

కొండలలో పోరాడే మలబారు దళాలు వచ్చాయి. ఎనిమిది మంది రాజు అనుచరులు చనిపోయారు. ఈ మృతదేహాలను మన్యంలో ఊరేగించి, భయానికి బీజం వేశారు బ్రిటిష్‌వాళ్లు. 1923 ఏప్రిల్ 17న రామరాజు దళం ఆకస్మాత్తుగా 'అన్నవరం' పోలీస్ స్టేషన్‌లో ప్రత్యక్షమైంది. ఆ సందర్భంలోనే 'చెరుకూరి నరసింహమూర్తి'కి రామ రాజు ఇంటర్వ్యూ ఇచ్చారు. అదే ఏప్రిల్ 24న 'ఆంధ్రపత్రిక'లో వెలువడింది. ఆ ఏడాది సెప్టెంబర్ 17 రాత్రి మల్లుదొర దొరికి పోవడం ఉద్యమానికి కీడు చేసింది.

1924 జనవరికి అస్సాం రైఫిల్స్ కూడా రామరాజు వేటకు వచ్చింది. ఆ దళ అధిపతి మేజర్ గుడాల్. మన్యం పోలీసు హింసతో, అత్యాచారాలతో తల్లడిల్లిపోయింది. మే నెల ఆరంభంలో 'రేవుల కంతారం' అనేచోట రాజు దళం సమావేశం జరుగుతూ ఉండగా పోలీసులు దాడి చేశారు. రామరాజు ఒక్కడు రాత్రి వేళ 'మంప' చేరుకుని, ఒక చేనులోని మంచె మీద పరున్నాడు. తెల్లవారితే మే 7వ తేదీ. రాజు వేకువనే మంచె దిగి అక్కడి కుంటలో స్నానం చేస్తుండగా ఈస్ట్‌కోస్ట్ దళానికి చెందిన కంచుమేనన్, ఇంటెలిజెన్స్ పెట్రోలింగ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆళ్వార్‌నాయుడు బలగంతో చుట్టుముట్టి అరెస్టు చేశారు.

అరెస్టు చేసిన రాజును ఒక నులక మంచానికి కట్టి, కృష్ణదేవిపేటకు పయనమయ్యారు. దారిలోనే ఉన్న 'కొయ్యూరు'లో మేజర్ గుడాల్ రాజును మాట్లాడతానని గుడారంలోకి తీసుకు వెళ్లాడు. అక్కడే ఇద్దరికీ వాగ్యుద్ధం జరిగింది. ఆగ్రహించిన గుడాల్ ఒక చెట్టుకు కట్టి కాల్చి చంపాడు. ఆ తర్వాత ఉద్యమం త్వరలోనే అంతమయ్యింది. కానీ రామరాజు అమరుడిగా నిలిచిపోయారు.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు
(నేడు అల్లూరి సీతారామరాజు జయంతి)

అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు

- ఆయన జయంతిని తెలంగాణ గడ్డమీద జరుపుకోవడం గొప్ప విషయం: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: దేశ స్వాతంత్య్రం కోసం, స్వయం పాలన కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి బ్రిటిష్ పాలకులతో పోరాడిన అల్లూరి సీతారామరాజు త్యాగం గొప్పదని, స్వాతంత్య్రోద్యమ చరిత్రలో వారి అమరత్వం అజరామరమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి (జూలై 4) ఉత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో జరగనున్న సందర్భంగా దేశం కోసం వారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. గిరిజనుల హక్కుల సాధన కోసం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లూరి ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమైనవని, సీతారామరాజు వంటి వీరుల స్ఫూర్తితో ఎందరో దేశ పౌరులు నాటి స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. భారత రాష్ట్రపతి పాల్గొంటున్న, చారిత్రక సందర్భమైన అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించుకోవడం గొప్ప విషయమని అన్నారు.

ప్రగతితో ప్రాణత్యాగాలను నిలువరించాం

- దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దశాబ్దాల పాటు కొనసాగిన తెలంగాణ ప్రాణ త్యాగాల పరంపరను స్వయం పాలనలోని ప్రగతి ప్రస్థానంతో నిలువరించగలిగామని, నాటి ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించిన గోదావరీ నదీ లోయ తదితర ప్రాంతాలు నేడు కాళేశ్వరం జలాలతో పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి (జూలై 4) సందర్భంగా అమరుల త్యాగాలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. అమరుల ఆకాంక్షలను నిజం చేస్తూ ఉద్యమ లక్ష్యాన్ని సాధించుకుంటూ కేవలం తొమ్మిదేళ్ల కాలంలోనే తెలంగాణ సమాజానికి భవిష్యత్తు పట్ల భరోసాను నింపగలిగామని వివరించారు. అమరుల ఆశయాల సాధనే అత్యున్నత కర్తవ్యంగా భావించిన తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా చేపట్టిన కార్యాచరణతో సత్ఫలితాలు సాధిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ అమరుల మహోన్నత త్యాగాలను సమున్నతంగా గౌరవించుకునేందుకు, భావి తరాలు, అమరుల త్యాగాల చరిత్రను నిత్యం స్మరించుకునేలా హైదరాబాద్ నడిగడ్డపై 'తెలంగాణ అమర జ్యోతి'ప్రజ్వలనం చేసుకున్నామని తెలిపారు.

వైఎస్ జగన్ సర్కారు మార్గమే సరైనది

- మేనిఫెస్టోకు విలువనిచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీదే
- అందరికీ సమాన అవకాశాలు, సమ న్యాయం అందుతోంది
- టీడీపీ, పచ్చ పత్రికలు అవాస్తవాలు ప్రచారం చేస్తూ మభ్యపెడుతున్నాయి
- నాటా తెలుగు మహాసభల రాజకీయ ప్యానల్ చర్చలో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి. చిత్రంలో ఏపీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, నేమాని భాస్కర్, కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

సాక్షి, హైదరాబాద్: సమాజంలో అట్టడుగు స్థాయి వరకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా, సంస్కరణలతో కూడిన పాలన సాగిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్న దారే సరైనదని 'నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా)'తెలుగు మహాసభల్లో వక్తలు తేల్చి చెప్పారు.. వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న పథకాలు, విధానాలను ఏపీలో ప్రతిపక్షాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించడం ఇందుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. అమెరికాలోని డాలస్‌లో జరుగుతున్న నాటా తెలుగు మహాసభలు–2023లో భాగంగా రాజకీయ ప్యానెల్ చర్చలు జరిగాయి. ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి, సాక్షి టీవీ మేనేజింగ్ ఎడిటర్ నేమాని భాస్కర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కర్నూల్ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి తదితరులు ఈ చర్చలో పాల్గొన్నారు.

అవాస్తవ ప్రచారాలతో మభ్యపెడుతూ..

ఇటీవల చంద్రబాబు మినీ మేనిఫెస్టో ప్రకటించారని.. ఏదైనా వైఎస్ జగన్ చేసిన దానికి ఐదు రెట్లు చేస్తామని ప్రకటించారని కొమ్మినేని చెప్పారు. ఇన్నాళ్లూ జగన్ సంక్షేమ పథకాలను తప్పుపట్టిన రెండు పత్రికలు.. చంద్రబాబు హామీలను ఎంతో పొగిడాయని గుర్తు చేశారు. అంటే వైఎస్ జగన్ చేస్తున్నదే సరైనదని, చంద్రబాబు దాన్ని అనుసరించాల్సిందేనని వారే ఒప్పుకొంటున్నారని స్పష్టం చేశారు. దేశంలో ఎన్నికల మేనిఫెస్టోకు ఒక విలువ, ప్రాధాన్యత ఇచ్చిన ఏకై క ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని.. చెప్పింది చెప్పినట్టుగా 98.5 శాతం హామీలను జగన్ నెరవేర్చారని చెప్పారు. దీనితో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తప్పుపట్టలేక.. కావాలని రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవంటూ అవాస్తవ ప్రచారాలకు దిగుతున్నారని మండిపడ్డారు.

సుస్థిర అభివృద్ధి దిశగా పాలన

''స్వాతంత్య్రం నాటికి విపరీతమైన అసమానతలు, భిన్నత్వం, కుల వ్యవస్థ, పాలన తీరు వంటివి ఉన్నా.. రాజ్యాంగం దేశాన్ని ఒక్కటిగా, ప్రజాస్వామ్య మార్గంలోకి తీసుకెళ్లింది. రాజ్యాంగ పీఠిక ప్రజలందరికీ సమాన అవకాశాలు, సమన్యాయం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ సైద్ధాంతిక పునాది, స్ఫూర్తితోనే పేదలు ఏయే రంగాల్లో వెనుకబడి ఉన్నారో అన్నింటిలోనూ వారిని ముందుకు తీసుకువచ్చేందుకు వీలుగా.. సుస్థిర అభివృద్ధికి వీలుగా విధానాలను, పథకాలను అమలు చేస్తున్న ఒకే ఒక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే..'' అని 'సాక్షి'మీడియా గ్రూపు ఎడిటర్ వర్ధెల్లి మురళి తెలిపారు. ఇటీవలి 'టైమ్స్ నౌ–నవభారత్ సర్వే' ప్రజల్లో వైఎస్ జగన్‌కు ఉన్న ఆదరణను పట్టి చూపిందని, 24–25 ఎంపీ సీట్లు వైఎస్సార్ సీపీకే వస్తాయని తేల్చిందని వివరించారు.

నాడు–నేడు ఎంతో మార్పు

విద్య, వైద్యంతోపాటు సంక్షేమం, అభివృద్ధి అన్ని రంగాల్లో 'నాడు–నేడు'ఎంతో మార్పు వచ్చిందని.. మౌలిక సదుపాయాల కల్పన నుంచి ఆర్థిక సాయం దాకా అన్ని అంశాల్లో పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని సాక్షి టీవీ మేనేజింగ్ ఎడిటర్ నేమాని భాస్కర్ చెప్పారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు పథకాలను అమలు చేస్తుంటే దోచిపెడుతోందంటూ ప్రతిపక్షం అవాస్తవ ప్రచారాలకు పాల్పడుతోందని.. పేదలకు మంచి విద్య, సరైన వైద్యం అందిస్తే దోచిపెట్టినట్టా? అని ప్రశ్నించారు. మాటలే కాదు.. చేతల్లో చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని చెప్పారు.

గ్రామాలకు చేయూత

- డల్లాస్ 'నాటా'తెలుగు మహాసభలనుద్దేశించి సీఎం జగన్ వీడియో సందేశం



సాక్షి, అమరావతి: ప్రవాసాంధ్రులు విలువైన తమ నైపుణ్యాలు, అనుభవాలను పంచుకుంటూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఐక్యంగా కాపాడుకుంటూ ఎన్నారైలు విదేశాల్లో కీలక పదవుల్లో, ఉన్నత స్థానాల్లో రాణిస్తుండటం పట్ల సీఎం జగన్ హర్షం వ్యక్తం చేశారు. అమెరికాలోని డల్లాస్‌లో జరుగుతున్న 'నాటా'(నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్) తెలుగు మహా సభలనుద్దేశించి ముఖ్యమంత్రి జగన్ సోమవారం వీడియో సందేశం పంపారు. గ్లోబల్ సిటిజన్‌గా ఎదిగేందుకు చదువన్నది కీలక సాధనమన్నారు. మన విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేందుకు నాలుగేళ్లుగా విద్యా రంగంలో తెచ్చిన విప్లవాత్మక మార్పులు, గ్రామాల్లోనే అందిస్తున్న సేవలను గమనించాలని ఈ సందర్భంగా కోరారు. ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

మీరంతా మాకు గర్వకారణం..: పెద్ద పెద్ద కంపెనీల్లో సీఈవోలుగా, ఐటీ నిపుణులుగా, నాసా సైంటిస్టులుగా, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లుగా, అమెరికా ప్రభుత్వంలో ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా, పేరు పొందిన డాక్టర్లుగా రాణిస్తున్న మిమ్మల్ని చూసి మేమంతా గర్వపడుతున్నాం. రాష్ట్రంలో విద్యారంగంలో తెచ్చిన మార్పులను గమనిస్తే మన గవర్నమెంట్ బడులన్నీ పూర్తిగా రూపురేఖలు మారుతున్నాయి. విద్యారంగం ఒక్కటే కాదు.. ఏది చూసినా ఇలాంటి మార్పులే కనిపిస్తాయి. ఒక్కసారి మీ గ్రామాన్ని పరిశీలిస్తే ఎప్పుడూ చూడని విధంగా విలేజ్ సెక్రటేరియట్ మీ కళ్లెదుటే కనిపిస్తుంది. బర్త్ సర్టిఫికెట్ నుంచి దాదాపు 600 రకాల సేవలు అందిస్తున్నాం. ఇవాళ ప్రతి గ్రామంలోనూ ఒక రైతు భరోసా కేంద్రం కనిపిస్తోంది. మన గ్రామంలోనే విలేజ్ క్లినిక్‌లు కూడా కనిపిస్తాయి. మీ అందరికీ ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా.. మన రాష్ట్రానికి మీరు ఏ రకంగా ఉపయోగపడగలిగితే ఆ రకంగా తోడ్పాటు అందించండి. ఆర్థికంగా అనే మాటలు కాస్తో కూస్తో బాగుంటాయి కానీ అంతకంటే ఎక్కువగా మీ అనుభవం అవసరం. ఇప్పటికే అభివృద్ధి చెందిన పాశ్చాత్య ప్రపంచంలో మీరు ఎన్నో ఏళ్లుగా ఉన్నారు కాబట్టి మీ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుంది. మీరు ఇంకా ఎక్కువగా ఆంధ్ర రాష్ట్రం మీద, మన గ్రామాలపైన ధ్యాస పెట్టగలిగితే అవన్నీ మన రాష్ట్రానికి ఉపయోగపడతాయి. ఇది నా తరపు నుంచి మీకు చేస్తున్న విజ్ఞప్తి.

- తెలంగాణ ఉద్యమ గాయకుడు, దివంగత సాయిచంద్ సతీమణి రజని సోమవారం సాయంత్రం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. భర్త మృతితో నాలుగైదు రోజుల నుంచి వేళకు ఆహారం తీసుకోకపోవడంతో తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యతో పాటు లో బీపీ, నీరసం వంటి సమస్యలు వచ్చాయి. దీంతో చికిత్స కోసం బంధువులు ఆమెసమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వివేకా హత్య కేసు విచారణ రేపటికి వాయిదా

- పీఏ కృష్ణారెడ్డి పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు
- బాధితులు ఎవరనే అంశంపై బుధవారం విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో బాధితులు ఎవరనే అంశంపై సుప్రీం కోర్టు బుధవారం విచారించనుంది. తనను బాధితుడిగా గుర్తించాలంటూ వివేకా పీఏ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ అంశంపై హైకోర్టుకు వెళ్లాలని ఇరు వర్గాలకు ధర్మాసనం తొలుత సూచించింది. పీఏ కృష్ణారెడ్డి బాధితుడా కాదా అనే అంశం హైకోర్టు తేలుస్తుందని చెప్పింది. కృష్ణారెడ్డి బాధితుడు కావొచ్చు, కాకపోవచ్చని, హైకోర్టు ఏ విషయం తేల్చిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించొచ్చని పిటిషనర్, వివేకా కుమార్తె సునీత నర్రెడ్డికి సూచించింది. సుప్రీంకోర్టులో లేవనెత్తిన ప్రశ్నలను హైకోర్టులో లేవనెత్తాలని పేర్కొంది. మృతుడి భార్య, కుమార్తె బాధితులని హైకోర్టు పేర్కొందని సునీత తరఫు న్యాయవాది సిద్దార్థ లూత్రా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేయనుందని, దీంట్లో కృష్ణారెడ్డి పాత్రపైనా ఏవైనా అంశాలు ఉండొచ్చని పేర్కొన్నారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన వ్యక్తి న్యాయ సహాయం కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారని, మరోవైపు సీబీఐ దర్యాప్తు గడువు అంశంపై 5న సీజేఐ ధర్మాసనం విచారించనుందని సిద్దార్థ వివరించారు. అనంతరం, ఈ అంశం చాలా సున్నితమైనదని, లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. బాధితులు ఎవరనే అంశంపై విచారణ చేపడతామని పేర్కొంది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

సెమీ కండక్టర్ల రంగంలో నిపుణులను పెంచుకోవాలి

- మైక్రోచిప్ టెక్నాలజీ డిజైన్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేటీఆర్, గణేశ్ మూర్తి

సాక్షి, హైదరాబాద్: సెమీకండక్టర్ల రంగంలో భారత్ సత్తా చాటాలంటే నైపుణ్యంగల మానవవనరులను పెంచుకోవాల్సిన అవసరముందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. దేశం వచ్చే దశాబ్దంలో అగ్రస్థాయికి దూసుకెళ్లడంలో రాబోయే రోజుల్లో హైదరాబాద్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. హైదరాబాద్ కోకాపేట్‌లోని వన్ గోల్డెన్ మైల్ టవర్‌లో మైక్రోచిప్‌టెక్ ఇండియా డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సోమవారం కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమీకండక్టర్ల రంగంలో నిపుణులను తయారు చేసేందుకు వెయ్యి మందికి రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చులతో శిక్షణ ఇస్తోందని వెల్లడించారు.

ఎలక్ట్రానిక్స్‌లోనూ అగ్రగామిగా...

ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్స్, మాన్యుఫ్యాక్చరింగ్ స్కిల్లింగ్ రంగంలోనూ తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోందని మంత్రి కేటీఆర్ తెలిపారు. నాస్కామ్ గణాంకాల ప్రకారం గత రెండేళ్లలో ఐటీ రంగంలో మూడో వంతు ఉద్యోగాలు హైదరాబాద్‌లోనే సృష్టించామన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలోనూ హైదరాబాద్ గణనీయమైన వృద్ధిని సాధించిందని, ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ–హబ్ కూడా హైదరాబాద్‌లోనే ఉందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. దేశంలో సుమారు 25 ఏళ్లుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న తాము అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా 1.68 లక్షల చదరపు అడుగుల్లో ప్రస్తుతం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించామని... ఇందులో వెయ్యి మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు మైక్రోచిప్ ప్రెసిడెంట్, సీఈఓ గణేశ్ మూర్తి వెల్లడించారు. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రంలో ఉన్న షాండ్లర్ కేంద్రంగా పనిచేస్తున్న మైక్రోచిప్ టెక్నాలజీ ఇన్‌కార్పొరేటెడ్ సంస్థ... ప్రపంచవ్యాప్తంగా ఆటోమోటివ్, ఏరోస్పేస్, డిఫెన్స్, కంప్యూటింగ్ మార్కెట్లకు చెందిన లక్షా 25వేల మంది కస్టమర్లకు సేవలు అందిస్తోంది. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సృజనాత్మక పాలసీల వల్లే తెలంగాణకు గుర్తింపు

- ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కేటీఆర్



నాగేశ్వర్‌రెడ్డికి అవార్డు అందిస్తున్న మంత్రి కేటీఆర్

మాదాపూర్: తెలంగాణ మోడల్ అభివృద్ధి చెందడానికి, రాష్ట్రానికి గుర్తింపు రావడానికి ప్రభుత్వ పాలసీలన్నింటిలో సృజనాత్మకత తీసుకురావడమే కారణమని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సోమవారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ (ఎఫ్‌టీసీసీఐ) ఎక్సలెన్స్ అవార్డులు–2022 ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకుంటే టీఎస్–ఐపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి 22 మంది విజేతలకు అవార్డులు అందజేశారు. జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ఏఐజీ హాస్పిటల్స్ సీఎండీ డి. నాగేశ్వర్‌రెడ్డికి ప్రదానం చేశారు.

కాళేశ్వరం ఎత్తిపోతలు ప్రారంభం

- రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- సీఎం కేసీఆర్ ఆదేశాలతో మోటార్లు ఆన్ చేసిన ఇంజనీర్లు
- లక్ష్మీపంపుహౌస్ నుంచి ఆరు మోటార్లతో ఎత్తిపోతలు
- ప్రస్తుతం ప్రాణహిత నది నీరే ఆధారం



రెండు మోటార్లతో ఎత్తిపోస్తున్న వరద నీరు

కాళేశ్వరం/రామగుండం/మంథని: రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై కాళేశ్వరం ప్రాజెక్టు లింకు–1, 2లోని బ్యారేజీలు, పంపుహౌస్‌ల నుంచి ఖరీఫ్ సీజన్‌కు నీటిని ఎత్తిపోయాలని.. సాగు, తాగునీటికి ఇబ్బందులు కలగొద్దని సీఎం ఆదేశించారు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ (మేడిగడ్డ)బ్యారేజీ బ్యాక్‌వాటర్‌లో నిల్వ ఉన్న నీటిని లక్ష్మీపంపుహౌస్‌లో ఉన్న 11 మోటార్లలో ఆరింటి ద్వా రా ఎత్తిపోతలను ప్రారంభించారు. ఆరు మోటార్లు 12 పంపులతో నీటిని డెలివరీ సిస్టర్న్ వద్ద ఎత్తిపోస్తున్నాయి. ఎత్తిపోసిన జలాలు గ్రావిటీ కాల్వ ద్వారా 13.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి అన్నారం (సరస్వతీ) బ్యారేజీకి చేరుతున్నాయి. రోజుకు ఒక టీఎంసీ చొప్పున తరలిస్తున్నారు. ఎత్తిపోసిన నీటిని అన్నారం నుంచి సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు రిజర్వాయర్లకు తరలించనున్నారు.

ప్రాణహిత నది నీరే ఆధారం..

తెలంగాణలో వర్షాలు లేకపోవడంతో గోదావరి ద్వారా నీటి లభ్యత లేదు. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్న ప్రాణహిత నది ద్వారా 20.60 వేల క్యూసెక్కుల నీరు లక్ష్మీబ్యారేజీకి చేరుతోంది. దీంతో బ్యారేజీ వద్ద 17.87 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 5.647 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మొత్తం 85 గేట్లు మూసి ఉంచారు. ప్రాణహితకు ఎగువన వర్షాలు పడడంతో నీటిలభ్యత పెరుగుతోంది. దీంతో ప్రాణహిత నది నీరే ఆధారంగా తెలంగాణ వ్యాప్తంగా నీటిని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు ఇంజనీర్లు ఎత్తిపోతలు ప్రారంభించారు.

11 మోటార్లతోనే..

గత ఏడాది జూలై 14న భారీ వర్షాలతో లక్ష్మీపంపు హౌస్ నీటమునిగి 17 మోటార్లలో 6 మోటార్లు పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. కాగా, మిగతా 11 మోటార్లతో రోజుకు ఒక్క టీఎంసీ నీటిని ఖరీఫ్ సాగు, తాగునీటి అవసరాలకు తరలించడానికి ఇంజనీరింగ్ అధికారులు సన్నద్ధమయ్యారు. వర్షాలు లేకపోతే పూర్తిగా కాళేశ్వరం ప్రాజెక్టు మీదనే రాష్ట్రమంతా ఆధారపడాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలిసింది.

ఎల్లంపల్లిలోకి కాళేశ్వరం జలాలు..

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి సోమవారం కాళేశ్వరం జలాల ఎత్తిపోతలను ప్రారంభించినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పార్వతి పంపుహౌస్ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి రెండు మోటార్లతో 5,220 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎల్లంపల్లి పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 11.64 టీఎంసీల నీరు ఉంది.

లింబాద్రికి ఏపీ మంత్రి అభినందనలు



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున సోమవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రిని కలిసి అభినందించారు. మండలి కార్యాలయానికి వచ్చిన మంత్రి లింబాద్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా లింబాద్రి పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని, సమర్థుడైన వ్యక్తికి తెలంగాణ ప్రభుత్వం మంచి గుర్తింపు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున, లింబాద్రి గతంలో అధ్యాపక వృత్తిలో కొనసాగినప్పటి అనుభవాలను నెమరువేసుకున్నారు. లింబాద్రిని అభినందించినవారిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి కూడా ఉన్నారు.

క్లుప్తంగా...

మోదీ నివాసంపై డ్రోన్!

అలాంటిదేమీ లేదన్న ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక నివాసంపై డ్రోన్ ఎగురుతూ కనిపించిందన్న సమాచారం తీవ్ర కలకలం సృష్టించింది. అయితే, అనుమానాస్పద డ్రోన్ ఇక్కడ సంచరించినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నివాసంపై డ్రోన్ లాంటి ఎగిరే వస్తువు సంచరిస్తున్నట్లు సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో కంట్రోల్ రూమ్‌కు ఫోన్ వచ్చిందని అన్నారు. వెంటనే అప్రమత్తమై ప్రధాని నివాసంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టామని, డ్రోన్ కనిపించలేదని వెల్లడించారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)కు సైతం అనుమానాస్పద డ్రోన్ కనిపించలేదన్నారు. ఈ మొత్తం ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లో మోదీ అధికారిక నివాసం ఉంది. ఈ ప్రాంతాన్ని నో-ఫ్లై జోన్‌గా ప్రకటించారు.

పురుషులకు జాతీయ కమిషన్ పిల్ కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: పురుషుల హక్కుల పరిరక్షణకు 'జాతీయ కమిషన్ ఫర్ మెన్' ఏర్పాటు చేయాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. గృహ హింస కారణంగా ఆత్మహత్యలకు పాల్పడే పురుషుల కేసులపై విచారణకు మార్గదర్శకాలను రూపొందించాలని పిటిషనర్ న్యాయవాది మహేశ్ కుమార్ తివారీ కోరారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం 2021లో 1,64,033 ఆత్మహత్యలు చేసుకోగా వారిలో 81,063 మంది వివాహితులైన పురుషులున్నారని, 28,680 మంది వివాహిత మహిళలని వివరించారు. వీరిలో కుటుంబ సమస్యలతో బలవన్మరణాలకు పాల్పడిన వారు 33.2% కాగా, వివాహ సంబంధిత సమస్యలతో 4.8% మంది తనువు చాలించినట్లు తెలిపారు. వివాహమైన పురుషుల ఆత్మహత్యల సమస్యను పరిష్కరించేందుకు, గృహ హింసకు గురవుతున్న పురుషుల ఫిర్యాదులను స్వీకరించడానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ)ని ఆదేశించాలని పిటిషనర్ కోరారు. ఈ పిల్‌పై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం విచారణ చేపట్టింది. 'మీరు నాణేనికి ఒక వైపునే చూపించాలనుకుంటున్నారు. పెళ్లవగానే చనిపోతున్న యువతుల డేటాను మీరివ్వగలరా? చనిపోవాలని ఎవరూ అనుకోరు. అది వ్యక్తిగతంగా వారు ఎదుర్కొనే పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది' అని పేర్కొంది. పిల్ ఉపసంహరించుకునేందుకు పిటిషనర్‌కు అవకాశం ఇచ్చింది.

ఇక బిహార్ వంతు...?

బిహార్‌లోనూ మహారాష్ట్ర తరహా రసవత్తర రాజకీయ క్రీడకు తెర లేవనుందా? తద్వారా ఉత్తరాదిన కొరకరాని కొయ్యగా మారిన ఏకైక రాష్ట్రాన్నీ బీజేపీ గుప్పిట పట్టజూస్తోందా? అందుకోసం నితీశ్ పార్టీ జేడీ(యూ)ను చీల్చి నిర్వీర్యం దిశగా పావులు కదుపుతోందా...? పరిస్థితులను చూస్తుంటే అవుననే అనిపిస్తోంది...



మహారాష్ట్ర తరహాలో ఆపరేషన్ కమలం!

- జేడీ(యూ)ను చీల్చే యత్నాలకు పదును
- ఉత్తరాదిని పూర్తిగా గుప్పిట పట్టడమే కమలనాథుల లక్ష్యం

మహారాష్ట్రలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో చీలిక ఆశ్చర్యకరమేమీ కాదు. అనుకోనిది అసలే కాదు. శరద్ పవార్ అన్న కొడుకు అజిత్ పవార్ ఏకంగా మూడింట రెండొంతుల మంది ఎమ్మెల్యేలతో కలిసి అధికార బీజేపీ-శివసేన (షిండే) కూటమికి జై కొట్టి షాకిచ్చారు. గాలివాటును బట్టి రాజకీయ వైఖరి మార్చడంలో చిన్నాన్న కంటే రెండాకులు ఎక్కువే చదివానని నిరూపించుకున్నారు. ఏడాది క్రితమే ఏక్‌నాథ్ షిండే ద్వారా శివసేనను బీజేపీ నిలువునా చీల్చి బలహీనపరచడం తెలిసిందే. అందుకు బదులుగా షిండేకు సీఎం పీఠం దక్కితే తాజాగా ఎన్సీపీని చీల్చినందుకు అజిత్‌కు డిప్యూటీ సీఎం పోస్టు దక్కింది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నాటికో, తదనంతరమో ఈ రెండు చీలిక వర్గాలూ కమల దళంలో విలీనమైపోతాయని భావిస్తున్నారు. తద్వారా శివసేన, ఎన్సీపీలను నామమాత్రంగా మార్చేసి బలమైన విపక్షమన్నదే లేకుండా చేసుకోవడం బీజేపీ వ్యూహంగా కన్పిస్తోంది. అయితే మహారాష్ట్ర అసెంబ్లీలో మెజారిటీకి మించిన బలమున్నా ఎన్సీపీని చీల్చడం ఆసక్తికరమైన పరిణామమే. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలను కూడగట్టే ప్రయత్నాల్లో కొంతకాలంగా కీలకంగా వ్యవహరిస్తున్న శరద్ పవార్‌కు ఈ రూపంలో కమలనాథులు కోలుకోలేని షాకిచ్చినట్టు కన్పిస్తోంది. పిలవడమే తడవుగా రెక్కలు కట్టుకుని తన గూటిలోకి వచ్చి వాలేందుకు అజిత్ ఎప్పట్నుంచో సిద్ధంగా ఉన్నా పనిగట్టుకుని ఇప్పుడే ఎన్సీపీని బీజేపీ దెబ్బ కొట్టడం వెనక ఇదే ప్రధాన కారణమన్నది పరిశీలకుల అభిప్రాయం. పవార్ ప్రస్తుతం విపక్ష నేతల సానుభూతి వెల్లువలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు! నాలుగేళ్ల నాడు ఇలాగే శివసేనతో జట్టు కట్టిన అజిత్‌ను అతికష్టమ్మీద దారికి తెచ్చుకోగలిగిన ఆయనకు తాజా దెబ్బ నుంచి కోలుకోవడం పవార్‌కు కష్టమే కావచ్చు. ఆయనకు నమ్మినబంటైన ఎన్సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ వంటి నేతలు కూడా అజిత్ పంచన చేరడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. పవార్ కూతురు సుప్రియా సులే సమర్థురాలే అయినా ఎన్సీపీకి ఉద్ధవ్ పార్టీ గతి పట్టకుండా కాచుకోవడం శక్తిని మించిన పనేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిణామం ఇతర విపక్షాలనూ ఆలోచనలో పడేసింది. జూలై 13-14 తేదీల్లో బెంగళూరులో తలపెట్టిన తదుపరి మేధోమథన భేటీ కూడా నాలుగు రోజుల పాటు వాయిదా పడింది! ఇలా బీజేపీ ఒకే దెబ్బతో ఒకటికి మించిన లక్ష్యాలను తాత్కాలికంగానైనా సాధించినట్టేనన్న భావన వ్యక్తమవుతోంది. కాంగ్రెస్-ఆప్ విభేదాలతో ఇప్పటికే డీలా పడ్డ విపక్షాల ఐక్యతా యత్నాలకు ఈ పరిణామం గట్టి దెబ్బేనంటున్నారు.

తదుపరి టార్గెట్ నితీశే...!


మహారాష్ట్ర అనంతరం ఇప్పుడిక బీజేపీ దృష్టి బిహార్‌పైకి మళ్లినట్టు కన్పిస్తోంది. అందుకు కారణాలూ లేకపోలేదు. తొమ్మిదేళ్లుగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు, పలు రాష్ట్రాల్లో స్థానిక విపక్షాలకు చుక్కలు చూపుతున్న బీజేపీకి ఉత్తరాదిన బిహార్ మాత్రం ఓ పట్టాన కొరుకుడు పడటం లేదు. నిజానికి ఏడాది క్రితం షిండే శివసేనను చీల్చినప్పుడే బిహార్‌లోనూ అలాంటిదేదో జరుగుతుందని చాలామంది ఊహించారు. ఒకరకంగా దానికి భయపడే బీజేపీకి అవకాశమివ్వకుండా అప్పట్లో నితీశ్ కుమార్ తానే తొలి ఎత్తు వేశారు. బీజేపీకి గుడ్‌బై చెప్పి, ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు తదితరాలన్నింటినీ కలుపుకోవడం ద్వారా అధికారాన్ని నిలుపుకుని రాజకీయ చతురత ప్రదర్శించారు. కానీ బీజేపీ మాత్రం ప్రయత్నాలు మానలేదు. జేడీ(యూ) బలాన్ని కొద్దికొద్దిగా తగ్గిస్తూ వస్తోంది. నితీశ్‌కు నమ్మకస్తుడైన ఉపేంద్ర కుష్వాహా జేడీ(యూ)కు గుడ్‌బై చెప్పి సొంత కుంపటి పెట్టుకోవడం, జితిన్‌రామ్ మాంఝీ సారథ్యంలోని హిందూస్తానీ అవామ్ మోర్చా అధికార కూటమిని వీడటం వంటివన్నీ దాని ఫలితమేనంటారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి వీరంతా బీజేపీ తీర్థం పుచ్చుకున్నా ఆశ్చర్యం లేదు. జేడీ(యూ)కూ సేన, ఎన్సీపీ గతి తప్పదంటూ కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావాలే, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోదీ వంటి వారు ఇప్పటికే మాటల దాడికి దిగుతున్నారు. ఇదంతా బీజేపీ మైండ్‌గేమ్‌లో భాగమేనని భావిస్తున్నారు. నితీశ్ కరిష్మా క్రమంగా తగ్గుతుండటం, ప్రధాని మోదీ మేనియా నానాటికీ విస్తరిస్తుండటం జేడీ(యూ) నేతలు, ఎమ్మెల్యేల్లో చాలామందిని 'ఆలోచన'లో పడేస్తోందన్నది రాజకీయ వర్గాల విశ్లేషణ. ఏళ్ల తరబడి బీజేపీ మిత్రపక్షంగా కొనసాగిన జేడీ(యూ) ప్రభ తగ్గుతూ వస్తోంది. ఇలాంటప్పుడే ఆ పార్టీని వీలైనంత గట్టి దెబ్బ తీస్తే మరో కీలక రాష్ట్రమూ చిక్కినట్టేనన్నది కమలనాథుల వైఖరిగా కన్పిస్తోంది. ఈ తాజా దాడిని కాచుకునేందుకు నితీశ్ ఇప్పటికే రంగంలోకి దిగారు. పార్టీ ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశమవడం తదితరాల ద్వారా వారి విధేయత సడలకుండా చూసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ఎత్తులూ పై ఎత్తులతో రంజుగా సాగుతున్న బిహార్ రాజకీయ చదరంగంలో చివరికి ఎవరిది పై చేయి అవుతుందన్నది ఆసక్తికరం.

విపక్షాల భేటీ.. 17, 18తేదీల్లో...?

న్యూఢిల్లీ: దేశంలో అధికార బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రతిపక్ష నేతలు జూన్ 23న బిహార్ రాజధాని పాట్నాలో సమావేశమైన సంగతి తెలిసిందే. తదుపరి భేటీ ఈ నెల 17, 18న కర్ణాటక రాజధాని బెంగళూరులో జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ సోమవారం ట్వీట్ చేశారు. ఫాసిస్ట్, అప్రజాస్వామిక శక్తులను ఓడించాలన్నదే ధ్యేయమని, అందుకోసమే ప్రతిపక్షాలు చేతులు కలుపుతున్నాయని చెప్పారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నదే విపక్ష కూటమి సంకల్పమని వివరించారు. వాస్తవానికి విపక్షాల సమావేశాన్ని ఈ నెల 13, 14న నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. ఆ సమయంలో కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో తమ భేటీని 17, 18వ తేదీకి వాయిదా వేయాలని నిర్ణయించారు.

మోదీ వాషింగ్ పౌడర్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. మహారాష్ట్రలో ఎన్సీపీ నాయకులు అవినీతిపరులంటూ ఆరోపించిన మోదీ ఇప్పుడు ఆదే నాయకులను ప్రభుత్వంలో ఎలా చేర్చుకున్నారని ప్రశ్నించారు. బీజేపీ వాషింగ్ మెషీన్ మళ్లీ పని చేస్తోందని, ఇన్‌కం ట్యాక్స్, సీబీఐ, ఈడీ(ఐసీఈ) అనే సబ్బుతో అవినీతిపరులను పరిశుద్ధులను చేస్తోందని ట్విట్టర్‌లో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అన్ని మరకలను చిటికెలో తొలగిస్తుంది అనే ట్యాగ్‌లైన్‌తో 'మోదీ వాషింగ్ పౌడర్' చిత్రాన్ని జైరామ్ రమేశ్ షేర్ చేశారు. విపక్షాల కూటమి ఏర్పాటు కాకూడదని కోరుకుంటున్న బీజేపీకి భంగపాటు తప్పదని స్పష్టం చేశారు.



'సెమీ క్రయోజనిక్' టెస్ట్... సూపర్ సక్సెస్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కీర్తికిరీటంలో మరో కలికి తురాయి చేరింది. పిలిచే సెమీ క్రయోజనిక్ ఇంజిన్ ఇంటర్మీడియట్ కాన్ఫిగరేషన్ పరీక్ష (పవర్ హెడ్ టెస్ట్ ఆర్టికల్)ను సంస్థ మొదటి ప్రయత్నంలోనే విజయవంతంగా నిర్వహించింది. తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరి వద్ద ఇస్రో ప్రపొల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ) సెంటర్‌లో జూలై 1న ఈ పరీక్ష జరిపినట్టు సోమవారం ఇస్రో ప్రకటించింది. ''భవిష్యత్తు ప్రయోగ వాహనాలను దృష్టిలో ఉంచుకుని బూస్టర్ దశలను శక్తిమంతం చేయడం, 2000 కేఎన్ థ్రస్ట్ సెమీ క్రయోజనిక్ ఇంజన్‌ను అభివృద్ధి చేయడం ఈ పరీక్ష లక్ష్యం. గ్యాస్ జనరేటర్, టర్బో పంపులు, ప్రీ-బర్నర్, కంట్రోల్ కాంపోనెంట్‌ల వంటి కీలకమైన సబ్ సిస్టమ్‌ల సమగ్ర పనితీరును 4.5 సెకండ్ల స్వల్ప వ్యవధిలో హాట్ ఫైరింగ్ చేసి ధ్రువీకరించడం దీని ముఖ్య ఉద్దేశం'' అని తన వైబ్‌సైట్‌లో వెల్లడించింది. ఇంధనం, ఆక్సిడైజర్ పంపులను నడపడానికి ప్రధాన టర్బైన్‌ను నడిపించే ప్రీ బర్నర్ ఛాంబర్‌లోని వేడి-గ్యాస్ జ్వలన, ఉత్పత్తిని పరీక్షించారు. ఇప్పటిదాకా లిక్విడ్ ఆక్సిజన్, లిక్విడ్ హైడ్రోజన్‌తో కలిపి క్రయోజనిక్ ఇంజిన్లు తయారు చేశారు. ఈ సెమీ క్రయోజనిక్ ఇంజన్‌ను మాత్రం సరికొత్తగా తయారు చేస్తున్నారు. ఇందులో లిక్విడ్ ఆక్సిజన్‌కు తోడుగా కిరోసిన్ ప్రపొల్లెంట్ కలయికతో నిర్వహించే ప్రయత్నం చేస్తున్నారు. కిరోసిన్ కలయికతో సెమీ క్రయోజనిక్ ఇంజన్ తయారు చేయాలని చిరకాల ప్రయత్నం ఇప్పటికి కార్యరూపు దాల్చింది. తదుపరి పరీక్షల్లో పనితీరును మరింత మెరుగు పరుచుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకునే దిశగా ఇస్రో అడుగులు వేస్తోంది.

13న చంద్రయాన్-3 ప్రయోగం

న్యూఢిల్లీ: చంద్రుడిపై అన్వేషణకు ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్-3 మిషన్ ఏర్పాట్లు తుదిదశకు చేరుకుంటున్నాయి. ఈ నెల 13వ తేదీన ఇస్రో దీనిని ప్రయోగించనుంది. ల్యాండర్-రోవర్ కాంబినేషన్‌తో చేపట్టే ఈ ప్రయోగం లక్ష్యం చంద్రుడిలోని సుదూర ప్రాంతాల అన్వేషణ. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు లాంచ్ విండో అందుబాటులో ఉంటుంది. అయితే, తొలిరోజే ప్రయోగం చేపట్టాలనుకుంటున్నామని ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ తెలిపారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్ టాప్-10లో ఐఐటీ హైదరాబాద్

ఉత్తమ కాలేజీలకు ర్యాంకులు ప్రకటించిన కేంద్ర విద్యాశాఖ

న్యూఢిల్లీ: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) 8వ ఎడిషన్‌ను కేంద్ర విద్యాశాఖ విడుదల చేసింది. టాప్-10లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్‌కు చోటు దక్కింది. 2016-2022 కాలంలో ఏడు వార్షిక ర్యాంకుల ఆధారంగా 2023 సంవత్సరానికి గాను ఆయా కాలేజీలకు ర్యాంకులు నిర్ణయించినట్లు తెలిపింది. ఏటా మాదిరిగానే ఈసారి కూడా అడ్మిషన్ సీజన్‌కు కొద్ది వారాలు ముందుగా వీటిని ప్రకటించింది. పరిశోధన సంస్థలు, డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, లా, మెడికల్, డెంటల్ మరియు ఆర్కిటెక్చర్ ప్లానింగ్ అంశాల్లో ర్యాంకులు, టీచింగ్ లెర్నింగ్ తదితర అంశాల పరిగణనలోకి తీసుకుంటూ టాప్-50 కాలేజీలకు ర్యాంకులిచ్చింది.

తొలి పది ఇవే...

1. ఐఐటీ మద్రాస్
2. ఐఐటీ ఢిల్లీ
3. ఐఐటీ బాంబే
4. ఐఐటీ కాన్పూర్
5. ఐఐటీ రూర్కీ
6. ఐఐటీ ఖరగ్‌పూర్
7. ఐఐటీ గువాహటి
8. ఐఐటీ హైదరాబాద్
9. ఐఐటీ తిరుచిరాపల్లి
10. జాదవ్‌పూర్ యూనివర్సిటీ

మణిపూర్ పరిణామాలపై నివేదిక ఇవ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. బాధితుల పునరావాసంతోపాటు శాంతి భద్రతలను మెరుగుపర్చేందుకు చేపట్టిన చర్యలు, ఆయుధాల స్వాధీనం వంటి అంశాలపై తాజా నివేదికను సమర్పించాలని మణిపూర్ ప్రభుత్వాన్ని సోమవారం ఆదేశించింది. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని, కర్ఫ్యూ సమయాన్ని ఐదు గంటలకు కుదించామని మణిపూర్ ప్రభుత్వం తెలియజేసింది. మణిపూర్‌లో మైనార్టీలైన కుకీ తెగ గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ(ఎన్జీవో) 'మణిపూర్ ట్రైబల్ ఫోరం' దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ ఆగస్టు 10కి వాయిదా పడింది. మరోవైపు, వేసవి సెలవుల అనంతరం సుప్రీంకోర్టు సోమవారం పునఃప్రారంభమైంది. మణిపూర్ పరిణామాలకు సంబంధించిన పిటిషన్లపై విచారణను మొదలుపెట్టింది.

ఆస్పత్రిలో చేరిన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్(70) సోమవారం సాయంత్రం హఠాత్తుగా చెన్నై గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో చేరారని, మంగళవారం సీఎం స్టాలిన్ డిశ్చార్జి అవుతారని ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కె.వెంకటాచలం హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఎం స్టాలిన్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఆయన అపోలో ఆసుపత్రి చేరినట్టు బులిటెన్ విడుదల కావడంపై డీఎంకే వర్గాల్లో ఆందోళన కలిగించింది. ఆసుపత్రి పరిసరాలలో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు.

ఎత్తులు పై ఎత్తులు



ఫడ్నవిస్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న అజిత్ పవార్. చిత్రంలో ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బల్, సునీల్ తత్కారే

రసకందాయంలో ఎన్సీపీ రగడ

- పార్టీపై పట్టుకోసం ఇరు వర్గాల యత్నాలు
- అజిత్ ఎమ్మెల్యేలపై వేటేయండి
- స్పీకర్‌కు పవార్ వర్గం ఫిర్యాదు
- కీలక నేతల బహిష్కరణ

ముంబై/సతారా: మహారాష్ట్ర రాజకీయ పరిణామాలు తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)పై ఆధిపత్యం కోసం అజిత్ పవార్ వర్గం, శరద్ పవార్ వర్గం ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. అజిత్ వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని శరద్ పవార్ వర్గం, శరద్ వర్గం ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని అజిత్ వర్గం పట్టుబడుతున్నాయి. శరద్ వర్గం నాయకులను పార్టీ పదవుల నుంచి అజిత్ వర్గం తొలగించింది. అసెంబ్లీలో ఎన్సీపీ పక్షనేతగా అజిత్ పవార్ నియమితులైనట్లు ఆయన వర్గం చెబుతోంది. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన అజిత్ పవార్‌తోపాటు మంత్రులుగా ప్రమాణం చేసిన 8 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఎన్సీపీ అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌కు ఫిర్యాదు చేసింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం 9 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా తేల్చడానికి తగిన ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. శరద్ పవార్ వర్గం నేత జితేంద్ర అవద్ ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఈ మేరకు స్పీకర్‌కు విజ్ఞాపన అందించారు. ఇదిలా ఉండగా, అజిత్ పవార్‌తో సహా 9 మంది ఎమ్మెల్యేలకు శరద్ పవార్ వర్గం సోమవారం నోటీసులు జారీ చేసింది. ఎన్సీపీతో వారికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. ఇక ఏ వేదికపైనా ఎన్సీపీ ప్రతినిధులుగా చెప్పుకోవద్దని వారికి తేల్చిచెప్పింది. పార్టీని ధిక్కరించి బయటకు వెళ్లిపోయిన వారు పార్టీ నేతలమని చెప్పుకోవడం చట్టవ్యతిరేకం అవుతుందని ఎన్సీపీ మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ స్పష్టం చేశారు. 9 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేయడానికి వీలుగా ఎన్సీపీ క్రమశిక్షణా కమిటీ ఇప్పటికే ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఎన్సీపీ ఫిర్యాదు తగిన నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ చెప్పారు. పవార్‌కు ఎంతమంది ఎమ్మెల్యేలు మద్దతిస్తున్నదీ తనకు తెలియదన్నారు.

అజిత్ తిరుగుబాటు వెనుక నా ప్రమేయం లేదు: పవార్

తన ఆశీస్సులతోనే అజిత్ పవార్ తిరుగుబాటు చేశారంటూ వినిపిస్తున్న వాదనలను ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ ఖండించారు. బీజేపీ-శివసేన ప్రభుత్వంలో అజిత్ చేరడం వెనుక తన ప్రమేయం ఎంతమాత్రం లేదన్నారు. ఆయన సోమవారం సతారా జిల్లాలో మీడియాతో మాట్లాడారు. ఎన్సీపీ బలోపేతం కోసం ప్రజల్లోకి వెళ్తానని, రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తానని తెలిపారు.

పటేల్, తత్కారే బహిష్కరణ

కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్, లోక్‌సభ సభ్యుడు సునీల్ తత్కారేను ఎన్సీపీ అధినేత శరద్ పవార్ సోమవారం తమ పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు వారిపై ఈ మేరకు చర్య తీసుకున్నట్లు ట్విట్టర్‌లో వెల్లడించారు. ఇక మహారాష్ట్ర ఎన్సీపీ అధ్యక్షుడిగా లోక్‌సభ సభ్యుడు సునీల్ తత్కారేను నియమించినట్లు ప్రఫుల్ పటేల్ ప్రకటించారు. అసెంబ్లీలో ఎన్సీపీ పక్ష నేతగా అజిత్ వ్యవహరిస్తారని అన్నారు. గరిష్ట సంఖ్యలో ఎన్సీపీ ఎమ్మెల్యేల మద్దతు ఉందని అజిత్ అన్నారు.

అజిత్ కు బీజేపీ సీఎం పదవి ఎర: కాంగ్రెస్

అజిత్‌కు సీఎం పదవి కట్టబెడతామని బీజేపీ హామీ ఇచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది. ''బీజేపీ-శివసేన ప్రభుత్వంలో అజిత్ చేరుతారని ఎప్పుడో తెలుసు. 16 మంది సేన(షిండే) ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించి షిండేను సీఎం పదవి నుంచి దింపేస్తారు. అజిత్‌ను కూచోబెడతారు'' అని కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ అన్నారు. శివసేన (ఉద్ధవ్) పత్రిక 'సామ్నా' సంపాదకీయంలోనూ ఇదే విషయం రాసింది.

సుప్రీంకోర్టులో ఉచిత వైఫై సేవలు



డిజిటల్ సౌకర్యాలతో సిద్ధమైన సుప్రీంకోర్టు రూమ్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు డిజిటైజేషన్ దిశగా మరో కీలక అడుగు పడింది. అత్యున్నత న్యాయస్థానంలోని మొదటి అయిదు కోర్టు రూముల్లో వైఫై సేవలను అందుబాటులో తెచ్చినట్లు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం ప్రకటించారు. లాయర్లు, కక్షిదారులు, మీడియా వ్యక్తులు, ఇతర సందర్శకులకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఇనిషియేటివ్‌లో భాగంగా తీసుకువచ్చిన ఈ వెసులుబాటును "SCI WiFi" లాగిన్ చేయడం ద్వారా ఉపయోగించుకోవచ్చునన్నారు. 'అన్ని కోర్టు రూములు ఇకపై పుస్తకాలు, పేపర్లు కనిపించవు. అయితే దీనర్థం, పుస్తకాలు, కాగితాలపై అస్సలు ఆధారపడబోమని కాదు' అని సీజేఐ పేర్కొన్నారు. కాగా, వేసవి సెలవుల అనంతరం సోమవారం సుప్రీంకోర్టు తిరిగి పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభించింది.

పార్టీల ఆర్థిక నివేదికల దాఖలుకు ఈసీ ఆన్‌లైన్ పోర్టల్


సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గుర్తింపుపొందిన అన్ని రాజకీయ పార్టీలు ఆర్థిక నివేదికలను దాఖలు చేసేందుకు వీలుగా ప్రత్యేక పోర్టల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చింది. రాజకీయ పార్టీల ఆర్థిక ఖర్చులు, నిధులలో మరింత పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని వెల్లడించింది. అన్ని రాజకీయ పార్టీలు తమ ఆర్థిక ఖాతాలను ఇకపై htt pr.//iemr.eci.gov.in అనే వెబ్ పోర్టల్‌లో పొందుపరచాలని ఈసీ ప్రకటించింది. భౌతికంగా ఆర్థిక నివేదికలను దాఖలు చేయడంలోని ఇబ్బందులను అధిగమించడం, ప్రామాణిక పద్ధతిలో వాటిని సకాలంలో దాఖలు చేయడం లక్ష్యంగా ఈ పోర్టల్‌ను తెచ్చినట్లు రాజకీయ పార్టీలకు రాసిన లేఖలో ఎన్నికల సంఘం పేర్కొంది. రాజకీయ పార్టీల కంట్రిబ్యూషన్ రిపోర్ట్, ఆడిట్ చేయబడిన వార్షిక ఖాతా, ఎన్నికల వ్యయ ప్రకటనలను ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు ఈ పోర్టల్ దోహద పడుతుందని పేర్కొంది.

సిసోడియా బెయిల్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయిన ఆప్ నేత మనీష్ సిసోడియాకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. ఈ కేసులో మార్చి 9వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. బెయిల్ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ విచారణ జరిపారు. సిసోడియా తీవ్ర ఆరోపణలను ఎదుర్కొంటున్నారని చెప్పారు.

హరియాణాలో అవివాహిత పింఛన్!

చండీగఢ్: హరియాణాలో అవివాహిత మహిళలు, పురుషులకు నెలవారీ పింఛన్ ఇవ్వాలని యోచిస్తున్నట్లు సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ వెల్లడించారు. 45 ఏళ్ల పైబడిన వారికి ఉద్దేశించిన ఈ పథకం విధి విధానాలను నెల రోజుల్లో ఖరారు చేస్తామన్నారు. కర్నాల్ జిల్లా కలంపురం గ్రామంలో సోమవారం జరిగిన జన్ సంవాద్ కార్యక్రమంలో ఓ 60 ఏళ్ల వ్యక్తి చేసిన పింఛను సంబంధిత ఫిర్యాదుపై సీఎం ఖట్టర్ ఈ మేరకు ప్రకటన చేశారు.



బ్రిటన్‌లోని వైట్లీబే పట్టణ సమీపంలోని సెయింట్ మేరీస్ దీపస్తంభం వద్ద దేదీప్యమానంగా వెలిగిపోతున్న సూపర్‌మూన్ చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతూ కాస్త దగ్గరిగా వచ్చినపుడు ఇలా సూపర్‌మూన్‌లా దర్శనమిస్తాడు. సాధారణ రోజులతో పోలిస్తే ఈ సమయంలో 5.8 శాతం పెద్దదిగా, 12.8 శాతం మరింత ప్రకాశవంతంగా చంద్రుడు కనిపిస్తాడు.

ప్రజల వద్దకు అభివృద్ధి పనులు


కేబినెట్ భేటీలో మంత్రులతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: గత తొమ్మిదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ప్రధాని మోదీ చెప్పారు. వచ్చే తొమ్మిది నెలల కాలంలో ఈ పనుల గురించి ప్రజలకు వివరించాలని మంత్రివర్గ సహచరులను ఆయన కోరారు. సోమవారం రాత్రి ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో మోదీ అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ప్రధానిమాట్లాడారు. 2047లో వందో స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే నాటికి మౌలిక వసతులు మొదలుకొని బడ్జెట్ పరిమాణం వరకు ప్రగతి ప్రయాణాన్ని వివరించే పవర్ ప్రజెంటేషన్ కూడా జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇప్పటి నుంచి 2047వ సంవత్సరం వరకు స్వర్ణయుగం, అమృత్ కాల్‌గా ప్రధాని మోదీ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించిన ప్రధాని, అదే సమయంలో దేశం సాధించిన ప్రగతిని ప్రశంసించారు. విదేశాంగ, రక్షణ సహా పలు మంత్రిత్వ శాఖలకు చెందిన కార్యదర్శులు కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా, ఈజిప్టు దేశాల్లో పర్యటనల సందర్భంగా సాధించిన విజయాలను వారు వివరించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సుమారు నాలుగు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో బడ్జెట్ కేటాయింపులను సరిగ్గా వినియోగించుకోవడమెలాగనే అంశంపైనా చర్చించారు. అనంతరం ప్రధాని మోదీ ట్విట్టర్‌లో..'కేబినెట్ సమావేశం ఫలప్రదంగా సాగింది. వివిధ విధివిధానాలపై అభిప్రాయాలను పంచుకున్నాం' అని పేర్కొన్నారు. త్వరలో పార్లమెంట్ సమావేశాలు జరగనుండటం, ఇటీవల బీజేపీ అగ్ర నాయకత్వం వరుస సమావేశాలు జరుపుతున్న నేపథ్యంలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై కేబినెట్ భేటీ చర్చిస్తుందన్న వార్తలు గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున ప్రచారమవుతున్న విషయం తెలిసిందే.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 4 । జూలై । 2023

ఈ-క్రిమినల్స్ కేరాఫ్ ఢిల్లీ!



దేశ రాజధాని ఢిల్లీ సైబర్ నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఆర్థికాంశాలతో ముడిపడిన ఈ నేరాలు చేస్తూ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కిన అంతర్ రాష్ట్రీయుల్లో ఈ నగరానికి చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. -8లో



డబ్బులు డబుల్ చేస్తానని...

డబ్బులను డబుల్ చేస్తానని నమ్మించి నకిలీ నోట్లు అంటగట్టి మోసాలకు పాల్పడుతున్న ఐవరీ కోస్ట్ దేశస్తుడిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. రూ.10 లక్షల నకిలీ ఇండియన్ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. -8లో

సెల్ట్‌లో ఇంగ్లిష్ సర్టిఫికెట్ కోర్సు

లాలాపేట: ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రెయినింగ్(సెల్ట్)సెంటర్‌లో ఈ నెల 12 నుంచి ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు సెల్ట్ డైరెక్టర్ డా.సవీన్ సౌద ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 11 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పూర్తి వివరాలకు 7989903001 నెంబర్‌లో సంప్రదించాలి.

న్యూస్‌రీల్

హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో వంద శాతం గ్రీన్ ఎనర్జీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విద్యుత్ వినియోగాన్ని చాలా వరకు తగ్గించనున్నట్లు అధికారులు తెలిపారు. వంద శాతం గ్రీన్ ఎనర్జీ వినియోగం దిశగా ఎయిర్‌పోర్టులో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. టీఎస్‌పీడీసీఎల్ భాగస్వామ్యంతో 10 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తెచ్చారు. హరిత విద్యుత్ వినియోగం ద్వారా విమానాశ్రయంలో ప్రతి సంవత్సరం 9300 టన్నుల వరకు కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు అవకాశం లభించిందన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఐఎల్ సీఈఓ ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టును పూర్తిగా పర్యావరణహితంగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. హైదరాబాద్ విమానాశ్రయం ఇప్పుడు 100 శాతం పునరుత్పాదక శక్తితో పనిచేస్తుందన్నారు. అనేక సంవత్సరాలుగా చేపట్టిన చర్యల వల్ల కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించినట్లు పేర్కొన్నారు. సుమారు 675 ఎకరాల సువిశాల భూభాగాన్ని కలిగిన ఎయిర్‌పోర్టు సహజ కర్బన ఉద్గారాల సింక్‌గా పనిచేస్తుందని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని సందర్శించిన ఏపీ మంత్రి

ఖైరతాబాద్: సాగర తీరంలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏపీ మంత్రి నాగార్జున, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి, ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఇతర దళిత నాయకులు సోమవారం సందర్శించారు. సీఎం కేసీఆర్ ఎంతో ఉన్నతమైన ఆలోచనతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మంత్రి నాగార్జున అన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగుతోందని, ఇక్కడ అంబేడ్కర్ విగ్రహం ఎలా ఉంది, ఎలా అభివృద్ధి చేశారు అనే విషయాలను అధ్యయనం చేశామని తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహ ఆవరణలోని మ్యూజియం, థియేటర్‌లను మంత్రి పరిశీలించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ధర్నా

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో పేదలైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్‌చేస్తూ వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట భారీయెత్తున ధర్నా నిర్వహించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దాదాపు పది లక్షల దరఖాస్తులందగా, అధికారులు వాటిని ఇంతవరకు స్క్రూటినీ చేయలేదని ఆరోపించారు. ఒకవేళ స్క్రూటినీ చేస్తే అర్హులైన వారు ఎందరు ఉన్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిర్మాణమైన ఇళ్లను బస్తీవాసులకు వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల జిమ్మిక్కుగా వందల ఇళ్లు మాత్రం పంచి వేలాదిమంది లబ్ధిదారులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీని వెంటనే చేపట్టకపోతే పెద్ద యెత్తున ఉద్యమాలు చేస్తామని ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ , తదితర ప్రజాసంఘాల నేతలు హెచ్చరించారు. గృహలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ. 3 లక్షల రాయితీని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

సాగర్‌లో సెయిలింగ్ సందడి

నేటి నుంచి వారం రోజుల పాటు పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హుస్సేన్ సాగర్ వేదికగా 'హైదరాబాద్ సెయిలింగ్ వీక్' పేరుతో ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నేషనల్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ సెయిలింగ్ పోటీలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలను ఇఎమ్ఇ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, లేసర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం హుస్సేన్ సాగర్ ఇఎమ్ఇ సెయిలింగ్ క్లబ్ వేదికగా 'హైదరాబాద్ సెయిలింగ్ వీక్' పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్, ఎమ్‌సీఈఎమ్ఈ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, వైస్ కమోడోర్ ఈఎమ్ఈ సెయిలింగ్ అసోసియేషన్, మేజర్ జనరల్ అజయ్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని వివరాలను ప్రకటించారు. ఈ సెయిలింగ్ రేస్‌లో దేశవ్యాప్తంగా వంద మంది వరకు జాతీయ, అంతర్జాతీయ సెయిలర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. జూలై 9వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని, చివరి రోజున విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నామని, గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చి ర్యాంకింగ్స్‌లో ఎక్కువ పాయింట్లు సాధించిన సెయిలర్స్‌ను త్వరలో జరగబోయే ఏసియన్ గేమ్స్‌కు ఎంపిక చేయనున్నామని, దీని కోసం ప్రత్యేక జ్యూరీని నియమించామని అన్నారు.



దిల్‌సుఖ్‌నగర్‌లో..





పంజగుట్టలో..

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి

నగరవ్యాప్తంగా సోమవారం గురుపౌర్ణమి వేడుకల్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా సాయిబాబా ఆలయాలన్నీ ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో కిటకిటలాడాయి. దిల్‌సుఖ్‌నగర్, పంజగుట్టలోని ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తగా...ఆలయాల నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఎన్నికల బదిలీలు

- బల్దియాలో నలుగురు జడ్‌సీల బదిలీ
- ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్‌గా శంకరయ్య



సాక్షి, సిటీబ్యూరో: రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి జీహెచ్ఎంసీలో బదిలీలు జరుగుతున్నాయి. కమిషనర్ లోకేశ్‌కుమార్‌ను కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర అడిషనల్ సీఈఓగా ఇప్పటికే బదిలీ చేయడం తెలిసిందే. తాజాగా జీహెచ్ఎంసీలోని నలుగురు జోనల్ కమిషనర్ల(జడ్‌సీ)ను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ మేరకు మునిసిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

ఎవరెవరు.. ఎక్కడెక్కడ..

- సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాస్‌రెడ్డిని నగరంలోనే ఎంతో కీలకమైన, ఐటీతో పాటు వివిధ సంస్థలు కొలువుదీరిన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా ఉన్న మునిసిపల్ పరిపాలన శాఖ అడిషనల్ డైరెక్టర్ జె.శంకరయ్యను జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.
- ప్రస్తుతం ఆ పోస్టులో ఉన్న ఎస్.పంకజను ఆ పోస్టు నుంచి రిలీవ్ చేశారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న అడిషనల్ డైరెక్టర్ ఎస్.రవికిరణ్‌ను శ్రీనివాస్‌రెడ్డి స్థానంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా నియమించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా కూడా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు.
- చార్మినార్ జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.అశోక్ సామ్రాట్‌ను సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న టి.వెంకన్నను చార్మినార్ జోనల్ కమిషనర్‌గా నియమించారు.
- సీడీఎంఏలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆర్.ఉపేందర్‌రెడ్డిని జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. ఆ విభాగం అడిషనల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వి.మమతను అక్కడినుంచి రిలీవ్ చేశారు. చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.సుధాంశ్‌కు శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్‌గా కూడా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు.

మహిళా జడ్‌సీలకు మినహాయింపు..

ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ఎస్.పంకజ, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమతకు ఈ బదిలీల్లో మినహాయింపు నిచ్చారు. వారిని ఎక్కడికీ బదిలీ చేయకపోవడమే కాక వారికి అదనంగా ఉన్న పోస్టుల్లో ఇతరులను నియమించారు. ఇక వారు జోన్లపైనే పూర్తిస్థాయి శ్రద్ధతో పనిచేసే అవకాశం ఉంటుంది. గత బదిలీల సందర్భంగా వీరిద్దరూ తాము బదిలీ అయిన స్థానాలను పరస్పరం మార్చుకోవడం తెలిసిందే. జడ్‌సీల బదిలీల్లో పైరవీలు పనిచేశాయనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇక త్వరలోనే డిప్యూటీ కమిషనర్ల బదిలీలు కూడా జరగనున్నట్లు సమాచారం.



హెచ్‌సీఏ క్రికెట్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న పునర్ నిర్మాణ పనులు

ఆటలు సాగవ్

స్థలం కబ్జా చేశారంటూ హెచ్‌సీఏకు కంటోన్మెంట్ నోటీసులు

- గతంలోనే హెచ్‌సీఏ లీజు రద్దు
- కోర్టు కేసులతో నెట్టుకొస్తున్న వైనం
- తాజాగా కేసులో ఇంప్లీడ్ అయిన బోర్డు
- పీపీఈ నోటీసులతో స్థలం స్వాధీనానికి రంగం సిద్ధం

కంటోన్మెంట్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఆధీనంలోకి తీసుకున్న స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు కంటోన్మెంట్ బోర్డు రంగం సిద్ధం చేసుకుంది. ఓ వైపు వివాదం సాగుతున్న కేసులో ఇంప్లీడ్ అవుతూనే, ది పబ్లిక్ ప్రెమిసెస్ (ఎవిక్షన్ ఆఫ్ అనాథరైజ్డ్ ఆక్యుపెంట్స్)–1971 కింద నోటీసు జారీ చేసింది. దీంతో ఇంతకాలం హెచ్‌సీఏ ఆధీనంలో ఉన్న పదెకరాల స్థలం కంటోన్మెంట్ బోర్డు ఆధీనంలోకి రానుంది. దీంతో జింఖానా కేంద్రంగా సాగుతున్న హెచ్‌సీఏ కార్యకలాపాలకు త్వరలోనే బ్రేక్ పడనుంది.

అసలేం జరిగిందంటే..

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సమీపంలో 23.65 ఎకరాల జింఖానా మైదానం, 37.565 ఎకరాల బైసన్ పోలో మైదానాలు ఆర్మీ ఆధీనంలో ఉన్నాయి. వీటిలో బైసన్ పోలో మైదానాన్ని ఎన్‌సీసీ ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తూ ఉండగా, జింఖానా గ్రౌండ్స్‌లోని కొంత స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించారు. 30 ఏళ్ల క్రితం ఐదెకరాల స్థలాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు లీజుకు ఇచ్చారు. అయితే 1998లో ఈ రెండు మైదానాలు ఆర్మీ ఆధీనంలో నుంచి, కంటోన్మెంట్ బోర్డు స్థలాలు (సీ కేటగిరి)గా మార్చారు. దీంతో ఈ స్థలంపై యాజమాన్య హక్కులు పూర్తిగా కంటోన్మెంట్‌కు దక్కాయి. ఈ నేపథ్యంలో అప్పటికే డిఫెన్స్ ఎస్టేట్స్ అధికారులు హెచ్‌సీఏకు ఇచ్చిన లీజును రద్దు చేస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. ఇదిలా ఉండగానే 2010లో అప్పటి సికింద్రాబాద్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్ తన అధికార పరిధిని అధిగమించి, హెచ్‌సీఏతో మరో లీజు ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న రక్షణ శాఖ ఉన్నతాధికారులు సదరు లీజు చెల్లదంటూ మరోసారి నోటీసులు జారీ చేసి, సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఏసీ కబ్జాలో ఉన్న స్థలం స్వాధీనానికి రక్షణ శాఖ అధికారులు ప్రయత్నిస్తుండగా, హెచ్‌సీఏ అధికారులు హైకోర్టును ఆశ్రయించడంతో స్టే ఉత్తర్వులు వచ్చాయి. నాటి నుంచి హెచ్‌సీఏ తాము లీజు తీసుకున్న 5 ఎకరాలతో పాటు మొత్తం 15.3 ఎకరాల స్థలాన్ని తమ కబ్జాలోకి తీసుకుంది.

బోర్డు వాదనలేంటి?

తమ ఆధీనంలోని 15 ఎకరాల స్థలాన్ని డిఫెన్స్ ఎస్టేట్స్ అధికారులు హెచ్‌సీఏకు ఎలా లీజుకు ఇస్తారంటూ బోర్డు అధికారులు వాదిస్తున్నారు. హెచ్‌సీఏ కేవలం ఐదెకరాల స్థలం లీజుకు తీసుకుని, 15 ఎకరాలుగా కోర్టును తప్పుదోవ పట్టించిందంటున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ లీజును రద్దు చేయడంతో పాటు, తమ స్థలాన్ని తిరిగి అప్పగించాలంటూ వాదిస్తున్నారు. ఈ స్థలం స్వాధీనం కోసం ఓ పక్క కోర్టులో వాదిస్తూనే, తమ స్థలాన్ని హెచ్‌సీఏ కబ్జా చేసిందంటూ 'పీపీఈ- యాక్ట్' కింద నోటీసు జారీ చేశారు. పీపీఈ యాక్ట్ కింద జారీ చేసిన నోటీసులకు అనుగుణంగా ఈ నెల 14న సీఈఓ ఎదుట హాజరు కావాల్సి ఉంటుంది. సరైన పత్రాలు సమర్పించక పోతే తక్షణమే సదరు స్థలాన్ని కంటోన్మెంట్ బోర్డు తమ ఆధీనంలోకి తీసుకునే అవకాశం ఉంది.

భూ బదలాయింపు ప్రతిపాదనతో...

హైకోర్టు స్టే ఆర్డర్‌కు తోడు, రక్షణ శాఖ, కంటోన్మెంట్ బోర్డు అధికారుల ఉదాసీనత కారణంగా విలువైన రక్షణ స్థలం హెచ్‌సీఏ కబ్జాలోనే ఉంది. 2016లో సీఎం కేసీఆర్ సచివాలయ నిర్మాణం కోసం బైసన్ పోలో, జింఖానా మైదానాలను తమకు అప్పగించాలని కోరుతూ కేంద్రానికి విన్నవించారు. వీటితో పాటు ఆయా మైదానాల ఉత్తర ముఖం అయిన ప్యాట్నీ నుంచి హకీంపేట వరకు, ప్యారడైజ్ నుంచి సుచిత్ర వరకు స్కైవేల నిర్మాణానికి స్థలాలు ఇవ్వాలంటూ కోరింది. ఈ ప్రతిపాదనకు సూత్రప్రాయ అంగీకారం తెలిపిన కేంద్రం మొత్తం 151.726 ఎకరాల స్థలాల అప్పగింతకు సంబంధించి భాగస్వామ్య పక్షాలతో కమిటీ వేసి, జాయింట్ సర్వే ప్రారంభించింది. ఈ సందర్భంగా హెచ్‌సీఏ ఆధీనంలో స్థలం విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. దీంతో డిఫెన్స్ ఎస్టేట్స్ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సెక్రటేరియెట్ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవడంతో ఈ అంశం మళ్లీ మరుగున పడింది. తాజాగా ప్రతిపాదిత స్కై వేలకు స్థలం అప్పగింత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో మూడు నెలల క్రితం కంటోన్మెంట్ బోర్డును సందర్శించిన రక్షణ శాఖ ఉన్నతాధికారులు, హెచ్‌సీఏ నుంచి స్థలం స్వాధీనానికి చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు డిఫెన్స్ ఎస్టేట్స్ కార్యాలయం, హెచ్‌సీఏ మధ్య వివాదంలో ఉన్న కోర్టు కేసులో కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఇంప్లీడ్ అయ్యారు.



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యాలయం

ఔటర్ సూపర్‌గా..



ఐటీ కారిడార్‌లో ఇక ఈజీ జర్నీ

- సర్వీసు రోడ్లు నాలుగులైన్‌లకు విస్తరణ
- మరో రెండు చోట్ల ఇంటర్‌చేంజ్‌లు
- అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేసిన సైకిల్ ట్రాక్
- ఐటీ సంస్థల విస్తరణకు అనుగుణంగా సదుపాయాల మెరుగు

సాక్షి, సిటీబ్యూరో: ఐటీ కారిడార్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు ఆధునిక హంగులను సంతరించుకుంటోంది. ఔటర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఐటీ, కార్పొరేట్ సంస్థలు శరవేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ఇందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఔటర్ మీదుగా ఐటీ కారిడార్‌లలోకి ప్రవేశించేందుకు ఇప్పటికే నార్సింగ్ వద్ద కొత్తగా ఒక ఇంటర్‌చేంజ్‌ను ఏర్పాటు చేయగా, ఐటీ సంస్థలు, ఉద్యోగుల రాకపోకల కోసం మరో రెండు చోట్ల ఇంటర్‌చేంజ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ. 29.50 కోట్లతో చేపట్టిన నార్సింగ్ ఇంటర్‌చేంజ్‌ను ఇటీవల మంత్రి కేటీఆర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇది వినియోగంలోకి రావడంతో వాహనాల రాకపోకలు కూడా గణనీయంగా పెరిగినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ ఇంటర్‌చేంజ్ నుంచి నార్సింగి, మంచిరేవుల, గండిపేట్ ప్రాంతాలతో పాటు లంగర్ హౌస్, శంకర్‌పల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే కోకాపేట్, మల్లంపేట్‌లో ఇంటర్‌చేంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఔటర్ మీదుగా కోకాపేట్‌కు చేరుకోవడం ఎంతో సులువవుతుంది. ఈ రెండు చోట్ల వినియోగంలోకి వస్తే 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో మొత్తం 22 ఇంటర్‌చేంజ్‌లు ఉంటాయి.



నార్సింగి ఇంటర్‌చేంజ్

సర్వీస్‌రోడ్ల విస్తరణ...

- మరోవైపు ఐటీకారిడార్‌లకు ఈజీగా రాకపోకలు సాగించేందుకు హెచ్ఎండీఏ పెద్ద ఎత్తున సర్వీస్‌రోడ్ల విస్తరణ చేపట్టింది.
- సుమారు 24 కిలోమీటర్ల మార్గంలో రెండు లైన్లు ఉన్న సర్వీస్ రోడ్లను 4 లైన్‌లకు విస్తరిస్తున్నారు. త్వరలోనే అదనపు రోడ్లు అందుబాటులోకి రానున్నాయి.
- హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) సర్వీస్ రోడ్ల విస్తరణ చేపట్టింది. నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, నార్సింగి నుంచి కొల్లూరు వరకు 24 కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న రెండు లైన్‌ల రోడ్లను నాలుగు లైన్‌లకు పెంచుతున్నారు. సుమారు రూ.380 కోట్లతో ఈ పనులు కొనసాగుతున్నాయి.

ఆగస్టు 15న సైకిల్ ట్రాక్ ప్రారంభం

అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన సైకిల్ ట్రాక్ ఆగస్టు 15వ తేదీ కానుకగా అందుబాటులోకి రానుంది. సుమారు రూ.100 కోట్ల అంచనాలతో నానక్‌రామ్‌గూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.5 కిలోమీటర్లు, కొల్లూరు నుంచి నార్సింగి వరకు 14.5 కిలోమీటర్ల మార్గంలో సైకిల్ ట్రాక్‌ను సిద్ధం చేశారు. ఇది 5.3 మీటర్ల వెడల్పుతో, మూడు లైన్‌లలో ఉంటుంది. 'ఐటీ ఉద్యోగులే కాకుండా అన్ని వర్గాల ప్రజలు ఈ ట్రాక్‌ను వినియోగించుకోవచ్చు. అద్దె సైకిళ్లు లభిస్తాయి. ట్రాక్ పొడవునా రెస్టారెంట్లు, కెఫెటేరియాలు, బ్రేక్‌ఫాస్ట్ సెంటర్‌లు కూడా ఉంటాయి'. అని ఒక అధికారి వివరించారు. అలాగే సైకిళ్లకు పంక్చర్‌లయినా, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మరమ్మతులు చేస్తారని చెప్పారు. ప్రథమ చికిత్స కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాలతో నిఘా ఉంటుంది. ట్రాక్‌పై కప్పు కోసం ఏర్పాటు చేసిన సౌరఫలకల వల్ల 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది,



సైకిల్ ట్రాక్

నేడు రాష్ట్రపతి రాక..

గచ్చిబౌలిలో ట్రాఫిక్ ఆంక్షలు

అల్లూరి సీతారామరాజు 125 జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు మంగళవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్నారు. ఈ నేపథ్యంలో గచ్చిబౌలి స్టేడియం పరిధిలోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ్‌నాయక్ సోమవారం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వరకు, విప్రో సర్కిల్ నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు, గచ్చిబౌలి కూడలి నుంచి స్టేడియం వరకు ఉన్న రోడ్లపై ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని, ఇందుకోసం వాహనదారులంతా ప్రత్యామ్నాయ మార్గాలలో రాకపోకలు సాగించాలని ఆయన సూచించారు. పోలీసులకు వాహనదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

–గచ్చిబౌలి





గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో అల్లూరి జయంతి సభ ఏర్పాట్లు

హైటెక్స్‌లో ఆగస్టు 4 నుంచి అంతర్జాతీయ ప్లాస్టిక్ ఎక్స్‌పో

నాంపల్లి: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్లాస్టిక్ తయారీదారుల సంఘం (టాప్మా) ఆధ్వర్యంలో ఆగస్టు 4 నుంచి 7 వరకు నాలుగు రోజుల పాటు హైటెక్స్‌లో హైప్లెక్స్ అంతర్జాతీ ప్లాస్టిక్ ఎక్స్‌పో-2023 నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు విమలేష్ గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన లో సుమారు రూ.500 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎక్స్‌పో వివరాలు వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల్లో అతి పెద్ద ఎక్స్‌పో అన్నారు. రెండు వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ప్రదర్శనలో సుమారు 500 మంది ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. స్పెషాలిటీ కెమికల్స్, మాస్టర్ బ్యాచ్‌లు,



సమావేశంలో మాట్లాడుతున్న విమలేష్ గుప్తా

ప్రాసెస్ మెషినరీ, ప్రింటింగ్, ప్యాకేజింగ్, రా మెటీరియల్స్(ముడిసరుకులు) మోల్డ్ అండ్ డై, ఫినిష్డ్ ప్రొడక్ట్‌లు ప్రదర్శనలో ఉంటాయన్నారు. హైప్లెక్స్ చైర్మన్ బీఎల్ భండారి మాట్లాడుతూ... ప్లాస్టిక్ పరిశ్రమ ఎన్నో సవాళ్లు, ప్రతికూల సమస్యలు ఉత్పన్నం అవుతున్నప్పటికి దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. బయో ప్లాస్టిక్స్, 3డీ ప్రింటింగ్, ఉత్పత్తి, వినియోగ నమూనా, లీజుకు ఇవ్వడం, వృద్ధి, ఆవిష్కరణలకు కొత్త అవకాశాలను సృష్టించడం ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమన్నారు. 23 ముడి పదార్థాల తయారీలో ఉపయోగించిన అత్యాధునిక సాంకేతికత కలిగిన యంత్రాలను, ప్లాస్టిక్, పెట్రో కెమికల్స్‌తో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు హైప్లెక్స్ షో మాజీ అధ్యక్షుడు వెన్నం అనిల్ రెడ్డి తెలిపారు. దాదాపు యాభై వేల మంది సందర్శకులు ఈ ప్రదర్శనను సందర్శించే అవకాశం ఉందన్నారు. 1969లో ఏర్పాటైన ఈ వ్యాపార సంస్థ 12,500 మంది సభ్యులను కలిగి ఉందన్నారు. ఎఫ్‌టిసిసిఐ ఎక్సలెన్స్ అవార్డును కేటీఆర్ చేతుల మీదుగా అందుకోబోతున్నట్లు వారు వివరించారు.

ఈ-క్రిమినల్స్ కేరాఫ్ ఢిల్లీ!

- ఆర్థిక సైబర్ నేరగాళ్లలో అత్యధికులు అక్కడి వారే
- గతేడాది 52 మందిని అరెస్టు చేసిన సిటీ సైబర్ కాప్స్
- స్థానికుల్లో అత్యధికం అశ్లీల కేసులకు సంబంధించిన వారే
- 2022లో మొత్తం 318 మందిపై చర్యలు తీసుకున్న పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: దేశ రాజధాని ఢిల్లీ సైబర్ నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఆర్థికాంశాలతో ముడిపడిన ఈ నేరాలు చేస్తూ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కిన అంతర్ రాష్ట్రీయుల్లో ఈ నగరానికి చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. గతేడాది సిటీ సైబర్ కాప్స్ అరెస్టు చేసిన బయటి రాష్ట్రాల వారిలో ఢిల్లీకి చెందిన వారే ఎక్కువ మంది కాగా.. మొత్తం అరెస్టుల్లో వీరి శాతం 23గా నమోదైంది. 2022లో నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) ఆధీనంలోని సైబర్ క్రైమ్ పోలీసులు మొత్తం 318 మందిపై చర్యలు తీసుకున్నారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు 33 మంది ఉండగా... మిగిలిన వారిలో ఢిల్లీకి చెందిన వారే 52 మంది ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితులను అరెస్టు చేసేందుకు 16 రాష్ట్రాల్లో ఆపరేషన్లు చేపట్టారు. మొత్తం మీద 224 మందిని అరెస్టు చేయగా.. 94 మందికి సీఆర్పీసీ 41 ఏ నోటీసులు ఇచ్చారు.

ప్రధానంగా రెండు రకాలు...

సైబర్ నేరాలను అధికారులు ప్రధానంగా రెండు రకాలుగా విభజిస్తారు. వివిధ రూపాల్లో బాధితుల నుంచి నగదు కాజేసే ఆర్థిక సంబంధమైనవి ఒక టైతే.. ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాలను వినియోగించి ఎదుటి వారిని ఇబ్బంది పెట్టేవి మరోరకం. వీటిలో బాధితులకు ఆర్థిక నష్టం లేనప్పటికీ అశ్లీలం, అభ్యంతరకర అంశాలు ముడిపడి ఉంటాయి. సైబర్ నేరాలకు సంబంధించి అరెస్టవుతున్న స్థానికుల్లో (తెలంగాణ, ఏపీ వాసులు) దాదాపు 99 శాతం ఈ కోవకు చెందిన నేరాలు చేసిన వారై ఉంటున్నారు. వ్యక్తిగత కక్ష, ప్రతీకారం, అసూయల నేపథ్యంలో ఎదుటి వారి ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కంప్యూటర్, సెల్‌ఫోన్లను వినియోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఇలా సైబర్ క్రైమ్ పోలీసులకు పట్టుబడుతున్న వారిలో ఎక్కువే మంది విద్యాధికులే కావడం గమనార్హం. కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం ఈ తరహా కేసుల్లో అరెస్టయ్యారు.

అందినకాడికి అడ్డంగా దోచేసేది వారే...

సైబర్ నేరాల్లో రెండో రకమైన ఆర్థిక సంబంధ నేరాలు చేస్తున్న వారిలో వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఉంటున్నారు. 2022 జనవరి-డిసెంబర్ మధ్య సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన బయటి రాష్ట్రాల వారిలో ఢిల్లీ వాసులే ఎక్కువగా ఉన్నారు. ఇన్సూరెన్సులు, లాటరీలు, తక్కువ వడ్డీకి రుణాలు, వీసాల పేరు చెప్పి అందినకాడికి డబ్బు కాజేసే వారిలో ఢిల్లీకి చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారు. న్యూ ఢిల్లీతో పాటు నోయిడా, గుర్గావ్‌లతో పాటు ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఈ సైబర్ నేరగాళ్లు ప్రత్యేకంగా కాల్‌సెంటర్లు నిర్వహిస్తున్నారు. టెలీకాలర్లను ఏర్పాటు చేసుకుని, సెల్‌ఫోన్ నెంబర్ల డేటాబేస్ ఆధారంగా దేశ వ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్నారు. వర్క్ స్టేషన్లుగా పిలిచే రెడీ యూజ్ కాల్ సెంటర్లను కొన్ని నెలల పాటు వినియోగించే ఈ నేరగాళ్లు ఆపై వాటిని ఖాళీ చేసేస్తుంటారు. ఈ తరహా నేరాలు పాల్పడే నేరగాళ్లు ఢిల్లీతో పాటు మహారాష్ట్రలోని ముంబై, కర్ణాటకలోని బెంగళూరులతో పాటు గుజరాత్‌కు చెందిన వారూ ఉంటున్నారు.

సూత్రధారుల్లో నైజీరియన్లూ పెద్ద సంఖ్యలో...

ఇలాంటి నేరాల్లో సూత్రధారులుగా ఉంటున్న వారిలో నైజీరియన్లు పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. వీరితో పాటు సోమాలియా తదితర ఆఫ్రికన్ దేశాలకు చెందిన వారూ నిందితులుగా మారుతున్నారు. బిజినెస్, స్టడీ తదితర వీసాలపై భారత్‌కు వచ్చి ఢిల్లీ సహా ఆయా నగరాల్లో నివసిస్తున్న ఈ నల్లజాతీయులు తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం సైబర్ నేరాలుకు పాల్పడుతున్నారు. వీరికి అక్కడి స్థానికులు, ఇతర రాష్ట్రాలకు నుంచి ఆయా నగరాల్లో నివసిస్తున్న వారూ మనీమ్యూల్స్‌గా మారి సహకరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల బాధితుల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకోవడానికి అవసరమైన బ్యాంక్ ఖాతాలను అందిస్తూ, ప్రతిఫలంగా కమీషన్లు తీసుకునే వారిని సాంకేతికంగా మనీమ్యూల్స్ అంటారు. ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చి గుజరాత్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరుల్లో నివసిస్తున్న యువతను నైజీరియన్లు మనీమ్యూల్స్‌గా మార్చుకుంటున్నారు. అనేక కేసుల్లో మనీమ్యూల్స్‌గా ఉన్న వారు చిక్కుతున్నా.. సూత్రధారులు మాత్రం పరారీలో ఉంటున్నారు.

అరెస్టులు, నోటీసులు ఇలా...

రాష్ట్రం	అరెస్టు	నోటీసులు
తెలంగాణ	33	66
ఆంధ్రప్రదేశ్	20	03
ఢిల్లీ	52	15
ఉత్తరప్రదేశ్	23	02
మధ్యప్రదేశ్	03	00
మహారాష్ట్ర	09	04
కర్ణాటక	02	00
పశ్చిమ బెంగాల్	02	00
జార్ఖండ్	43	00
బీహార్	08	00
రాజస్థాన్	09	00
తమిళనాడు	01	00
గుజరాత్	03	00
అసోం	01	00
కేరళ	01	00
ఛత్తీస్‌గఢ్	01	00
పంజాబ్	08	00
మొత్తం	224	94

జలమండలిలో 40 మంది ఉద్యోగుల పదవీ విరమణ



సాక్షి,సిటీబ్యూరో: జలమండలిలో వివిధ హోదాల్లో పనిచేసిన 40 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. బోర్డు పరిధిలోని పలు డివిజన్లలో పని చేసిన వీరంతా.. గత నెల 30న పదవీ విరమణ పొందారు. ఇందులో 10 మంది టెక్నికల్ గ్రేడ్ – 2 గా, 17 మంది ఎస్పీఈ లుగా, మరో 13 మంది జీపీఈ లుగా పనిచేశారు. వీరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ తదితర ప్రయోజనాలను చెక్కు రూపంలో అందజేశారు.

రిటైర్ అయిన మరుసటి రోజే ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టారు.

- జలమండలిలో పదవీ విరమణ పొందే నాటికి.. వాటికి సంబంధించిన అన్నింటినీ సిద్ధం చేసి విరమణ చేసిన మరుసటి రోజే అన్ని ప్రయోజనాలను వర్తింపజేశారు. ఒకే రోజు 40 మంది పదవీ విరమణ చేసిన సందర్భంగా సుమారు రూ. 14 కోట్ల విలువగల చెక్కులను అందజేశారు.
- కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్, తెలంగాణ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్తర్, జనరల్ సెక్రటరీ జయరాజ్ లతో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు డబుల్ చేస్తానని...

- మ్యాజిక్‌తో మాయ
- నకిలీ నోట్లతో టోకరా
- ఐవరీ కోస్ట్ దేశస్తుడి అరెస్ట్..
- రూ.10 లక్షల నకిలీ నగదు స్వాధీనం..



స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లను చూపిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ



నిందితుడు జాన్ గయ్ రోస్టండ్

నాగోలు: డబ్బులను డబుల్ చేస్తానని మాయమాటలతో నమ్మించి మ్యాజిక్ చేసి నకిలీ నోట్లు అంటగట్టి మోసాలకు పాల్పడుతున్న ఐవరీ కోస్ట్ దేశస్తుడిని ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి రూ. 10 లక్షల నకిలీ ఇండియన్ కరెన్సీ, పేపర్ బండిల్స్, రసాయనాలు, జిరాక్స్ మెషీన్, నకిలీ నోట్ల తయారీ మెషీన్ స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు..ఐవరీ కోస్ట్ దేశానికి చెందిన జాన్ గయ్ రోస్టండ్ అలియాస్ డౌడా 2021 లో విజిటింగ్ వీసాపై ఇండియాకు వచ్చాడు. డౌడాగా పేరు మార్చుకున్న అతను డబ్బులు డబుల్ చేస్తానని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేసుకునేవాడు. అవతలి వారిని నమ్మించేందుకు ఎడమ చేతిలో రూ.500 ఒరిజినల్ కరెన్సీ నోట్లను రెండింటిని దాస్తాడు. బాధితుల నుంచి రూ.500 ఒరిజినల్ నోటు తీసుకుని కరెన్సీ సైజ్‌లోనే ఉన్న రెండు తెల్ల కాగితాల మధ్య ఉంచేవాడు. ఆ తర్వాత వాటిపై కెమికల్స్ చల్లి ఎన్వలప్ కవర్‌లో తెల్లకాగితాలు, బాధితులు ఇచ్చిన కరెన్సీ నోటును ఉంచేవాడు. అనంతరం ఓ పాత్రలో ఆ ఎన్వలప్‌ను ముంచి అందులో ఎడమ చేతిలో ఉన్న ఒరిజినల్ కరెన్సీ నోట్లను వదిలేసి నకిలీ నోట్లను బయటికి తీసి మోసం చేస్తున్నాడు. సోషల్ మీడియాలో వీడియోలను చూసి తనను సంప్రదించిన వారి నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకుని రెండింతలు నకిలీ నోట్లను అంటగట్టి మోసాలకు పాల్పడుతున్నాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ. 5 లక్షలు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎల్‌బీనగర్‌లోని రాఘవేంద్ర హోటల్‌లో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. ఇతను గతంలో మాదాపూర్ పీఎస్ పరిధిలో రూ.25 లక్షలు మోసం చేయడంతో కేసు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, ఎస్‌ఓటీ ఏసీపీ వెంకన్న నాయక్, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి, ఎస్‌ఓటీ సీఐ సుధాకర్, ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐపీఈలో నాణ్యమైన విద్య

సాక్షి, సిటీబ్యూరో: ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్(ఐపీఈ)లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఇక్కడ చదువుకున్న వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కూడా దక్కుతున్నాయని ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి అన్నారు. సోమవారం ఐపీఈ క్యాంపస్‌లో పీజీడీఎం-హెచ్‌ఆర్ఎం, ఎంఎం, బీఎఫ్ఎస్, ఐబీ కోర్సుల తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా ఇక్కడ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇక్కడ కోర్సులు పూర్తి చేసిన వారు ఉద్యోగంతోనే బయటికి వెళ్తున్నారన్నారు. ఆహ్లాదకరమైన వాతారణంలో ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందిస్తూ..దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

మరో విద్యార్థికి తీవ్ర గాయాలు



విశాల్ మృతదేహం

బన్సీలాల్‌పేట్: పుట్టిన రోజు వేడుకలకు హాజరై తిరిగి వస్తూ బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిరిసిల్లకు చెందిన విశాల్ (21), అతడి స్నేహితుడు సాయి ప్రకాష్ బోయిన్‌పల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతూ బోయినపల్లిలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఇద్దరు కలిసి చిక్కడపల్లిలో పుట్టిన రోజు వేడులకు హాజరయ్యారు. తెల్లవారు జామున కేటీఎమ్ బైక్‌పై బోయినపల్లి తిరిగి వెళుతుండగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న 1003 మెట్రోఫిల్లర్ సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు కిందపడ్డారు. బైక్ వెనక కూర్చున్న విశాల్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న సాయి ప్రకాష్‌కు కాలు, నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సాయి ప్రకాష్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్: మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని రువాన్ థాయ్ స్పాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. వివరాలివీ... రోడ్ నెం. 12లోని రువాన్ థాయ్ స్పాలో థాయ్‌లాండ్‌కు చెందిన నన్ని, సుజి, హనా, అవా, ఆప్లే మసాజ్ థెరపిస్టులుగా పని చేస్తున్నారు. స్పా యజమాని సల్మాన్, ఖాలీద్ అనే వ్యక్తులు వీరిని సెక్స్ వర్కర్లుగా మార్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం రాత్రి సదరు స్పాపై దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు సల్మాన్ పరారు కాగా, ఖాలీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రసూన్ ప్రకాష్ అనే వ్యక్తి కూడా ఇందులో భాగస్వామిగా ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. యువతులను పునరావాస కేంద్రానికి తరలించిన పోలీసులు నిర్వాహకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పది మంది విటులకు నోటీసులు జారీ చేశారు.

గొప్ప వ్యక్తులను అనుసరించాలి



ఎల్లూరి శివారెడ్డికి డాక్టర్ సీనారె పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: పద్మభూషణ్ డాక్టర్ సీ.నారాయణ రెడ్డి లాంటి గొప్ప వ్యక్తులను భావితరాలు అనుకరించి అనుసరించాలని శాంతా బయోటిక్స్ అధినేత పద్మభూషణ్ డాక్టర్ కేవీ.వరప్రసాద్‌రెడ్డి అన్నారు. జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత పద్మభూషణ్ డాక్టర్ సీ.నారాయణరెడ్డి 92వ జయంతి ఉత్సవాలు రసమయి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కేవీ.వరప్రసాద్ రెడ్డి తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డికి సీనారె పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురు పూర్ణిమ రోజు డాక్టర్ సీనారె జన్మించడం అరుదైన సందర్భమన్నారు. తెలుగు భాష అందాలను తన రచనల రూపంలో అందించిన గొప్ప వ్యక్తి సీనారె అన్నారు. ఆయన ఎన్నో సినిమాలకు పాటలు రాసి ప్రేక్షకులను మెప్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు పద్మభూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, కవి సామ్రాట్ డాక్టర్ తిరుమల శ్రీనివాసచార్య, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, ఎంకేఆర్.ఆశాలత, రసమయి అధ్యక్షులు డాక్టర్ ఎంకే.రాము, నిర్వాహకులు జె.నర్సింహారావులతో పాటు సాహితీ ప్రియులు పాల్గొన్నారు. అంతకు ముందు డాక్టర్ సీనారె రాసిన గీతాలను కళాకారులు ఆలపించారు.


విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు పీడీఎస్‌యూ నేతల వినతి



లక్డీకాపూల్ : రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నేతలు అన్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు గతంలో మాదిరిగానే 8 క్రెడిట్స్ సబ్జెక్ట్ మినహాయింపు సదుపాయాన్ని కల్పించాలన్నారు. గత 25 ఏళ్లగా అమలులో ఉన్న ఈ విధానాన్ని తొలగించడంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోతారన్నారు. ఏఐసీటీఈ అకడమిక్ రూల్స్ ప్రకారం ఇంజినీరింగ్ విద్యార్థి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీని పొందడానికి 150 నుంచి 160 క్రెడిట్ల శ్రేణిని పొందాలని స్పష్టంగా ఉందన్నారు. జేఎన్టీ యూహెచ్ గతంలో ఆర్ 07 నుంచి ఆర్ 16 వరకు అందరికీ మినహాయింపు ఇచ్చిందన్నారు. ఆర్18 విభాగంలో ఉన్న విద్యార్థులు పరీక్షలను ఒకే సంవత్సరంలో మూడు సెమిస్టర్లు రాయాల్సి వచ్చిందని పరీక్షలను టైమ్ టేబుల్‌కు అనుగుణంగా ఉంచేందుకు హడావుడిగా నిర్వహించారన్నారు. ఆర్18 విభాగంలో పలువురు విద్యార్థులు ఆన్‌లైన్ మోడ్‌ద్వారానే పరీక్ష రాశారని, వారిలో చాలా మంది విద్యార్థులు కనెక్టివిటీ సమస్యలు ఎదుర్కొన్నట్లు చైర్మన్ దృష్టికి తెచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో నాయకులు శ్రీకాంత్, జన్నారం రాజేశ్వర్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎమ్‌సీఈఎమ్‌ఈలో ఘనంగా 103వ స్నాతకోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎమ్‌సీఈఎమ్‌ఈ వేదికగా సోమవారం 103వ స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఈఎస్ 39వ కోర్సుకు చెందిన 20 మంది అధికారులతో పాటు రాయల్ భూటాన్ ఆర్మీ, శ్రీలంక సైన్యానికి చెందిన అధికారులు బీటెక్ డిగ్రీలను అందుకున్నారు. ఎమ్‌సీఈఎమ్‌ఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సిదానా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., నైపుణ్యాలతో శిక్షణ పొందిన సైనికులు దేశానికి నిబద్ధతతో సేవలందించాలన్నారు. ఈ కోర్సులో లెఫ్టినెంట్ రాహుల్ లోహియా ఉత్తమ ఆల్ రౌండ్ ఆఫీసర్‌గా ఎంపికై జీటీసీ-ఇన్-సీ ఏఆర్‌టీఆర్ఏసీ ట్రోఫీని అందుకున్నారు. ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో మొదటి స్థానంలో నిలిచినందుకు గోల్డ్ మెడల్ సాధించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచినందుకు లెఫ్టినెంట్ ఎస్‌పీఎస్ రాథోడ్‌కు కమాండెంట్ సిల్వర్ మెడల్ లభించింది. కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా రూపొందించిన అధునాతన డొమైన్‌లను ప్రదర్శించారు.

'ఉపాధి' పని దినాలు పెంచాలి



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు ఉన్న కుటుంబానికి కాకుండా ప్రతి ఒక్కరికి 200 పని దినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ వృత్తుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లెల ప్రభుదాస్ అన్నారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలవుతున్న తీరుపై ప్రభుత్వం పరిశీలించి కూలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం రోజుకు రూ.850కు తగ్గకుండా కూలి చెల్లించాలన్నారు. ప్రమాదవశాత్తు కూలీలు అంగవైకల్యం పొందితే రూ.3 లక్షలు, మరణిస్తే రూ.5 లక్షలు పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మర్ అలెవెన్సులు అమలు చేయాలన్నారు. అనుకూల సమయాల్లో 7 గంటలు పనిచేసే విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పంచాయితీల ఆధ్వర్యంలో పనులను గుర్తించి గ్రామసభలో ఆమోదం పొందేలా చూడాలన్నారు. దళితులు, ఆదివాసీలు చిన్నరైతుల భూములను సాగు యోగ్యంగా అభివృద్ధి చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలను కలుపుకుని ఉపాధి హామీ పథకాన్ని మరింత ప్రయోజనకరమైన ఫలితాలు సాధించడానికి ట్రస్మా వేదికను పునరుద్ధరించాలన్నారు. కూలీల హక్కులను కాలరాసే విధానాలు విడనాడాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జాతీయ కమిటీ సభ్యులు వెంకటయ్య, పి.శంకర్, వెంకటేశ్వరమ్మ, మల్లేపాగ శ్రీనివాసులు, నాగన్న, స్వాతి, మునేష్, జమ్మలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

15న ఓబీసీ సమస్యలపై జాతీయ స్థాయి సదస్సు

పంజగుట్ట: ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన రవీంద్రభారతిలో కులగణన, ఓబీసీ సమస్యలపై జాతీయ స్థాయి కన్వెన్షన్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు జి.కిరణ్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కన్వెన్షన్ పోస్టర్‌ను వివిధ సంఘాల నాయకులు భద్ర, పిడికిలి రాజు, కె.వి.గౌడ్‌లతో కలిసి ఆవిష్కరించారు.కొండల్, సాయికిరణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిభవన్ వద్ద కేఏ పాల్ హల్‌చల్

పంజగుట్ట: ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ప్రగతిభవన్ వద్ద సోమవారం మధ్యాహ్నం ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్ హల్‌చల్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు వచ్చానని తనను లోనికి అనుమతించాలని సెక్యూరిటీ సిబ్బందితో చెప్పారు. దీంతో వారు అపాయింట్‌మెంట్ ఉంటేనే లోనికి పంపుతామని స్పష్టం చేశారు. అక్టోబర్ 2వ తేదీన నిర్వహిస్తున్న ప్రపంచ శాంతి మహాసభకు కేసీఆర్‌ను ఆహ్వానించేందుకు కలుస్తానని అపాయింట్‌మెంట్ ఇప్పుడు ఇప్పించాలని కోరగా వారు నిరాకరించారు. దీంతో కొద్దిసేపు అక్కడే ఉండి వెళ్లిపోయారు.

'టీవీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ మేనేజర్స్' కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

ఫిలింనగర్: తెలుగు టెలివిజన్ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ అండ్ మేనేజర్స్ యూనియన్ ఎన్నికల్లో యాదగిరి ప్యానెల్ మొత్తం 19 పోస్టులకు గాను 19 పదవులను భారీ మెజార్టీతో గెలుచుకుంది. యూనియన్ అధ్యక్షుడిగా యాదగిరి, ఉపాధ్యక్షుడిగా సి.హెచ్.నాగమధు, కాశీ విశ్వనాథ్, జనరల్ సెక్రటరీగా నవీన్ కుమార్, ట్రెజరర్‌గా ఎన్.వి.కె.కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీగా కె. రమణ, కె.శ్రీకాంత్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాలకృష్ణదాసరి, రామాంజనేయులు, రవికుమార్, ఈసీ మెంబర్లుగా అఖిల్, వెంకట్, సందీప్‌కుమార్, సంతోషబాబా, సుకేష్‌రెడ్డి, హేమంత్‌కుమార్, సత్యనారాయణ, ఎన్.రవి, ఎన్.ప్రసాద్, ఎం.భాస్కర్ గెలుపొందారు. టెలివిజన్ ఇండస్ట్రీ చరిత్రలో ఒక ప్యానెల్ మొత్తం పదవులను గెలుచుకోవడం ఇదే మొదటిసారి. 2023–25 సంవత్సరానికి గాను ఈ కార్యవర్గం బాధ్యతలు నిర్వహిస్తుంది.

'పాటలు బాగున్నాయి'



సాక్షి, సిటీబ్యూరో: 'ఓక్స్ బీట్జ్' మ్యూజిక్ చానల్‌లోని పాటలు చాలా బాగున్నాయి.. అచ్చం సినిమా పాటలు చూస్తున్నట్లే ఉన్నాయి. మంచి కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఓక్స్ బీట్జ్' మ్యూజిక్ చానల్ మంచి ప్రేక్షకాదరణ పొందాలి' అని సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు అన్నారు. 'పోస్ట్ ప్రొడక్షన్' సంస్థతో కలసి షేడ్స్ స్టూడియోస్ 'ఓక్స్ బీట్జ్' అనే మ్యూజిక్ చానల్‌ను నెలకొల్పింది. ఈ చానల్ ద్వారా ఫోక్ టచ్ ఉన్న ప్రైవేట్ తెలుగు పాటలను శ్రోతలకు అందించనున్నారు. ఈ చానల్ ఆధ్వర్యంలో రూపొందించిన తొలి ఆల్బమ్‌ని (పాటలు) బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్స్ త్రినాథరావు, హేమంత్ మధుకర్, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, హీరోయిన్ మాళవిక సతీషన్, డ్యాన్స్ మాస్టర్ శేఖర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఓక్స్ బీట్జ్ చానల్ కో ఫౌండర్ ఉపేంద్ర రాచుపల్లి, షేడ్స్ స్టూడియోస్ డైరెక్టర్ దేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

సన్మానం



ఖైరతాబాద్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన ఇమాన్సు బాప్నకు సోమవారం రాత్రి జలవిహార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఉప్పల్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు, మైనార్టీ కమిషన్ చైర్మన్ హన్సారి ఆయనను ఘనంగా సన్మానించారు.

విజయ ఉత్పత్తులకు ఆదరణ

విజయ ఉత్పత్తులకు విశేష ఆదరణ లభిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం సాయంత్రం నెక్లెస్ రోడ్డులోని ట్యాంక్‌బండ్, పీవీ మార్గ్‌లలో రెండు విజయ ఐస్‌క్రీం పార్లర్లను శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్ ముదిరాజ్, డిప్యూటీ స్పీకర్ మోతె శ్రీలతారెడ్డి, పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అదర్ సిన్హా తదితరులతో కలిసి ప్రారంభించారు. డైయిరీ చైర్మన్ సోమా భరత్ కుమార్, హెచ్ఎండీఏ ఓఎస్డీ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వసాయి మందిరంలో హోమం



సాయిబాబాకు విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పంజగుట్ట ద్వారకాపురి కాలనీ సాయిబాబా ఆలయంలో...



వైభవంగా గురుపౌర్ణమి

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- ప్రత్యేక పూజలు.. అభిషేకాలు
- ఆధ్యాత్మికతతో సందడిగా ఆలయ పరిసరాలు



ఫిలింనగర్ దైవసన్నిధానంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ సూర్యనారాయణ

వెంకటేశ్వరకాలనీ: గురు పౌర్ణమి మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే సాయి ఆలయాలకు భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీ విశ్వసాయి మందిరంలో సాయిబాబాకు విశేషంగా 108 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించారు. విశేష అర్చనలు, సాయి హోమాలు, సాయి వ్రతాలు కన్నుల పండువగా జరిగాయి. వి.ధనుంజయ, వి. ప్రవీణ్‌కుమార్ ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంగరంగ వైభవంగా జరిగిన పల్లకీసేవలో భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశేష హారతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. పంజగుట్ట ద్వారకాపురి కాలనీలో సాయిబాబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ సాయిబాబాకు విశేష పూజల నిర్వహించారు.



ఫిలింనగర్ సాయిబాబా గుడిలో...

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో...

వెంగళరావునగర్: గురుపౌర్ణమి వేడుకలు సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలోని శ్రీవీరాంజనేయ భవానీశంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్ టెంపుల్), మధురానగర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం, వెంగళరావునగర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం, షిర్డిసాయి సంస్థానం, జవహర్ నగర్‌లోని సాయిబాబా దేవాలయం తదితర ప్రాంతాల్లో ఉన్న సాయిబాబా దేవాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ ప్రత్యేక పూజలు చేశారు. జీటీఎస్ టెంపుల్‌లో ఉదయం 6 గంటలకు మహా సర్వాభిషేకం, 9 గంటలకు సాయిబాబా వ్రతం, 12.30 గంటలకు టీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు జీటీఎస్ దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్, దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణాధికారి జె.జయరామయ్య, టీఆర్ఎస్ నాయకులు విజయ్, సత్యనారాయణ, కిట్టు, పూజారి బాల్‌రాజ్, పవన్ ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జీటీఎస్ ఆలయంలో కార్పొరేటర్ దేదీప్య...

జేహెచ్‌పీఎస్‌లో గురుపౌర్ణమి సందడి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువు స్నేహితుడిగా, తత్వవేత్తగా, మార్గదర్శకుడిగా వ్యవహరిస్తాడనే నేపథ్యంగా విద్యార్థులు ఆటలు, నృత్యాలు, నాటికల ద్వారా గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తమ స్కిట్ ద్వారా జ్ఞానం, ధర్మమార్గంలో నడిపించడంలో గురువు ఎప్పుడూ ముందుంటాడని చక్కటి అభినయంతో ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ టి.కాంచనవల్లి పాల్గొని గురువు గొప్పతనాన్ని స్మరించుకుంటూ మన జీవితంలో గురువు పాత్ర పోషించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



జేహెచ్‌పీఎస్‌లో విద్యార్థుల ఆట, పాటలు

ఎర్రగడ్డలో...



అన్నదానం చేస్తున్న డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: గురుపౌర్ణిమ వేడుకలు ఎర్రగడ్డ హేమావతీనగర్ సాయిబాబా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి, కమిటీ ప్రతినిధులు కేహెచ్ఎస్ శర్మ, శ్రీనివాస్, రవిగౌడ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎర్రగడ్డ కళ్యాణ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో బీజేపీ మహిళా నాయకురాలు డాక్టర్ పద్మ వీరపనేని పూజలు నిర్వహించారు.



అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ పద్మ వీరపనేని

ఎన్బీటీ నగర్ ప్రాథమిక పాఠశాలకు కొత్త హంగులు

బంజారాహిల్స్: మన బస్తీ–మన బడి కార్యక్రమంలో భాగంగా సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీతో కూడిన బ్యాగులను పంపిణీ చేశారు. కొత్త టేబుళ్లతో తరగతి గదులు కళకళలాడాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... విద్యార్థులకు అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. నాణ్యమైన విద్య అందిస్తున్నామని రోజూ తమ పిల్లలను పాఠశాలలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులన నమోదుకు అధికంగా ఉండటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. పథకంలో భాగంగా పాఠశాలలో టాయ్‌లెట్ల నిర్మాణం, తాగునీటి వసతి, అవసరమైన మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, గ్రీన్‌బోర్డులు, ప్రహరీ, అదనపు గదులు, డైనింగ్‌హాల్, డిజిటల్ విద్యకు అవసరమైన తరగతి గదులు ఏర్పాటు చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా ఇక్కడి ఉపాధ్యాయులను మేయర్ సత్కరించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డిప్యూటీ డీఈవో శ్యామూల్‌రాజు పాల్గొన్నారు.



బ్యాగులను అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

ఆస్కార్ విన్నర్లకు కంట్రీ క్లబ్ సత్కారం

బంజారాహిల్స్: జంతువుల సంరక్షణలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి డాక్యుమెంటరీ చిత్రం ద్వారా ఆస్కార్ పురస్కారం అందుకున్న బొమ్మన్–బెల్లి దంపతులను కంట్రీక్లబ్ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. బండీపూర్ వైల్డ్‌లైఫ్ కంట్రీ క్లబ్ అధినేత వై.రాజీవ్‌రెడ్డి వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వివరాలను ఆయన జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. తమిళనాడులోని మధుమలై అడవుల్లో ఏనుగు పిల్లల సంరక్షణకు బొమ్మన్–బెల్లి దంపతులు చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు. వారి నిజ జీవితం ఆధారంగా రూపొందించిన ఎలిఫెంట్ విస్పర్స్ అద్భుతమని అన్నారు.



బొమ్మన్–బెల్లి దంపతులతో సీఎండీ రాజీవ్‌రెడ్డి

విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెలరీ స్టోర్ ప్రారంభం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో నూతనంగా ఏర్పాటు చేసిన విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెలరీ స్టోర్‌ను సినీ నటి మంచు లక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఆభరణాల విభాగంలో ప్రఖ్యాతిగాంచిన విశిష్ట స్టోర్ హైదరాబాద్‌లో తమ తొలి స్టోర్‌ను ఇక్కడ ఏర్పాటు చేసింది. నగలంటే తనకు ఎంతో ఇష్టమని డైమండ్ జ్యువెలరీ ఎక్కువగా ఇష్టపడతానని ఈ సందర్భంగా మంచు లక్ష్మి అన్నారు. రకరకాల డిజైన్లతో ఆభరణాలు కనువిందు చేస్తున్నాయని ఆషాఢ మాసం ఆఫర్లు మహిళలకు ఒక వరం అన్నారు. మొదటిసారిగా తాను తండ్రితో నటిస్తున్నానని ఇది తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెలరీ ఎండీ సుమంత్ వైష్ణవి, డైరెక్టర్ శ్రీనివాసరావు, సీఈవో సింధూజ, డైరెక్టర్లు రవికుమార్, రితేష్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థినుల ఆందోళన

డిప్యూటీ సెక్రటరీ హామీతో ఆందోళన విరమణ

రహమత్‌నగర్(బోరబండ): బోరబండ సైట్–3 గురుకుల ఆశ్రమ కళాశాల పాఠశాలలో వసతులు కల్పించాలని విద్యార్థినీలు సోమవారం ఆందోళన నిర్వహించారు. దాదాపు మూడు గంటల పాటు వసతి గృహంలో ప్ల కార్డులతో నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న తెలంగాణ గురుకుల పాఠశాలల డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ ప్రసాద్, డీఈ యూసుఫ్ కళాశాలకు చేరుకుని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వివరాలివీ.... బోరబండ ఎస్ఆర్ఆర్ పురం సైట్3లోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల,కళాశాల వసతి గృహంలో మంచినీరు, వీధి దీపాలు, ప్రహరీ లేవని దానికి తోడు పక్కనే ఉన్న బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆగడాలు పెరిగి పోయాయంటూ సోమవారం ఉదయం 8 గంటలను టిఫిన్ బహిష్కరించి విద్యార్థినులు ఆందోళన ప్రారంభించారు. తమ సమస్యలు పరిష్కారించాలంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపల్ సుజాత కుమారి విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా వారు వినలేదు, చేసేది లేక ఆమె గురుకుల పాఠశాల డీఈ యూసుఫ్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న యూసుఫ్ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా విద్యార్థినులు ఆందోళన విరమించలేదు. సెక్రటరీ రావాలంటూ నినదాలు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర గురుకుల ఆశ్రమ పాఠశాలల డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ ప్రసాద్ వసతి గృహానికి చేరుకుని తక్షణ చర్యలుగా సింటెక్స్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తానని, త్వరలోనే ఇతర సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.




క్రైం కార్నర్..

పబ్‌లో కత్తితో విన్యాసాలు: యువకుడిపై కేసు

బంజారాహిల్స్: పబ్‌లో కత్తితో విన్యాసాలు చేసి కస్టమర్లను భయభ్రాంతులకు గురి చేసిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని రాక్ క్లబ్‌లో ఈ నెల 2వ తేదీన రాత్రి 12.30 గంటల ప్రాంతంలో అమీర్‌పేట్‌కు చెందిన సంపత్ సింగ్ అనే యువకుడు మద్యం మత్తులో కత్తితో విన్యాసాలు చేశాడు. దీంతో అక్కడున్న కస్టమర్లంతా భయభ్రాంతులకు గురయ్యారు. బౌన్సరు రంగ ప్రవేశం చేసి నిందితుడి నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు ఈ ఘటనపై పబ్ యజమాని ఠాకూర్ శివలాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంపత్‌సింగ్‌పై ఐపీసీ సెక్షన్ 506, ఆరమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూసెన్స్ చేస్తున్న యువకుడికి జైలు



నిందితుడు షేక్ షాదత్

బంజారాహిల్స్: రోజూ పీకలదాకా మద్యం సేవిస్తూ దారినపోయేవారిని అడ్డగిస్తూ వేధింపులకు గురి చేస్తున్న ఆటో డ్రైవర్‌కు పది రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సయ్యద్‌నగర్ షాహిన్ స్కూల్ సమీపంలో నివసించే షేక్ షాదత్(23) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రోజూ మద్యం సేవిస్తూ స్థానికంగా తీవ్ర న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడిపై పెట్టి కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఎదుట హాజరుపరిచారు. తీవ్రతను గమనించిన న్యాయమూర్తి నిందితుడికి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

వెంగళరావునగర్: పండ్లు కోసేందుకు చెట్టు ఎక్కిన వ్యక్తి జారిపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... లింగంపల్లి ప్రాంతానికి చెందిన బి.పెద్దఅంజప్ప(35) గతనెల 19న మధురానగర్ సమీపంలోని సిద్ధార్థనగర్‌కాలనీకి వచ్చాడు. అత్యంత సన్నిహితులు కావడంతో ఆ ఇంటి నివాసితుల కోరికమేరకు ఆవరణలో ఉన్న చెట్టును ఎక్కాడు. పండ్లు కోస్తున్న క్రమంలో పొరబాటున జారి కిందపడ్డాడు. కింద ఉన్న విద్యుత్ వైర్లపై పడి షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పెద్ద అంజప్పను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు. కొన్నిరోజులుగా గాంధీలో చికిత్స పొందుతున్న అంజప్ప సోమవారం మృతిచెందాడు. పెద్ద అంజప్ప సోదరుడు చిన్నప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ యుగంధర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికే ప్రజాదరణ: ఎమ్మెల్యే దానం



పార్టీలో చేరిన మహిళలతో ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: కేసీఆర్ హయాంలో మహిళలకు లభిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని ఇది మంచి పరిణామమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌కు చెందిన బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు డి. నిర్మల, అనురాధ, మిత్రవింద, ఆషా బేగం, పర్వీన్, స్వప్నలతో పలువురు మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరోసారి బీఆర్ఎస్‌కు అండగా నిలబడి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని కోరారు. త్వరలోనే పెద్ద ఎత్తున మహిళలకు వడ్డీలేని రుణాలు అందించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, వనజ, శిరీష, బీఆర్ఎస్ సీనియర్ నేత పెరుక కిరణ్‌కుమార్, రామలక్ష్మి, బాలమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూలై 5 నుంచి డాక్టర్స్ క్రికెట్ టోర్నీ

బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఎంఎస్‌కే ప్రసాద్



డాక్టర్స్ క్రికెట్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌కే ప్రసాద్

ఫిలింనగర్: నిత్యం బిజీగా ఉండే డాక్టర్లకు ఆటవిడుపులా స్టేట్ డాక్టర్స్ క్రికెట్ టోర్నమెంట్ ఉపయుక్తంగా, ఉల్లాసంగా ఉంటుందని బీసీసీఐ సెలెక్షన్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. సోమవారం ఎఫ్ఎన్‌సీసీలోఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ, జేవిఆర్‌జే గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన స్టేట్ డాక్టర్స్ క్రికెట్ టోర్నమెంట్ జెర్సీ, ట్రోఫీ లాంచ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 10 రోజుల పాటు హైదరాబాద్ కేంద్రంలో ఈ టోర్నమెంట్ జరుగుతుందని ఆయన తెలిపారు. డాక్టర్స్ క్రికెట్ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదిగేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే దేశ వ్యాప్తంగా ఉన్న డాక్టర్లతో కూడా ఓ భారీ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. జేవీఆర్‌జే గ్రూప్ చైర్మన్ భాస్కర్‌రామ్ గుప్తా మాట్లాడుతూ... వైద్యుడు దేవుడితో సమానమని, ప్రజల ప్రాణాలను రక్షించేందుకు తమ శక్తి వంచన లేకుండా కషి చేస్తారన్నారు. వారి కోసం ఏర్పాటు చేస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగస్వామి కావడం ఆనందంగా ఉందని అన్నారు. ఇన్‌కంటాక్స్ కమిషనర్ డాక్టర్ ఎల్.రాంజీరావు, నగర జాయింట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, నంది అవార్డు గ్రహీత, సినీ నిర్మాత రాంకీ గర్గపర్తి, లక్ష్మి సుధా భాస్కర్ రామ్ గుప్త, మాలతి, వెంకట్, మురళి, జయకష్ణ, మోహన్, కళ్యాణ్, రాజు, సుదర్శన్, శివాలి పాల్గొన్నారు. సాయి తదితరులు పాల్గొన్నారు. జెర్సీల పంపిణీ ఆద్యంతం కనులపండువగా సాగింది.

ఇంజినీరింగ్ కాలేజీల్లో అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

పంజగుట్ట: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో ఇవ్వాల్సిన సీట్లు బ్లాక్‌లో పెట్టి లక్షల్లో మేనేజిమెంట్ కోటాలో అమ్ముకుంటున్నారని రూ. వందల కోట్ల అవినీతి చేస్తున్న ఇంజినీరింగ్ కాలేజీలపై సీబీఐ విచారణ జరిపించాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ జేఏసీ చైర్మన్ డాక్టర్ బట్టు శ్రీహరి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ వచ్చాక ఇప్పటివరకు 50 వేల కన్వీనర్ సీట్లను బ్లాక్ చేశారని ఆరోపించారు. ఒక్కో సీటు రూ. 15 లక్షలు మొదలుకొని రూ. 20 లక్షలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. బహుజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు కత్తి వీరన్న, ప్రశాంత్, శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో నిత్యావసరాలను సరఫరా చేయాలని ఆందోళన

పంజగుట్ట: నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు ప్రభుత్వమే అందివ్వాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు) ఆధ్వర్యంలో సోమవారం ఎర్రమంజిల్ లోని పౌరసరఫరాల కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున మహిళలు ధర్నాలో పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆయా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు డి.స్వరూప, సి.హెచ్.శిరోమణి, కె.కాశీనాథ్, కె.ఎస్.ప్రదీప్ పౌరసరఫరాల శాఖ జాయింట్ కమిషనర్ ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నేతలు జయ, కిషన్, గోదావరి, ఝాన్సీ, ఈశ్వర్, రాకేష్, లలిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం తథ్యం: విజయారెడ్డి

పంజగుట్ట: రాష్ట్రలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం తథ్యమని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. ఖైరతాబాద్ డివిజన్ ఎర్రమంజిల్, బాలాపురకు చెందిన వినోద్ కుమార్, టి.ప్రవీణ్ కుమార్, బోనగిరి ఆనంద్, వినయ్ కుమార్‌లతో పాలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్, టీడీపీ నాయకులు విజయారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

స్పోర్ట్స్



మెయిన్ 'డ్రా'కు రష్మిక

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక సింగిల్స్ విభాగంలో మెయిన్ 'డ్రా'కు అర్హత పొందింది. థాయ్‌లాండ్‌లో సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో రష్మిక 6-1, 7-6 (8/6)తో మా షయి (చైనా)పై గెలిచింది. ఈ మ్యాచ్‌లో రష్మిక తొమ్మిది ఏస్‌లు సంధించింది. హైదరాబాద్‌కే చెందిన హుమేరా బహార్మస్, స్మృతి భాసిన్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో ఓడిపోయారు.



వింబుల్డన్ టోర్నీ నుంచి వైదొలిగిన కిరియోస్

ఆస్ట్రేలియా వివాదాస్పద ఆటగాడు నిక్ కిరియోస్ సోమవారం మొదలైన ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. మణికట్టు గాయంతో బాధపడుతుండటంతో అతను ఈ నిర్ణయం తీసుకున్నాడు. గత ఏడాది పురుషుల సింగిల్స్ విభాగం ఫైనల్లో సెర్బియా స్టార్ జొకోవిచ్ చేతిలో కిరియోస్ ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు. 30వ సీడ్‌గా బరిలోకి దిగిన కిరియోస్ తొలి రౌండ్‌లో బెల్జియం ప్లేయర్ గాఫిన్‌తో తలపడాల్సింది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ అతను బరిలోకి దిగలేదు.



జొకోవిచ్



కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ లక్ష్యంగా వింబుల్డన్ టోర్నీలో అడుగు పెట్టిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ తొలి అడ్డంకిని అలవోకగా అధిగమించాడు. వరుస సెట్‌లలో గెలిచి టైటిల్ వేటను ఆరంభించాడు. 2018 నుంచి ఈ టోర్నీలో ఓటమి ఎరుగని ఏడుసార్లు చాంపియన్ ఎనిమిదోసారి విజేతగా అవతరించాలని పట్టుదలతో ఉన్నాడు. ఈ ఏడాది జరిగిన రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ జొకోవిచ్ ఖాతాలోకే వెళ్లాయి. వింబుల్డన్‌లోనూ జొకోవిచ్ అజేయంగా నిలిస్తే అరుదైన 'క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్' ఘనత సాధించేందుకు జొకోవిచ్‌కు రెండోసారి అవకాశం లభిస్తుంది. 2021లో జొకోవిచ్ ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలను గెలిచి చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. 1969లో రాడ్ లేవర్ (ఆస్ట్రేలియా) తర్వాత పురుషుల టెన్నిస్‌లో మరో ప్లేయర్ 'క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్' ఘనతను సాధించలేకపోయాడు.

వేట మొదలు...

- జొకోవిచ్ శుభారంభం
- రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంప్

లండన్: కాస్త పోటీ ఎదురైనా... కీలకదశలో స్పష్టమైన ఆధిపత్యం కనబరిచిన సెర్బియా టెన్నిస్ మేటి నొవాక్ జొకోవిచ్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 6-3, 6-3, 7-6 (7/4)తో పెడ్రో కాచిన్ (అర్జెంటీనా)పై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. 2 గంటల 12 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 13 ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 45 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ నెట్ వద్దకు 35 సార్లు దూసుకొచ్చి 23 సార్లు పాయింట్లు గెలిచాడు. జొకోవిచ్ 18వ సారి వింబుల్డన్ టోర్నీలో ఆడుతుండగా... కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ టోర్నీలో బరిలోకి దిగిన కాచిన్ పది ఏస్‌లు సంధించి, 29 అనవసర తప్పిదాలు చేశాడు. పురుషుల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 6-1, 5-7, 6-4, 6-3తో లారెంట్ లోకిలి (ఫ్రాన్స్)పై, ఏడో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6-3, 7-5, 6-4తో మాక్స్ పర్సెల్ (ఆస్ట్రేలియా)పై, 14వ సీడ్ ముజెట్టి (ఇటలీ) 6-3, 6-1, 7-5తో వారిలాస్ (కెనడా)పై, 17వ సీడ్ హుర్కాజ్ (పోలాండ్) 6-1, 6-4, 6-4తో రామోస్ వినోలాస్ (స్పెయిన్)పై నెగ్గి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.

స్వియాటెక్ బోణీ

మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్), నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), ఐదో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్), ప్రపంచ మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో స్వియాటెక్ 6-1, 6-3తో లిన్ జు (చైనా)ను ఓడించగా... పెగూలా 6-2, 6-7 (8/10), 6-3తో లారెన్ డేవిస్ (అమెరికా)పై, గార్సియా 6-4, 6-3తో కేటీ వోలినెట్స్ (అమెరికా)పై, అజరెంకా 6-4, 5-7, 6-4తో యు యువాన్ (చైనా)పై విజయం సాధించారు.

నెదర్లాండ్స్ ఆశలు సజీవం



విక్రమ్‌జీత్

- ఒమన్‌పై 74 పరుగులతో గెలుపు
- విక్రమ్‌జీత్ సెంచరీ

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో నెదర్లాండ్స్ నిలిచింది. సోమవారం జరిగిన 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో నెదర్లాండ్స్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 74 పరుగుల తేడాతో ఒమన్‌పై గెలిచింది. వర్షంవల్ల 48 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా నెదర్లాండ్స్ 48 ఓవర్లలో 7 వికెట్లకు 362 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్ విక్రమ్‌జీత్ సింగ్ (109 బంతుల్లో 110; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కాడు. వెస్లీ బరెసి (65 బంతుల్లో 97; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు సెంచరీ భాగ్యాన్ని త్రుటిలో కోల్పోయాడు. తర్వాత మళ్లీ వానతో ఒమన్ లక్ష్యాన్ని 44 ఓవర్లలో 321 పరుగులుగా నిర్దేశించారు. అయితే ఒమన్ 44 ఓవర్లలో 6 వికెట్లకు 246 పరుగులే చేసింది. అయాన్ ఖాన్ (92 బంతుల్లో 105 నాటౌట్; 11 ఫోర్లు, 2) ఒంటరి పోరాటం చేశాడు.

నేడు జింబాబ్వే గెలిస్తే...

ఇప్పటికే శ్రీలంక జట్టుకు ప్రపంచకప్ బెర్త్ ఖరారు కాగా... రెండో బెర్త్ కోసం జింబాబ్వే, స్కాట్లాండ్, నెదర్లాండ్స్ రేసులో ఉన్నాయి. ఈరోజు స్కాట్లాండ్‌తో తమ చివరి 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో జింబాబ్వే గెలిస్తే మిగతా మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ స్కాట్లాండ్ విజయం సాధిస్తే మాత్రం జింబాబ్వే జట్టుకు అర్హత అవకాశాలు క్లిష్టమవుతాయి. నెదర్లాండ్స్, స్కాట్లాండ్‌ల మధ్య ఈనెల 6న జరిగే మ్యాచ్ ఫలితం తర్వాతే రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందో ఖరారవుతుంది.

భారత్ టైటిల్ నిలబెట్టుకునేనా?

నేడు కువైట్‌తో 'శాఫ్' టోర్నీ ఫైనల్

- రాత్రి గం. 7:30 నుంచి డీడీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ట్రోఫీతో భారత జట్టు డిఫెండర్ సందేశ్ జింగాన్, కువైట్ జట్టు గోల్‌కీపర్ బదర్ బిన్ సానూన్

బెంగళూరు: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తొమ్మిదోసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో నేడు జరిగే ఫైనల్లో పటిష్టమైన కువైట్‌తో ఆడనుంది. ఈ టోర్నమెంట్‌లో భారత్, కువైట్‌లు తలపడటం ఇది రెండోసారి. లీగ్ దశలో హోరాహోరీగా జరిగిన మ్యాచ్ 1-1తో 'డ్రా'గా ముగిసింది. లెబనాన్‌తో జరిగిన సెమీఫైనల్లో భారత్ చక్కని ప్రదర్శనతో పెనాల్టీ షూటౌట్‌లో గెలిచింది. మరోవైపు బంగ్లాదేశ్‌తో జరిగిన మరో సెమీస్‌లో కువైట్ 1-0తో విజయం సాధించింది. కువైట్, లెబనాన్ పశ్చిమ ఆసియా దేశాలైనప్పటికీ పోటీతత్వం ఉండాలనే ఉద్దేశంతో నిర్వాహకులు ఈ రెండు దేశాలకు ప్రత్యేకంగా ఆహ్వానించాయి. కంఠీరవ స్టేడియంలో ప్రేక్షకుల మద్దతుతో భారత్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. సొంతగడ్డపై జరుగుతుండటం భారత్‌కు అనుకూలాంశమైతే... హెడ్ కోచ్ ఇగోర్ స్టిమాక్ ఈ ఫైనల్‌కు కూడా జట్టుకు అందుబాటులో ఉండటం లేదు. పాకిస్తాన్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో మైదానంలోకి వెళ్లి ప్రత్యర్థి ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగడంతో 'రెడ్ కార్డ్'తో ఓ మ్యాచ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో లెబనాన్‌తో కీలకమైన సెమీస్ మ్యాచ్‌కు దూరమయ్యారు. అయితే టోర్నీ క్రమశిక్షణ కమిటీ అతనికి రెండు మ్యాచ్‌ల సస్పెన్షన్ విధించడంతో.... కువైట్‌తో అమీతుమీకి కూడా గైర్హాజరు కానున్నారు.

1 ఇప్పటి వరకు భారత్, కువైట్ జట్ల మధ్య నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. భారత్ ఒక మ్యాచ్‌లో గెలిచింది. ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

కాంస్యం నెగ్గిన వ్రితి



సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు రెండో పతకం లభించింది. గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో సోమవారం మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో తెలంగాణ అమ్మాయి వ్రితి అగర్వాల్ కాంస్య పతకాన్ని సాధించింది. వ్రితి 18ని:09.50 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. ఆదివారం మహిళల 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలోనూ వ్రితికి కాంస్య పతకం దక్కింది. మహిళల 200 మీటర్ల మెడ్లే విభాగంలో హాషిక రామచంద్ర (కర్ణాటక) కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. హాషిక 2ని:21.15 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలువడంతోపాటు 2010 నుంచి రిచా మిశ్రా (2ని:23.62 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. పురుషుల 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో ఆర్యన్ నెహ్రా (గుజరాత్; 8ని:01.81 సెకన్లు), మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో అనన్య నాయక్ (మహారాష్ట్ర; 57.31 సెకన్లు) కూడా స్వర్ణ పతకాలు సాధించడంతోపాటు కొత్త జాతీయ రికార్డులు సృష్టించారు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో యూకీ బాంబ్రీ



న్యూఢిల్లీ: గతవారం మలోర్కా ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో డబుల్స్ టైటిల్ సాధించిన భారత టెన్నిస్ ప్లేయర్ యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌కు చేరుకున్నాడు. సోమవారం విడుదల చేసిన డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 30 ఏళ్ల యూకీ ఏకంగా 17 స్థానాలు పురోగతి సాధించి 58వ ర్యాంక్‌లో నిలిచాడు. రోహన్ బోపన్న ఒక స్థానం పడిపోయి 12వ ర్యాంక్‌కు చేరుకోగా... సాకేత్ మైనేని 76వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

మిగతా 'యాషెస్' టెస్టులకు లయన్ దూరం



లండన్: ఆస్ట్రేలియా మేటి ఆఫ్ స్పిన్నర్ నాథన్ లయన్ ఇంగ్లండ్‌తో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లోని మిగతా మూడు టెస్టులకు దూరమయ్యాడు. రెండో టెస్టులో బరిలోకి దిగడంద్వారా 36 ఏళ్ల లయన్ వరుసగా 100 టెస్టులు ఆడిన తొలి బౌలర్‌గా గుర్తింపు పొందాడు. అయితే రెండో టెస్టులో ఆట రెండో రోజు ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో లయన్ కాలి పిక్క కండరాల గాయానికి గురయ్యాడు. అనంతరం బౌలింగ్‌కు, ఫీల్డింగ్‌కు దిగని లయన్ ఆస్ట్రేలియా జట్టు అవసరాలదృష్ట్యా గాయంతోనే రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగి 15 పరుగులు చేశాడు. 2011లో అరంగేట్రం చేసిన లయన్ ఇప్పటి వరకు 122 టెస్టులు ఆడి 496 వికెట్లు పడగొట్టాడు. 2013 నుంచి పదేళ్ల కాలంలో లయన్ వరుసగా 100 టెస్టుల్లో ఆడాడు. ప్రస్తుత యాషెస్ సిరీస్‌లో మూడో టెస్టు గురువారం నుంచి లీడ్స్‌లో జరుగుతుంది.

సెప్టెంబర్ 8,9 తేదీల్లో ప్రొ కబడ్డీ వేలం



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ కోసం ఆటగాళ్ల వేలం కార్యక్రమం సెప్టెంబర్ 8, 9వ తేదీల్లో ముంబైలో జరగనుంది. స్వదేశీ, విదేశీ ఆటగాళ్లను 'ఎ', 'బి', 'సి', 'డి' కేటగిరీలుగా విభజించారు. 'ఎ' కేటగిరీలో ఉన్న వారి కనీస ధర రూ. 30 లక్షలుగా... 'బి' కేటగిరీ ప్లేయర్లకు కనీస ధర రూ. 20 లక్షలు... 'సి' కేటగిరీ ఆటగాళ్ల కనీస ధర రూ. 13 లక్షలుగా... 'డి' కేటగిరీ క్రీడాకారుల కనీస ధర రూ. 9 లక్షలుగా నిర్ణయించారు. వేలంలో 500కుపైగా క్రీడాకారులు బరిలో ఉన్నారు. తొమ్మిదో సీజన్‌లో పాల్గొన్న ఆటగాళ్లలో ఆరుగురిని అట్టిపెట్టుకునే సౌలభ్యం ఆయా ఫ్రాంచైజీలకు ఉంది. మొత్తం 12 జట్లు ఈ లీగ్‌లో ఉన్నాయి.

సినిమా

టీజర్‌కి వేళాయె



● 'సలార్'లో ప్రభాస్

సినిమా ప్రేమికులు ఎంతగానో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'సలార్' సినిమా టీజర్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సలార్'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతి బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ సినిమా మేజర్ షూటింగ్ పూర్తయింది. తాజాగా ఈ నెల 6న (గురువారం) ఉదయం 5 గంటల 12 నిమిషాలకు 'సలార్' టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సోమవారం చిత్రయూనిట్ ప్రకటించింది. ''కేజీఎఫ్ 2', 'కాంతార' చిత్రాలతో ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్‌ను సొంతం చేసుకున్నాం. ఇప్పుడు మా బ్యానర్ నుంచి వస్తున్న 'సలార్' చిత్రం కూడా సరికొత్త రికార్డులు సృష్టిస్తుంది. యాక్షన్ ప్యాక్డ్ మూవీ 'సలార్' టీజర్‌ను విడుదల చేయడానికి సర్వం సిద్ధమైంది'' అని హోంబలే ఫిలింస్ ప్రతినిధులు తెలిపారు. కాగా 'సలార్' చిత్రం ఈ సెప్టెంబరు 28న విడుదల కానుంది.


నాలుగోసారి...

హీరో అల్లు అర్జున్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో నాలుగో సినిమా తెరకెక్కనుంది. 'జులాయి' (2012), 'సన్నాఫ్ సత్యమూర్తి' (2015), 'అల..వైకుంఠపురములో..' (2020) చిత్రాల తర్వాత అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న కొత్త సినిమా ప్రకటన వెల్లడైంది. పద్మశ్రీ అల్లు రామలింగయ్య-మమత సమర్పణలో హారిక-హాసినీ క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించనున్నాయి. సోమవారం గురుపూర్ణిమ సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. 'ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను అలరించడానికి అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ సినిమాకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కాగా ఈ సినిమా సోషియో ఫ్యాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని టాక్.



● త్రివిక్రమ్ ● అల్లు అర్జున్

నేను దిగితే మిగిలేదుండదు!



● రామ్

రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'స్కంద' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ది ఎటాకర్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో రామ్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సోమవారం 'స్కంద' టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు చిత్రయూనిట్. 'మీరు (సినిమాలో రౌడీలను ఉద్దేశిస్తూ..) దిగితే ఊడేదుండదు... నేను దిగితే మిగిలేదుండదు..' అంటూ రామ్ చెప్పే డైలాగ్‌తో ఈ గ్లింప్స్ విడుదలైంది. జీ స్టూడియోస్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సెప్టెంబర్ 15న విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డిటాకే.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్

అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. పి.మహేశ్ బాబు దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమాను ఈ వేసవిలో విడుదల చేయాలనుకున్నా కుదర్లేదు. దీంతో తాజాగా ఆగస్టు 4న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. చెఫ్ అన్విత రవళి శెట్టి పాత్రలో అనుష్కా శెట్టి, స్టాండప్ కమెడియన్ సిద్ధు పాత్రలో నవీన్ పొలిశెట్టి కనిపిస్తారు. ఈ సినిమాకు సంగీతం: రధన్.



● అనుష్క, నవీన్

కొత్త కామెడీ టైమింగ్‌ను చూస్తారు - హరీశ్ శంకర్



● అర్జున్ దాస్యన్, శ్రీసింహా, వశిష్ఠ, దశరథ్, హరీశ్ శంకర్, ప్రణీత్, కాలభైరవ

''భాగ్ సాలే' సినిమాను నేను నిర్మించాల్సింది.. కానీ కుదరలేదు. శ్రీసింహాలో మంచి టైమింగ్ ఉంది. ఈ సినిమాలో కొత్త కామెడీ టైమింగ్‌ను చూస్తారు. దర్శకుడు ప్రణీత్‌తో నేను, విష్ణు కలిసి ఓ సినిమాను నిర్మించనున్నాం'' అని డైరెక్టర్ హరీశ్ శంకర్ అన్నారు. శ్రీ సింహా కోడూరి, నేహా సోలంకి జంటగా ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'భాగ్ సాలే'. అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీ సింహా మాట్లాడుతూ-''ఈ సినిమాతో అందర్నీ నవ్విస్తాం'' అన్నారు. ''భాగ్ సాలే' ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు ప్రణీత్. ''మంచి క్రైమ్ కామెడీ ఫిల్మ్ ఇది'' అన్నారు అర్జున్ దాస్యన్. ''ఈ తరహా చిత్రాలు చాలా తక్కువగా వస్తాయి'' అన్నారు యష్ రంగినేని.

అది సవాల్‌గా అనిపించింది - యుక్తి తరేజ



''నా మాతృభాష హిందీ. 'రంగబలి' కోసం తెలుగులో పెద్ద పేరాగ్రాఫ్ డైలాగులు నేర్చుకొని చెప్పడం సవాల్‌గా అనిపించింది. ఈ విషయంలో డైరెక్షన్ టీమ్‌కి థ్యాంక్స్. అలాగే దర్శకుడు పవన్‌గారు స్క్రిప్ట్‌ని ముందే నాకు ఇవ్వడంతో కొంచెం సులభం అయింది'' అని హీరోయిన్ యుక్తి తరేజ అన్నారు. నాగశౌర్య హీరోగా పవన్ బాసంశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'రంగబలి'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ యుక్తి తరేజ మాట్లాడుతూ-''మాది హరియాణ. ఢిల్లీ యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ చేశాను. ఆ తర్వాత మోడలింగ్ మొదలు పెట్టాను. అనంతరం యాక్టింగ్ ఆడిషన్స్ ఇచ్చాను. 'లుట్ గయ్..' అనే పాట మంచి పేరు తీసుకొచ్చింది. పవన్‌గారు ఆడిషన్ చేసి 'రంగబలి' కి ఎంపిక చేశారు. ఇందులో మెడికల్ స్టూడెంట్ సహజంగా కనిపిస్తా. నా మొదటి సినిమాకే నాగశౌర్యగారితో పాటు మంచి నిర్మాణ సంస్థలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. తెలుగులో నాకు ఇష్టమైన హీరో అల్లు అర్జున్. ఆయనతో కలిసి డ్యాన్స్ చేయాలని ఉంది. హీరోయిన్స్‌లో అనుష్క శెట్టిగారు అంటే ఇష్టం. ప్రస్తుతం తెలుగులో కొన్ని కథలు వింటున్నాను'' అన్నారు.


ఆ ట్రెండ్ నిర్మాతలకు మంచిదే - అనిల్ సుంకర



''ప్రస్తుతం ఇండస్ట్రీలో రీ రిలీజ్ సినిమాల ట్రెండ్ నడుస్తోంది. వాటి ద్వారా నిర్మాతలకు అదనపు ఆదాయం వస్తోంది. ఏ ప్రొడ్యూసర్‌కి డబ్బులు వచ్చినా అది ఇండస్ట్రీకి వచ్చినట్లే. రేపు మా సినిమా కూడా రీ రిలీజ్‌కి రావచ్చు.. అది నిర్మాతలకు మంచిదే'' అని నిర్మాత అనిల్ సుంకర అన్నారు. శ్రీవిష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా జూన్ 29 విడుదలైంది. ఈ సందర్భంగా అనిల్ సుంకర మాట్లాడుతూ...

● 'సామజ వరగమన' మా యూనిట్ నమ్మకాన్ని నిలబెట్టింది. ఈ విజయం చాలా తృప్తి ఇచ్చింది. ఈ కథకు శ్రీ విష్ణు కరెక్ట్‌గా సరిపోయాడు. మహేశ్ బాబు, నాని, శ్రీవిష్ణు... ఇలా ఎవరి మార్కెట్ వాళ్లది. 'సామజ వరగమన'ని తమిళంలో రీమేక్ చేయాలనే ఆలోచన ఉంది. ఇదే కాంబినేషన్‌లో మళ్లీ ఓ సినిమా ఉంటుంది. ● 'ఏజెంట్' ఫలితం విషయంలో యూనిట్ అందరి తప్పు ఉంది. కొన్ని కారణాల వల్ల బౌండ్ స్క్రిప్ట్‌తో వెళ్లలేకపోయాం. ఇకపై పూర్తి కథ లేనిదే ఏ సినిమాని సెట్స్‌పైకి తీసుకెళ్లను. పెద్ద సినిమాలకు కాంబినేషన్‌ని బట్టి బిజినెస్ ఉంటుంది. కానీ, చిన్న సినిమాలకు కొంచెం రిస్క్ ఉంటుంది. కథ బాగుంటేనే వర్కవుట్ అవుతాయి. ● మా బ్యానర్‌లో తీసిన 'హిడింబ' ట్రైలర్ నచ్చడంతో టేబుల్ ప్రాఫిట్ బిజినెస్ జరిగింది. అలాగే 'ఊరు పేరు భైరవ కోన' కంటెంట్ కూడా యూనిక్‌గా ఉంటుంది. చిరంజీవిగారితో తీస్తున్న 'భోళా శంకర్' ఫ్యామిలీ మూవీ. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఆగస్టు 11న సినిమా విడుదలవుతుంది.

పాత రోజులు గుర్తొచ్చాయి - శ్రీకాంత్



● ఆదిత్య ఓం, శ్రీకాంత్

''నాతో నేను' చిత్రంలోని రెట్రో సాంగ్ వినగానే మళ్లీ పాత రోజులు గుర్తొచ్చాయి. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్టు ఈ పాటను తీర్చిదిద్దారు'' అని హీరో శ్రీకాంత్ అన్నారు. సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలి రాజపుత్ ప్రధాన పాత్రల్లో శాంతకుమార్ తూర్లపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'నాతో నేను'. ప్రశాంత్ టంగుటూరి నిర్మించిన ఈ చిత్రంలోని రెట్రో మెలోడీ సాంగ్‌ను శ్రీకాంత్ విడుదల చేశారు. ''ఈ పాట చూస్తే ప్రేక్షకులు 1980 జ్ఞాపకాల్లోకి వెళతారు'' అన్నారు శాంతకుమార్. ''త్వరలో మా సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు ప్రశాంత్ టంగుటూరి. ఈ చిత్రానికి కెమెరా: మురళీ మోహన్ రెడ్డి, సంగీతం: సత్య కశ్యప్, నేపథ్య సంగీతం: ఎస్ చిన్న, సమర్పణ: ఎల్లలు బాబు టంగుటూరి.

తెలంగాణ నేపథ్యంలో...



● 'పొక్కిలి' పోస్టర్ రిలీజ్ చేస్తున్న సుకుమార్

నేత్ర, శ్రేయస్ ఐట్టోజు, సుధీర్ శర్మ, సాయి రాఘవేంద్ర, ప్రద్యుమ్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పొక్కిలి'. మహేష్ గంగిమళ్ల దర్శకత్వంలో వీఆర్‌జీఆర్ మూవీస్‌పై గొంగటి వీరాంజనేయ నాయుడు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు పోస్టర్‌ని డైరెక్టర్ సుకుమార్ విడుదల చేశారు. ''తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో, వాస్తవ ఘటనలతో రూపొందుతోన్న చిత్రం 'పొక్కిలి'. క్లైమాక్స్, రెండు పాటలు మినహా షూటింగ్ పూర్తయింది'' అన్నారు దర్శక-నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: జయపాల్ నిమ్మల.

సాక్షి బిజినెస్
మంగళవారం
4-7-2023

స్టాక్ మార్కెట్లు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
486	134
65,205	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కేజీ)	75,500

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేది
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయ్యొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యుయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోటక్లు పెరిగింది.
- ఎన్ఎస్ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సొల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కంన్స్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్టు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ ఆశీష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్ఎస్ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హాన్స్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హాన్స్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హాన్స్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహరాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 1000
» అర్హత:ఏదైనా డిగ్రీ,సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» పే స్కేల్: నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
» పోస్టింగ్ స్థలం: దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:15.07.2023
» ఆన్‌లైన్ పరీక్ష తేది:ఆగస్టు రెండు/మూడో వారం
» వెబ్‌సైట్: www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య:4,045 క్లర్క్ పోస్టులు
» అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» వయసు: 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
» ప్రిలిమినరీ పరీక్ష తేది:2023 ఆగస్టు/సెప్టెంబర్‌ల్లో
» మెయిన్స్ పరీక్ష తేది: అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:21.07.2023
» వెబ్‌సైట్: www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- **కేజీబీవీ-పోస్టులు 1218:** స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69,పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(మ్యాథమెటిక్స్)-45,సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- **యూఆర్ఎస్-మొత్తం పోస్టులు-23:** స్పెషల్ ఆఫీసర్-4,సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5,సీఆర్‌టీ(సైన్స్)-6,సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- **పీజీసీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- **స్పెషల్ ఆఫీసర్:** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- **సీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- **పీఈటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం

- **పీజీసీఆర్‌టీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **స్పెషల్ ఆఫీసర్:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **సీఆర్‌టీ:** ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.



- **పీఈటీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: జూలై 5, 2023
- రాత పరీక్ష తేది: జూలై 2023
- వెబ్‌సైట్: https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..

ఐఐటీ ఇండోర్

ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూయూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూయూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.



ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ,మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

క్లుప్తంగా...

సమాచార కమిషనర్ల భర్తీకి ప్రకటన జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్‌తోపాటు రాష్ట్ర సమాచార కమిషనర్ల పదవులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటన జారీ చేసింది. అర్హతలు కలిగిన అభ్యర్థులు సరైన పత్రాలు, ఆధారాలతో ఆగస్టు 4లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు కోసం www.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. రాష్ట్ర సమాచార కమిషన్‌లో చీఫ్ కమిషనర్‌తోపాటు 10 మందికి మించకుండా రాష్ట్ర సమాచార కమిషనర్లను నియమించడానికి చట్టం అవకాశం కల్పిస్తోంది.

'ఎన్‌సీసీ' కేడెట్లకు ఎయిర్‌వింగ్ శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఎన్‌సీసీ (నేషనల్ కేడెట్ క్రాప్స్) ఎయిర్ వింగ్ కేడెట్లకు దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో సోమవారం శిక్షణ క్యాంపు నిర్వహించారు. భారతవాయుసేన పనితీరు, ఫ్లైయింగ్ కేడెట్ల శిక్షణ, యుద్ధరంగంలో వాడే విమానాల్లో సాంకేతిక అంశాలు తదితర విషయాలపై జూన్ 19 నుంచి ఈ శిక్షణ కొనసాగినట్టు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఉన్నతాధికారులు తెలిపారు. మొత్తం 50 మంది ట్రైనీ కేడెట్లలో 17 మంది బాలికలు ఉన్నారని, గుజరాత్, కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన కేడెట్లు శిక్షణలో పాల్గొన్నట్టు పేర్కొన్నారు.

అధిక ఫీజు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

సాక్షి, హైదరాబాద్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న రూ.5,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఫీజు చెల్లించని విద్యార్థులకు అనేక కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బురిడీ కొట్టించబోయి పట్టుబడిన బురుండి దేశస్తురాలు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.14 కోట్ల హెరాయిన్ పట్టివేత



శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.14 కోట్ల విలువ చేసే హెరాయిన్‌ను కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. బురుండి రిపబ్లిక్ జాతీయురాలైన ఓ మహిళ (43) నైరోబి నుంచి షార్జా మీదుగా ఎయిర్ అరేబియా విమానం జీ9–458 విమానంలో ఆదివారంరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఆమె బ్యాగేజీలో బరువైన వస్తువులు ఉన్నట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. బ్యాగేజీలోని సబ్బులు, దుస్తులకు వాడే గుండీలు, ప్లాస్టిక్ పౌచ్‌ల్లో రెండు కిలోల 27 గ్రాముల 'హెరాయిన్'బయటపడింది. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో 14.2 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

11 నుంచి టీఎస్‌యూటీఎఫ్ ఆందోళనలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై టీఎస్‌యూటీఎఫ్ నిరసనలకు సిద్ధమైంది. ఈ నెల 11 నుంచి 13 వరకు మండలాల్లో పాదయాత్ర, బైక్‌యాత్ర, ఆగస్టు 12న జిల్లాల్లో దీక్షలు చేపడుతున్నట్టు ఆ సంఘం ప్రకటించింది. కేజీబీవీ, యూఆర్ఎస్ సమస్యలపై ఈ నెల 20న 'చలో ఎస్పీడీ ఆఫీస్', గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై ఆగస్టు 5న మహాధర్నా నిర్వహించాలని తలపెట్టింది. ఆ సంఘం నేత కె.జంగయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ వర్చువల్ సమావేశంలో పలు నిర్ణయాలు చేశారు. ఈ మేరకు సమావేశ వివరాలను సంఘం ప్రధానకార్యదర్శి చావా రవి మీడియాకు వెల్లడించారు.

రేపట్నుంచి మోడల్ స్కూల్ టీచర్ల బదిలీ ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈ నెల 5 నుంచి వెబ్‌బేస్డ్ బదిలీ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు పాఠశాల విద్యా డైరెక్టర్ దేవసేన తెలిపారు. ఇందుకు అనుగుణంగా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 14న టీచర్ల పాయింట్ల ప్రాథమిక వివరాల జాబితా వెలువడుతుందని పేర్కొన్నారు. 18, 19 తేదీల్లో టీచర్ల వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 21 నుంచి 23 వరకు బదిలీలు ఉంటాయని వెల్లడించారు.



సాక్షి, హైదరాబాద్: మీరు వాహనం నడిపేటప్పుడు ఇబ్బంది పడుతున్నారా? కళ్లు తిరిగినట్లు అనిపిస్తోందా? కారు లేదా లారీ లేదా ఏదైనా వాహనాం నడిపేటప్పుడు ఒక పక్కకు వెళ్లినట్లు అనిపించిందా? మీకు తెలియకుండానే యాక్సిడెంట్ అయిపోయిందా? ఒక్కసారిగా స్టీరింగ్ వదిలేశారా? అయినా ఏం జరిగిందో మీకు అర్థం కాలేదా? ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారంటే.. మీ మెదడులోని బ్యాలెన్స్ సిస్టంలో ఏదో లోపం కారణంగానే ఇలా జరుగుతూ ఉండే అవకాశముంది. దీన్నే వైద్య పరిభాషలో మోటరిస్ట్ వెస్టిబులర్ డిస్‌ఓరియంటేషన్ సిండ్రోమ్ అంటారు. రోడ్డు ప్రమాదాల్లో 50% వరకు బ్రెయిన్ బ్యాలెన్స్ సిస్టంలో సమస్యల వల్లే జరుగుతున్నాయని అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. డ్రైవింగ్ చేయాలంటే మన కళ్ల నుంచి మెదడు వరకు కోఆర్డినేషన్ వ్యవస్థ ఉంటుందని, అది సక్రమంగా పని చేయకపోతే బ్యాలెన్స్ తప్పుతుందని వైద్యులు అంటున్నారు. ఈ బ్యాలెన్స్ సమస్య వల్ల చాలా తీవ్రమైన ప్రమాదాలు జరుగుతాయి.

డ్రైవింగ్‌లో 'భ్రాంతి' ముప్పు!

- యాక్సిడెంట్లకు కారణమవుతున్న మోటరిస్ట్ వెస్టిబ్యులర్ డిస్‌ఓరియంటేషన్ సిండ్రోమ్
- 50% వరకు రోడ్డు ప్రమాదాలకు మెదడు బ్యాలెన్స్ సిస్టంలో లోపమే కారణం!
- కళ్లు తిరుగుతున్నట్టు అన్పించడం, వాంతుల ఫీలింగ్ దీని లక్షణాలు
- ఈ సమస్య ఉన్న వారు అకస్మాత్తుగా స్టీరింగ్ వదిలేస్తారు
- మద్యం తాగి నడపడం వల్లే అనుకోవడం సరికాదంటున్న అధ్యయనాలు

➤ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఇతరత్రా కారణాలతోపాటు సాధారణంగా డ్రైవర్ మద్యం తాగి ఉంటాడనుకుంటాం. డ్రైవింగ్ సరిగా రాదని, తగిన అనుభవం లేదని అనుకుంటాం. కానీ ఇలా యాక్సిడెంట్ చేసిన వారిలో చాలా మందికి ఏదో ఒక అనారోగ్య సమస్య ఉండి ఉండొచ్చని, బ్యాలెన్స్ సిస్టంలో సమస్య ఉందని కానీ ఎవరూ అనుకోరు. డ్రైవర్లు కూడా తమకు కళ్లు తిరిగితే నీరసం అనుకుంటారు. సరిగా నిద్రలేకపోవడం వల్ల ఇలా జరిగిందనుకుంటారు. వాంతుల ఫీలింగ్ ఉంటే గ్యాస్ట్రిక్ సమస్య అనుకుంటారు. చాలామందికి తమలో బ్యాలెన్స్ సమస్య ఉందన్న సంగతే తెలియదు. మానసిక సమస్యలు ఉన్నవారు, డిప్రెషన్, భయం ఉన్న వారిలో ఇలాంటి బ్యాలెన్స్ సమస్యలు వస్తుంటాయి. ఇలాంటి సమస్య ఉన్నవారిలో 66% మందికి అధిక వేగంతో వెళ్తున్నప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. 58 శాతం మంది మల్టిపుల్ లేన్స్ ఉన్నప్పుడు గందరగోళానికి గురవుతారు. కళ్లు తిరుగుతుంటాయి. 58% మందికి టర్నింగ్ (మలుపు తిరిగేటప్పుడు) సమయంలో సమస్య ఉత్పన్నమవుతుంది. 40% మందికి ఇతర వాహనాన్ని చూసినప్పుడు కంగారు, కళ్లు తిరగడం వంటివి సంభవిస్తాయి. 25% మందికి బ్రిడ్జి పైనుంచి వెళ్తున్నా, పల్లానికి వెళ్తున్నా కళ్లు తిరుగుతాయి. 29% మందికి ఓవర్‌టేక్ చేసేప్పుడు కళ్లు తిరుగుతాయి. 12 శాతం మందిలో ఇరుకైన సొరంగాల్లో వెళ్తున్నప్పుడు ఇటువంటి సమస్య ఏర్పడుతుంది.

అధిక వేగంతో వెళ్తున్నప్పుడు.. మలుపు తిరిగేటప్పుడు

➤ డ్రైవింగ్ చేస్తున్నప్పుడు స్పష్టత (క్లారిటీ) ఉండాలి. దాన్నే స్పెషియల్ కాగ్నెటివ్ ఎబిలిటీ అంటారు. మన కాళ్లు, చేతుల మధ్య కోఆర్డినేషన్ అవసరం. ఇందులో మన బ్రెయిన్, కొన్ని నరాలు కూడా భాగస్వామ్యం అవుతాయి. ఆప్టిక్ నర్వ్ చూడటానికి, ఆక్యులో మోటార్ నర్వ్ కళ్లు అటూ ఇటూ తిప్పి చూడడానికి సహకరిస్తాయి. వెస్టిబిలో కాక్లియర్ నర్వ్ మన బ్యాలెన్స్‌ను నియంత్రిస్తుంది. ముందుకు వెళ్లాలన్నా, వెనక్కు వెళ్లాలన్నా ఇది నియంత్రిస్తుంది. స్పైనల్ యాక్సెసరీ నర్వ్ మనం మెడ అటూ ఇటూ తిప్పడాన్ని నియంత్రిస్తుంది. ఇవన్నీ కాకుండా బ్రెయిన్‌లో ఉన్న మోటార్ సెరిబెల్లార్ సిస్టం, ఎక్స్‌ట్రా పిరమిడల్ సిస్టం కీలకమైన పాత్ర పోషిస్తాయి. మనం డ్రైవ్ చేయాలంటే ఇవన్నీ కూడా కరెక్ట్‌గా పనిచేయాలి. వెస్టిబిలో కాక్లియర్ నర్వ్ మనం నడవాలన్నా, వెనక్కు ముందుకు జరగాలన్నా.. ఇలా మొత్తం బ్యాలెన్స్‌ను నియంత్రిస్తుంది. ఈ నరంలో సమస్య ఏర్పడితే డ్రైవింగ్ చేసేటప్పుడు సమస్యలు వస్తాయి. అలా వచ్చే సమస్యలనే మోటరిస్ట్ వెస్టిబిలో సిండ్రోమ్ అంటారు. ఇది స్కిల్డ్ డ్రైవర్లలో వచ్చే సడన్‌గా వచ్చే సమస్య. ట్రక్ డ్రైవర్లలో ఇది ఎక్కువగా ఉంటుంది. లారీ, బస్సు డ్రైవర్లలోనూ ఈ సమస్య ఉంటుంది. 79 శాతం మందిలో డిసోరియెంటేషన్ ఏర్పడుతుంది. సడన్‌గా వారు ఏం చేస్తున్నారో, ఎక్కడున్నారో అర్థం కాదు. 55 శాతం మందికి కళ్లు తిరుగుతాయి. వాహనంపైనా నియంత్రణ కోల్పోతారు. 35 శాతం మందికి కారు ఒకవైపు పోతున్నట్లు అనిపిస్తుంది. 25 శాతం మందికి చెమటలు పట్టడం, కాళ్లు చేతులు చల్లగా అయిపోయి గుండె దడదడ కొట్టుకోవడం జరుగుతుంది. 25 శాతం మందికి శరీరం గట్టిగా (స్టిఫ్) అయిపోతుంది. ఇలాంటి సమస్యకు గురైన చాలామంది గుండెపోటు వచ్చిందనుకొని భయపడతారు. కానీ ఈసీజీ వంటివి చేస్తే అన్నీ సాధారణంగానే ఉంటాయి.

ఏం చేస్తున్నారో అర్థం కాదు..

మందులు లేదా వ్యాయామంతో చికిత్స

డ్రైవర్లకు ఎలా తోలుతున్నారు అన్నదాన్ని చూసే అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తారు.. కానీ వారి ఆరోగ్య పరిస్థితిని చూడరు. బ్యాలెన్స్ సిస్టంను ఎవరూ చెక్ చేయరు. అయితే మోటరిస్ట్ వెస్టిబులర్ సిండ్రోమ్‌తో యాక్సిడెంట్లు జరుగుతున్నాయని అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడయ్యింది. మా వద్దకు ఇలాంటి వారు వచ్చి చికిత్స తీసుకుంటున్నారు. బ్యాలెన్స్ సమస్య ఉన్నవారిలో 60 శాతం మందికి మైగ్రేన్ (తలనొప్పి) సమస్య ఉన్నట్లు గుర్తించారు. 50 శాతం మందిలో వాంతి వచ్చినట్లు అవడం జరుగుతుంది. ఈ తరహా వాటన్నింటికీ చికిత్స ఉంది. న్యూరో ఆటాలజిస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ పరీక్ష చేసి, పరిస్థితిని అంచనా వేసి చికిత్స చేస్తే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. కొన్నింటికి మందులు ఉంటాయి. కొన్నింటికి వ్యాయామంతోనే సరిచేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా 30–45 వయస్సు వారిలో ఎక్కువగా ఇటువంటి సమస్యలుంటాయి. మహిళల్లోనూ ఎక్కువగా చూస్తుంటాం.



– డాక్టర్ లాస్య సింధు, ఈఎన్‌టీ న్యూరో ఆటాలజిస్ట్, సిటీ న్యూరో ఆసుపత్రి, హైదరాబాద్

రాష్ట్రానికి కొత్తగా 230 మెడికల్ పీజీ సీట్లు

- 2023–24 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి..
- దేశవ్యాప్తంగా 3,714 సీట్లకు ఇప్పటివరకు అనుమతించిన ఎన్‌ఎంసీ
- ఈ నెలాఖరులోగా ప్రవేశాల షెడ్యూల్!
- ఆలోపు మరిన్ని సీట్లు పెరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్: పోస్టు గ్రాడ్యుయేషన్ మెడికల్ కోర్సులు చదవాలనుకునే విద్యార్థులకు శుభవార్త. 2023–24 విద్యా సంవత్సరంలో సీట్లు భారీగా పెరగనున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో కొత్తగా 3,714 సీట్లకు అనుమతులు జారీ అయినట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ గణాంకాలు చెబుతున్నాయి. మరికొన్ని కళాశాలల్లో సీట్ల పెంపుదల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ నెల మూడో వారం తర్వాత పీజీనీట్–2023 కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఆలోపు అదనపు సీట్లకు సంబంధించి ఎన్‌ఎంసీ ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో పీజీ చదవాలనుకునే వారికి అవకాశాలు పెరగనున్నాయి. తాజా సీట్ల పెరుగుదలతో రాష్ట్ర విద్యార్థులకూ లబ్ధి కలగనుంది. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు, వైద్య సంస్థల్లో 230 సీట్లు పెరగనున్నాయి. త్వరలో తుది జాబితా వెలువడుతుందని, ఈ క్రమంలో మరో 30 సీట్లకు అనుమతొచ్చే చాన్సుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో దేశంలో పెరిగిన సీట్లలో రాష్ట్రంలోనే 8% సీట్లు పెరిగినట్లు అవుతుంది.

ఉస్మానియాకు 31 సీట్లు

సీట్లు పెరగనున్న కాలేజీల్లో ముందు వరుసలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ఉంది. రాష్ట్రంలో టాప్ కాలేజీగా పేరొందిన ఉస్మానియాలో కొత్తగా 25 గైనకాలజీ సీట్లు పెరిగాయి. ఇదివరకు 35 సీట్లు ఉండగా... ఇప్పుడు వాటి సంఖ్య 60కి పెరిగింది. అదే విధంగా డెర్మటాలజీలో 6 సీట్లు పెరిగాయి. ఇప్పటి వరకు 12 సీట్లు ఉండగా... వీటి సంఖ్య 18కి చేరింది. ఇక ప్రైవేటు కేటగిరీలో అధికంగా మల్లారెడ్డి మెడికల్ కాలేజీకి కొత్తగా 40 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ కాలేజీలో కొత్తగా 8 ఎండీ అనాటమీ సీట్లు, 8 ఎండీ ఫార్మకాలజీ, 3 రేడియేషన్ ఆంకాలజీ, 3 ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు చేరాయి. అదేవిధంగా 10 ఎండీ రేడియో డయాగ్నొసిస్, 8 ఎండీ పీడియాట్రిక్స్ సీట్లు పెరిగాయి. ఇవేకాకుండా వివిధ మెడికల్ కాలేజీల్లో సింగిల్ డిజిట్‌లో సీట్ల సంఖ్య పెంచుతూ ఎన్‌ఎంసీ అనుమతులు ఇచ్చింది. కాలేజీల వారీగా సీట్ల సమాచారాన్ని తీసుకున్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ కౌన్సెలింగ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది. మరో వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత పీజీ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల చేసే అవకాశముంది. ఈ నెలాఖరుకల్లా తొలివిడత కౌన్సెలింగ్ ముగించేలా చర్యలు చేపట్టింది.

దేశంలో కేటగిరీల వారీగా పెరిగిన సీట్లు

ప్రభుత్వ కాలేజీలు	2,118
ప్రైవేటు కాలేజీలు	1,330
డీమ్డ్ యూనివర్సిటీలు	266
మొత్తం	3,714



నీట్‌లో రాష్ట్రం నుంచి 44,629 మందికి ర్యాంకులు

రాష్ట్రస్థాయి ర్యాంకులు విడుదల చేసిన కాళోజీ ఆరోగ్య వర్సిటీ

- తెలంగాణ నుంచి 72,842 మంది నీట్ పరీక్షకు హాజరు
- రాష్ట్ర టాప్ ర్యాంకర్ రఘురామిరెడ్డి.. రెండో ర్యాంకర్ జాగృతి
- ఎంబీబీఎస్, డెంటల్ ప్రవేశాలకు త్వరలో ప్రకటన.. అనంతరం కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: నీట్ యూజీ ప్రవేశాలకు నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో రాష్ట్రానికి చెందిన అభ్యర్థుల వివరాలను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం విడుదల చేసింది. నీట్ ర్యాంకుల వారీగా అభ్యర్థుల వివరాలు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ నుంచి రాష్ట్రానికి అందాయి. నీట్ పరీక్ష దరఖాస్తు సమయంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారుగా అభ్యర్థులు ఇచ్చిన వివరాల ఆధారంగానే ఈ జాబితా ప్రకటించారు. వీటిని నీట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులుగానే పరిగణిస్తున్నారు. అయితే, కట్ ఆఫ్ మార్కుల ఆధారంగా ఈ ర్యాంకుల్లో కొద్దిగా మార్పులు చేర్పులు జరగొచ్చని వర్సిటీ ప్రకటించింది. తెలంగాణ నుంచి 72,842 మంది నీట్ పరీక్షకు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 107 కట్ ఆఫ్ మార్క్ అర్హత ఉండటంతో అంతవరకు ఎంతమంది ఉంటే వారందరి జాబితాను కాళోజీ వర్సిటీ ప్రకటించింది. ఈ మేరకు మొత్తం 44,629 మంది జాబితాను వెల్లడించింది. అయితే జనరల్ కేటగిరీల్లో ఉన్నవారి కట్ ఆఫ్ మార్క్ 137, దివ్యాంగుల కట్ ఆఫ్ మార్క్ 121 ఉంది. ఈ జాబితాలో 107 వరకు కట్ ఆఫ్ మార్క్ సాధించిన జనరల్ కేటగిరీ, దివ్యాంగులకు చెందిన అభ్యర్థుల వివరాలను కూడా విశ్వవిద్యాలయం ప్రకటించింది. కాబట్టి జాబితాలో ఉన్నవారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలయితే 107 కట్ ఆఫ్ మార్క్ చూసుకోవాల్సి ఉంటుంది. జనరల్ విద్యార్థులు 137, దివ్యాంగులైతే 121 వరకు కట్ ఆఫ్ మార్కు ఉంటేనే అర్హులుగా భావించాలని వర్సిటీ తెలిపింది.

స్టేట్ టాప్ ర్యాంకర్ రఘురామరెడ్డి..

రాష్ట్రంలో నీట్ పరీక్ష రాసిన కె.జి.రఘురామరెడ్డి తెలంగాణ నుంచి నీట్ టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. ఆయనకు 715 మార్కులు రాగా, జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించారు. అలాగే రెండో ర్యాంకు జాగృతి బోడెద్దుల సాధించారు. ఆమె 710 మార్కులతో జాతీయ స్థాయిలో 49వ ర్యాంకు సాధించారు. లక్ష్మి రస్మిత గండికోట 710 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. జాతీయ స్థాయిలో ఆమె 52వ ర్యాంకు సాధించారు. కాగా, ఈ జాబితా సమాచారం నిమిత్తమేనని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు యూనివర్సిటీ మొదట రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ చేస్తుంది. అభ్యర్థుల దరఖాస్తుల ఆధారంగా ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం యూనివర్సిటీ మెరిట్ జాబితాను విడుదల చేస్తుంది. రాష్ట్రంలోని యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు వీలుగా అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తామని కాళోజీ వర్సిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అయితే ఈసారి కౌన్సెలింగ్ ప్రక్రియలో మార్పు చేసే అవకాశముందని అంటున్నారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత రానుంది. దేశవ్యాప్తంగా ఒకేసారి జాతీయ కౌన్సెలింగ్, రాష్ట్రాల కౌన్సెలింగ్ నిర్వహించాలని భావిస్తున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది మే 7న జాతీయ స్థాయిలో నీట్ అర్హత పరీక్ష నిర్వహించగా, జూన్ 13న ఫలితాలు ప్రకటించారు.



నీట్‌లో రాష్ట్రస్థాయి టాప్ 10 ర్యాంకర్లు

స్టేట్ ర్యాంకు	పేరు	మార్కుల స్కోరింగ్
1	కె.జి.రఘురామరెడ్డి	715
2	జాగృతి బోడెద్దుల	710
3	లక్ష్మి రస్మిత గండికోట	710
4	గిలాడ ప్రాచి	710
5	దేవగుడి గురు శశిధర్‌రెడ్డి	710
6	తెల్లా వరుణ్‌రెడ్డి	705
7	చిన్మయి వుప్పల	705
8	లక్షన్య ఆదికేశవన్	705
9	జక్కె సుధీక్ష	705
10	వేమూరి సుహిత్	705

కోర్టులు రాజకీయ వేదికలు కావు

కేంద్ర, రాష్ట్ర న్యాయవాదులకు హైకోర్టు మందలింపు

- రాష్ట్ర ప్రభుత్వానికి వాదనలకు అర్హతే లేదు: కేంద్రం
- మా వాదనలూ వినాలి: రాష్ట్ర ప్రభుత్వం
- కేడర్ కేటాయింపు కేసుల విచారణ ఈ నెల 18కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాజకీయ వివాదాలకు కోర్టులను వేదికలుగా వాడుకోవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులను హైకోర్టు సున్నితంగా మందలించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) కేడర్ కేటాయింపులకు సంబంధించి దాఖలైన కేసుల విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను జూలై 18కి వాయిదా వేసింది. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఏపీకి కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై 'క్యాట్'ను ఆశ్రయించి తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. అయితే కేంద్రం క్యాట్ ఉత్తర్వులను తప్పుబడుతూ తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా విడివిడిగా విచారించాలని డీజీపీ, ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేయగా సోమవారం జస్టిస్ అభినంద్ కుమార్ షావిలీ, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

డీఎస్‌జీ, ఏఏజీ వాగ్వాదం..

ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినాల్సిన అవసరం ఉందని ఏఏజీ రామచందర్‌రావు వాదించారు. ఈ సయమంలో డిప్యూటీ సొలిసిటర్ జనరల్ జోక్యం చేసుకొని క్యాట్ వద్ద ఇవే కేసులు వాదనకు వచ్చినప్పుడు ఇది కేంద్రానికి సంబంధించిన అంశమని, ఇందులో కలుగజేసుకోలేమని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిందని గుర్తుచేశారు. మరి ఇప్పుడు వాదనలు వినాలని ఎందుకు కోరుతుందోని, రాష్ట్ర ప్రభుత్వానికి వాదనలు వినిపించే అర్హతే లేదని చెప్పారు. విద్యుత్ బకాయిలు, ఆస్తుల పంపకాలు సహా అనేక పునర్విభజన వివాదాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నప్పుడు, ఏఐఎస్‌ల కేడర్ వివాదంలో కేంద్రానికి తొందరెందుకని ఏఏజీ ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఇలా రాజకీయ అంశాలకు కోర్టులను చర్చా వేదికలుగా మార్చకోరాదని పేర్కొంటూ, విచారణను వాయిదా వేసింది.

ఒకేసారి భారీగా బదిలీలు ఎందుకు?

ఉపాధ్యాయ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల్లో చాలా మంది వ్యతిరేకంగా ఉన్నప్పుడు.. ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా భారీగా బదిలీలు చేపట్టడం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. '30–35 సంవత్సరాలపాటు ఒకే పాఠశాలలో సేవలందించిన ప్రభుత్వ ఉపాధ్యాయులను చూశాం. వారు పదవీ విరమణ చేసేవరకు అక్కడే పనిచేస్తారు. వీరంతా విద్య చెప్పడమే కాదు.. విద్యార్థులతో వాత్సల్యాన్ని ఏర్పర్చుకుంటారు. ఇలాంటి వారిని ప్రభుత్వం ఎందుకు బదిలీలు చేస్తుంది. ఈ రోజు గురుపూర్ణిమ. గురువులను ఎందుకు వేధిస్తున్నారు' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. బదిలీల నిలిపివేత కారణంగా విద్యాశాఖలో పని ఎందుకు స్తంభించిందో చెప్పాలని ఆదేశించింది. అలాగే బదిలీలపై విధించిన స్టేను ఈనెల 11 వరకు పొడిగించింది. తదుపరి విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ధోల్‌కట్టకు చెందిన సక్కుబాయితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి జారీ చేసిన జీవోను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. లేదా.. ప్రత్యామ్నాయంగా టీచర్స్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు, జీవిత భాగస్వామి కేటగిరీ కింద కొందరికి ఎలాంటి అదనపు పాయింట్లు ఇవ్వకుండా బదిలీలను చేపట్టేలా ప్రతివాదులను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఉపాధ్యాయుల బదిలీపై గతంలోనే స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పిటిషన్లు సోమవారం మరోసారి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ప్రభుత్వం తరఫున ఏఏజీ రామచందర్‌రావు వాదిస్తూ.. బదిలీల నిలిపివేత కారణంగా విద్యాశాఖలో పని స్తంభించిపోయిందని చెప్పారు. ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకే సంఘాలతో కలసి రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపడుతోందన్నారు. ఎన్నికల సమీపిస్తున్నందున ఉపాధ్యాయుల అవసరం ఉంటుందని, స్టే ఎత్తివేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను 11కు వాయిదా వేసింది.

దత్తపుత్రుడికి ఆస్తి హక్కులుండవ్: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దత్తత వెళ్లక ముందు సొంత (పుట్టిన) తల్లిదండ్రులు ఏదైనా ఆస్తిని కేటాయించి ఉంటే దానిపై దత్తత వెళ్లిన వ్యక్తికి హక్కులు ఉంటాయి తప్ప.. దత్తత వెళ్లిన అనంతరం ఎలాంటి హక్కులు ఉండవని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది.దత్తత తీసుకున్న తల్లిదండ్రుల ఆస్తికి మాత్రమే వారసుడవుతారని వ్యాఖ్యానించింది. దత్తత వెళ్లిన తర్వాత సొంత తల్లిదండ్రులతో ఎలాంటి సంబంధం ఉండదని చెప్పింది. అలాంటప్పుడు వారి ఆస్తికి వారసులు కాలేరని స్పష్టం చేసింది. దత్తతకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. దత్తత వెళ్లినప్పటికీ తనకు సొంత తల్లిదండ్రుల కుటుంబ ఆస్తిలో వాటా ఉంటుందంటూ ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలానికి చెందిన ఏవీఆర్ఎల్ నరసింహారావు కింది కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు సొంత తల్లిదండ్రుల ఆస్తిలో వాటా ఉంటుందని తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ అతని సోదరుడు ఎ.నాగేశ్వరరావు హైకోర్టులో లెటర్స్ పేటెంట్ అప్పీల్ దాఖలు చేశారు. దీని విచారణకు ప్రధాన న్యాయమూర్తి ఫుల్ బెంచ్ ఏర్పాటు చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ పి.నవీన్ రావు, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం ఇటీవల తీర్పునిచ్చింది.

'తెలుగులో తీర్పులివ్వండి'



'తెలుగులో తొలి తీర్పు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ భీమపాక నగేశ్, జూలూరు గౌరీశంకర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: మున్సిఫ్ కోర్టు, సబ్ కోర్టు, జిల్లా కోర్టులలో తెలుగులోనే తీర్పులు ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాల్సిందిగా హైకోర్టు న్యాయమూర్తులు టి.నవీన్‌రావ్, నగేశ్ భీమపాకలను తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. సోమవారం హైకోర్టులో జస్టిస్ నవీన్‌రావు కార్యాలయంలో 'తెలుగులో తొలి తీర్పు' అన్న పుస్తకాన్ని న్యాయమూర్తులు నవీన్ రావు, భీమపాక నగేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ, హైకోర్టులో తొలిసారిగా తెలుగులో తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కిందికోర్టు నుంచి జిల్లా స్థాయి కోర్టువరకు తీర్పులన్నీ తెలుగులోనే ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. తెలుగులో తీర్పులను ఇవ్వడం వల్ల ప్రజలకు న్యాయశాస్త్రంపై అపారమైన నమ్మకం కలుగుతుందని, కోర్టులు ప్రజలకు మరింత దగ్గరవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ నగేశ్ భీమపాకలను ఆయన శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె నాగేశ్వరరావు నేతృత్వం వహించారు. ప్రొఫెసర్ కిషోర్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కళ్యాణ్‌రావు, కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, న్యాయవాదులు వి.రామకృష్ణారెడ్డి, చిక్కుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్‌ఐటీ మెరిట్ జాబితా విడుదల

ఈ నెల 7 నుంచి కౌన్సెలింగ్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన మొదటి మెరిట్ జాబితాను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. ఈనెల 7 నుంచి కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. మొదటి దశ కౌన్సెలింగ్ ఈనెల 7న క్రమసంఖ్య 1 నుంచి 500 వరకు, రెండో దశ ఈనెల 8న 501 నుంచి 1000 వరకు, మూడో దశ ఈనెల 9న 1001 నుంచి 1404 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈనెల 14న స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్ల పరిశీలన, 15న ఎన్‌సీసీ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.

కేటగిరీలవారీగా కటాఫ్ సీజీపీఏ ఇలా

కేటగిరీ	బాలికలు	బాలురు
ఓసీ	10.2	10.2
ఈడబ్ల్యూఎస్	9.9	9.9
బీసీ–ఏ	10.1	10.1
బీసీ–బీ	10.1	10.1
బీసీ–సీ	9.3	9.3
బీసీ–డీ	10.1	101
బీసీ–ఈ	9.9	9.9
ఎస్సీ	10	10
ఎస్టీ	9.9	9.9

జిల్లాల వారీగా ఎంపికైన విద్యార్థుల సంఖ్య

సిద్దిపేట	322	మహబూబాబాద్	31	పెద్దపల్లి	14
సంగారెడ్డి	178	ఆదిలాబాద్	29	సూర్యాపేట	14
కామారెడ్డి	93	నల్లగొండ	27	వరంగల్ రూరల్	14
నిర్మల్	92	జగిత్యాల	25	నాగర్‌కర్నూల్	12
మెదక్	78	జనగామ	25	భద్రాద్రి కొత్తగూడెం	09
కరీంనగర్	71	మంచిర్యాల	24	వనపర్తి	9
నిజామాబాద్	68	వరంగల్ అర్బన్	22	మహబూబ్‌నగర్	7
రాజన్న సిరిసిల్ల	57	మేడ్చల్	20	ములుగు	7
రంగారెడ్డి	46	యాదాద్రి	18	కొమ్రంభీం ఆసిఫాబాద్	4
ఖమ్మం	41	జయశంకర్ భూపాలపల్లి	14	జోగుళాంబ గద్వాల	2
				ఆంధ్రప్రదేశ్ నుంచి	14

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.